www.jagritiweekly.com
సంపుటి : 77 సంచిక : 06 పుటలు : 52

# జాగృతి

కలి 5126-శ్రీ క్రోధి మార్గశిర శుద్ధ పాడ్యమి
02-08 డిసెంబర్ 2024
వెల : ₹20/-











# ‘మహా’ విజయం

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

77 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక



# ఇది ఉత్పన్న ఉత్సవం!

కేరళలోని ప్రముఖ ప్రభు రాముడి త్రిప్రయార్ శ్రీరామస్వామి మహాక్షేత్రంలో ఉత్పన్న ఏకాదశి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి. ఈ ఆలయంలో ప్రధానంగా రెండు ఉత్సవాలలో మార్గశిర మాస దశమి, ఏకాదశినాడు వైభవోపేతంగా వాటిని జరుపుతారు. శ్రీకృష్ణుడు ఆరాధించే శ్రీరాముడి విగ్రహం ద్వాపర యుగంలో సముద్రంలో కలిసిపోయి, కలియుగంలో చెట్టువ బ్యాక్‌వాటర్స్‌లో బెస్తవారికి దొరికిందట. చతుర్భుజాలను కలిగి పాంచజన్యం, సుదర్శనం, కోదండం, అక్షమాలతో చేతిలో ధరించిన రాముడు ఇక్కడ ఖర-హర అన్న అంశలో ఉంటాడు. మార్గశిర దశమి, ఏకాదశి నాడు ఈ ఆలయంలో ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఆలయానికి ధ్వజ స్తంభం లేకపోవడం విశేషం. కాగా, కేరళలో ఆలయంలో నిర్వహించే ప్రతి ప్రధాన ఉత్సవంలోనూ ఏనుగులు పాల్గొనడం ఇక్కడి విశేషం.



# దీపావళి నుండి సంక్రాంతి వరకు

# జాగృతి కానుక !

## త్వరపడండి..

ధర్మరక్షణ కోసం, ఈ మట్టి పరిమళంతో వెలువడుతున్న పత్రిక జాగృతి...

1948లో ప్రారంభమై 77 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ భావాల పత్రిక..జాగృతి..

గర్వించదగిన తెలుగు వారపత్రిక... ఎన్నో ప్రత్యేక సంచికలను వెలువరిస్తున్నది.

**ఇలాంటి పత్రికలో మీరు కూడా భాగస్వాములు కావాలని కోరుతున్నాము**

~~850/-~~ 750/-

**నవంబర్ 1 నుంచి జనవరి 15 వరకు**

**సం॥ర చందాలో రూ.100/- మరియు**

**5 సం॥రాల చందాలో రూ.500లు**

**ప్రత్యేక తగ్గింపును అందిస్తుంది.**

~~4000/-~~ 3500/-

## కావున వెంటనే మీరు చందాదారులుగా చేరండి.. చేర్పించండి...

జాగృతి చందాను ఆన్‌లైన్‌లో
మీ మొబైల్ నుంచి చెల్లించడానికి
ఇక్కడ ఉన్న క్యు.ఆర్. కోడ్‌లను
గూగుల్ సెర్చ్‌బార్‌లో ఉండే
గూగుల్ లెన్స్‌తో స్కాన్ చేయండి.
లేదా క్రిందనున్న లింక్‌లను ఉపయోగించండి.

సంవత్సర చందా రూ. 750/-
http://payit.cc/S18970

5 సం.రాల చందా రూ. 3500/-
http://payit.cc/S18973

సం.ర చందా మ్యాగ్జిన్ పోస్టు
వెల : రూ.1374/-
https://payit.cc/S32796

**Jagriti Bank A/c details**

Jagriti Prakashan Trust,
A/c No.920010061405325,
Axis Bank, Kothapet Branch,
Hyderabad. IFSC : UTIB0002157,

వివరాలకు సంప్రదించండి
సర్క్యులేషన్ మేనేజర్ :
040-2756 1453
99599 97013

jagritiweekly.com | facebook.com Jagriti Telugu Weekly | youtube.com/@Jagrititv | 3-4-228/4/1, Kachiguda, Hyderabad-027.

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.**

జి.తుకారాం : సర్క్యులేషన్ మేనేజర్
**040-27561453 / 9959997013**

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)**

| | | |
|---|---|---|
| కె. దుర్గారెడ్డి : | అసోసియేట్ ఎడిటర్ | - |
| సబ్ ఎడిటర్ : | - | **9959991304** |

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ

## చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అంకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ **"To Bank / UPID"** ఆప్షన్ వాడండి.

**Link / QR Code** ద్వారా మీ చందా చెల్లించినప్పుడు **Remarks** దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

**విడి ప్రతి రూ.20**

**5 సం॥ల చందా రూ.3500** | **సంవత్సర చందా రూ.750**

**బ్యాంకు ఖాతా వివరాలు**

**A/c Name & No. Jagriti Prakashan Trust, 92001006140532 5, Axis Bank, Kothapet Branch.**
**IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**


**– సర్క్యులేషన్ మేనేజర్, జాగృతి**

రాజ్యాంగం అంటే కేవలం న్యాయవాదుల పత్రం కాదు, అది ఒక యుగపు ఆత్మ, ఒక దేశ ఆత్మ అంటారు డాక్టర్ బీఆర్ అంబేద్కర్. ఇంకా చెప్పాలంటే అమలులోకి వచ్చిన తరువాత ఏ యుగానికైనా రాజ్యాంగం ఆత్మగానే ఉంటుంది. భారత రాజ్యాంగ వజ్రోత్సవాలు ఈ నవంబర్ 26న ఆరంభమయ్యాయి. స్వతంత్ర భారత వజ్రోత్సవాలు ఎంత ఆవశ్యకమో, రాజ్యాంగం వజ్రోత్సవాల నిర్వహణ అంతే ఆవశ్యకం. వీటికీ అంతే చారిత్రక, సామాజిక ప్రాముఖ్యం ఉంది. రాజ్యాంగం అంటే ఎనిమిది షెడ్యూల్స్, 395 అధికరణలు మాత్రమే కాదు. సుదీర్ఘ భారత స్వాతంత్ర్యోద్యమ తాత్త్వికతను, సాంఘికోద్యమాలు, సంస్కరణోద్యమాలు, రైతాంగ పోరాటాలు, గిరిజనోద్యమాలు భారతీయ సమాజంలో తెచ్చిన మార్పును ప్రతిఫలించేవే అవన్నీ. ఆధునికతను, ప్రపంచ చింతనలను సదా స్వాగతించే భారతీయ జీవన విధానం రాజ్యాంగాన్ని మలచడంలో విశిష్ట భూమికను నిర్వర్తించిందన్నదీ వాస్తవమే. దేశం ఐక్యంగా సాగడానికి ఒకనాడు స్వాతంత్ర్యోద్యమం దోహదం చేస్తే, స్వతంత్ర భారతదేశంలో అంతటి పాత్రను నిర్వహిస్తున్నది రాజ్యాంగమే మరి!

నవంబర్ 26,1949న రాజ్యాంగాన్ని రాజ్యాంగ పరిషత్ ఆమోదించింది. డిసెంబర్ 6,1946న రాజ్యాంగ పరిషత్ ఆవిర్భవించింది. ముసాయిదా సంఘం అధ్యక్షులుగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వ్యవహరించారు. ముస్లింలకు ప్రత్యేక దేశం కోరుకుంటున్న జిన్నా నాయకత్వంలోని ముస్లిం లీగ్ పరిషత్‌ను బహిష్కరించింది. భారత రాజ్యాంగ నిర్మాణం వెనుక గొప్ప చరిత్రే ఉంది. భారతదేశానికి రాజ్యాంగం అందించాలంటూ 1922లో అనీబిసెంట్ పిలుపునిచ్చారు. 1925లో బ్రిటిష్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కామన్వెల్త్ ఆఫ్ ఇండియా బిల్లు కూడా రాజ్యాంగాన్ని ప్రవేశపెట్టడం గురించే. బ్రిటిష్ ఇండియా రూపొందించిన 1909, 1919, 1935 భారత ప్రభుత్వ చట్టాలు స్వతంత్ర భారత రాజ్యాంగానికి పునాదులుగా చెబుతారు. ఇందులో 1919 చట్టం (మాంటేగ్-చమ్స్‌ఫర్డ్ సంస్కరణలు) పనితీరును సమీక్షించడానికి ఉద్దేశించినదే సైమన్ కమిషన్ (1927). లిబరల్ పార్టీ ఎంపీ సర్ జాన్ సైమన్ నాయ కత్వంలో ఐదుగురు సభ్యులతో ఈ కమిషన్‌ను ఏర్పాటైంది. భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చినప్పుడు ప్రధానిగా ఉన్న క్లెమెంట్ అట్లీ కూడా ఇందులో సభ్యుడు. ఈ కమిషన్ ఉద్దేశం భారత్‌కు రాజ్యాంగం అందించడం. కానీ ఒక్క భారతీయుడికి

**శాలివాహన 1946 శ్రీ క్రోధి మార్గశిర శద్ధ పాడ్యమి**

## లోపలి పేజీలలో...




ముఖపత్ర కథనం
**'మహా విజయం'** 6లో

ధారావాహిక నవల
**తూర్పు-పడమర**
– గన్నవరపు నరసింహమూర్తి 20లో



ప్రత్యేక వ్యాసం
**విశిష్ట వ్యక్తిత్వ వికాసానికి గీతాధ్యయనం** 26లో



## సంపాదకీయం

# రాజ్యాంగ వజ్రోత్సవాలు

స్థానం లేదు. ఫలితమే సైమన్ గో బ్యాక్ ఉద్యమం. అయినా ఈ కమిషన్‌లో భారతీయుడికి స్థానం కల్పించడానికి ఒప్పుకోని బ్రిటిష్ ప్రభుత్వం, భారతీయులే ఒక రాజ్యాంగాన్ని రాసుకుని చూపించాలని సవాలు వంటిది విసిరింది. దీనితోనే మోతీలాల్ నెహ్రూ నాయకత్వంలో జవాహర్‌లాల్, సప్రూ సభ్యులుగా ఒక రాజ్యాంగ రచనా సంఘం ఏర్పడింది. 1928లో భారత జాతీయ కాంగ్రెస్ కలకత్తాలో ప్రత్యేక సమావేశం జరిపి దీనిపై చర్చించింది. కానీ ఇందులో ముస్లింలకు వరాలుగా ఇచ్చిన 1916 నాటి లక్నో కాంగ్రెస్ వాగ్దానాలు లేనందున ముస్లిం లీగ్ అంగీకరించదని జిన్నా అభ్యంతర పెట్టాడు. అది కాలగర్భంలో కలసిపోయింది. 1930–32 నాటి రౌండ్ టేబుల్ సమావేశాలలోను ఈ అంశం చర్చకు వచ్చింది. రాజ్యాంగ పరిషత్ ఏర్పాటు అవసరమంటూ 1934లో ఎంఎన్ రాయ్ కూడా పిలుపునిచ్చారు. 1937–39 మధ్య జాతీయ కాంగ్రెస్ సమావేశాలు అనేక పర్యాయాలు అలాంటి పిలుపునే ఇచ్చాయి. 1940 మొత్తానికి బ్రిటిష్ పార్లమెంట్ అంగీకరించింది. రాజ్యాంగ పరిషత్ ఏర్పాటు గురించి క్రిప్స్ మిషన్ ప్రయత్నించినా కాంగ్రెస్, లీగ్ విభేదాలు అవకాశం ఇవ్వలేదు. 1945 సిమ్లా సమావేశంలో కూడా ఇందుకు పిలుపు వచ్చింది. రెండో ప్రపంచ యుద్ధానంతర పరిణామాలు, భారత్‌కు స్వాతంత్ర్యం ఇవ్వాలన్న బ్రిటన్ తుది నిర్ణయం తరువాత రాజ్యాంగ పరిషత్ ఆవిర్భవించింది.

2023 వరకు భారత రాజ్యాంగానికి 106 సవరణలు జరిగాయి. మనది సరళ రాజ్యాంగం కాబట్టి ఈ చర్య అసహజం కాదు. భారత దేశ వైవిధ్యానికి తగ్గట్టు, కాలానికి అనుగుణంగాను మాత్రమే ఈ మార్పులు జరిగాయి. ఇది ఆహ్వానించదగినదే కానీ, ఆక్షేపణీయం కాదు. అలాగే కొన్ని చర్చనీయాంశమని చెప్పడానికి అభ్యంతరం ఉండనక్కరలేదు.

వజ్రోత్సవాల వేళ కొన్ని అంశాలను తప్పనిసరిగా చర్చించాలి. అందులో మొదటిది– రాజ్యాంగం ఇచ్చిన హక్కులతోనే రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బ తీసే ఒక విపరిణామం. రాజ్యాంగాన్ని అడ్డం పెట్టుకుని రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేయడం– ఇప్పుడు భారత్‌లో రాజ్యమేలుతున్న పోకడ. హక్కుల గురించే తప్ప బాధ్యతల గురించి పట్టని వ్యవస్థ, అందుకు దోహదం చేసే ఆలోచనలు దేశంలో బలిసిపోతున్నాయి. రాజ్యాంగానికి పోటీ అనదగిన పర్సనల్ లాను వ్యవస్థలో చొప్పించడానికి జరుగుతున్న ప్రయత్నం ఒకటి. దీనిని నిరాకరించడం మైనారిటీలకు రాజ్యాంగం ఇచ్చిన హక్కులను ధిక్కరించడమేనని వికృత భాష్యం చెప్పే విపరీత ధోరణి ఇటీవలి దారుణం. ఒక వర్గానికి అనుకూలంగా సాక్షాత్తు దేశ అత్యున్నత స్థానం ఇచ్చిన తీర్పును సైతం గౌరవించబోమని తెగేసి చెప్పడం, ఇలా గౌరవించకపోవడం కూడా రాజ్యాంగ హక్కుగా ప్రచారం చేయడం జుగుప్సాకరమే. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను కూల్చడానికి హక్కు ఉండాలన్నట్టు మాట్లాడడం, పార్లమెంటరీ వ్యవస్థ గౌరవాన్నీ, ప్రాధాన్యాన్నీ తృణీకరించడానికి భావ ప్రకటనా స్వేచ్ఛ ఉండాలని చెప్పడం, ఇది కూడా రాజ్యాంగ ఇచ్చిన వెసులుబాటేనని దబాయించడం ఇటీవలి పరిణామమే. బుజ్జగింపు రాజకీయాలు మన రాజ్యాంగ వ్యవస్థకి పెను సవాలు. నేర రాజకీయాలను అరికట్టలేని దుస్థితికి రాజ్యాంగాన్ని తీసుకువెళ్లే ప్రయత్నాలు కూడా తక్కువేమీ కాదు. ఫెడరల్ వ్యవస్థను ఇంత దారుణంగా అపహాస్యం చేసే దుస్థితి వస్తుందని బహుశా రాజ్యాంగ నిర్మాతలు భావించలేదేమో! దేశం నుంచి రాష్ట్ర విభజన మాటలు చెప్పడం రాజ్యాంగ విరుద్ధమని హెచ్చరిస్తే అది కాస్తా ఫెడరల్ వ్యవస్థను దెబ్బ తీసే చర్యగా ప్రచారమవుతున్నది. బుజ్జగింపు, కుటుంబ రాజకీయాలు కొందరి నోటి నుంచి రాజ్యాంగ విరుద్ధమైన మాటలనే మాట్లాడిస్తున్నాయి. దేశ సమైక్యతే స్ఫూర్తిగా సాగిన స్వాతంత్ర్య పోరాటం స్వరాజ్యానికి రాజ్యాంగాన్ని ఇచ్చింది. రాజ్యాంగం ప్రజాస్వామ్యాన్ని ఇచ్చింది. వీటిని పూర్తిగా మరచిపోయే స్థితి రాకూడదు. రాజ్యాంగం ఇవాళ దేశానికి దిక్సూచి. ★

02 డిసెంబర్ 2024, సోమవారం | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్



36లో

కథ

**భరతమాత**

– గోగినేని రత్నాకరరావు





| | | |
|---|---|---|
| ఎక్కే విమానం.. దిగే విమానం...(తెలంగాణ) | – | 14 |
| 2027 చివరకు పోలవరం...కర్నూలులో 'బెంచ్' (ఆంధ్రప్రదేశ్) | – | 16 |
| భారత ప్రగతిని అడ్డుకోవడమే లక్ష్యం (జాతీయం) | – | 22 |
| దేవదేవుడే స్వయంగా దర్శనమిచ్చిన భక్తుడు (సంప్రదాయం) | – | 24 |
| పారిస్ వేదికపై నారీ నగారా రుక్మిణమ్మ (మహిళ) | – | 28 |
| మూడో ప్రపంచ యుద్ధం కోసం డీప్‌స్టేట్... (అంతర్జాతీయం) | – | 30 |
| అక్కడ హిందువు కావడమే నేరమా! (అంతర్జాతీయం-1) | – | 34 |
| ఐపీఎల్– 2025 వేలంలో రికార్డుల మోత! (క్రీడ) | – | 43 |
| బాలజాగృతి | – | 46 |
| రిపేర్ పూర్తిగా చేయని 'మెకానిక్ రాకీ' (సినిమా) | – | 50 |

# 'మహా' విజ



విజయోత్సవంలో దేవేంద్ర ఫడణవీస్

దేశంలో సార్వత్రిక ఎన్నికలు ముగిసిన ఐదు నెలల వ్యవధిలో జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు అన్ని రాజకీయాలకు పార్టీలకు కీలకంగా మారాయి. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 'అబ్ కీ బార్ చార్ సౌ పార్' నినాదంతో ముందుకు సాగిన భారతీయ జనతా పార్టీ 240 సీట్లకే పరిమితం కావడంతో భారతదేశ రాజకీయాల్లో పెను మార్పులు సంభవిస్తాయని మన దేశంపై కుట్రలు పన్నే కొన్ని అంతర్జాతీయ దుష్టశక్తులతో పాటు దేశంలోని కుహనా మేధావులూ ఆశించారు. వీరికి కాంగ్రెస్ కూడా తోడయ్యింది. అయితే మహారాష్ట్రీయులు వీరి కుట్రలను ఛేదిస్తూ చారిత్రాత్మకమైన తీర్పు ఇస్తూ మహాయుతిని మరోసారి గెలిపించారు.

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ మహారాష్ట్రలో ఆశించిన స్థాయిలో రాణించలేక పోయింది. దీంతో ఇక బీజేపీ పని అయిపోయిందని ఆశించిన వారికి మహారాష్ట్ర ప్రజలే తిరిగి ఐదు నెలల విరామంలో తగిన సమాధానం చెబుతూ మహాయుతి కూటమికి 49.08 శాతం ఓట్లతో 234 స్థానాలు కట్టబెడుతూ, మహావికాస్ అఘాడీ (ఎమ్‌వీఏ)ని 35.16 శాతం ఓట్లతో 50 స్థానాలకే పరిమితం చేస్తూ తీర్పు ఇచ్చారు. లోకసభ ఎన్నికలకు, అసెంబ్లీ ఎన్నికలకు ఏమాత్రం పొంతన లేకుండా మహారాష్ట్రలో వచ్చిన ఫలితాలు రాజకీయ పండితులను ఆశ్చర్యపరిచాయి. మహాయుతి కూటమిలో పెద్దన్న పాత్ర పోషించిన బీజేపీ 145 స్థానాల్లో పోటీ చేసి 26.77 శాతం ఓట్లతో 132 స్థానాల్లో విజయం సాధించి అతి పెద్ద పార్టీగా అవతరించింది. కూటమిలో శివసేన (ఏక్‌నాథ్ శిండే) పార్టీ 81 స్థానాల్లో పోటీ చేసి 12.38 శాతం ఓట్లతో 57 సీట్లు సాధించి రెండో పెద్ద పార్టీగా నిలిచింది. ఎన్సీపీ (అజిత్ పవార్) పార్టీ 59 స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టి 9.01 ఓట్ల శాతంతో 41 స్థానాల్లో గెలిచి మూడో అతి పెద్ద

**యం**





**బీజేపీ అంటే ఈ దేశపు మట్టి. అంతేకాని మట్టి ముద్ద కాదు. గోడకి కొడితే కిందిపడిపోదు. బంతిలా వెనకకు వస్తుంది. మహారాష్ట్రలో ఇదే జరిగింది. నాలుగైదు నెలల క్రితం జరిగిన లోక్‌సభ ఎన్నికలలో కాస్త వెనకడుగు వేసింది. కానీ అసెంబ్లీ ఎన్నికలలో మహాయుతి 80 శాతం అసెంబ్లీ స్థానాలు గెలిచి జాతిని సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తింది. అదే సమయంలో బీజేపీ పని అయిపోయింది అంటూ చంకలు గుద్దుకునే వారికి మరొకసారి శరాఘాతంలా పరిణమించింది. మహారాష్ట్ర అసెంబ్లీలోని 288 స్థానాలకు గాను 234 గెలిచింది మహాయుతి కూటమి. ముఖ్యమంత్రిగా దేవేందర్ ఫడణవీస్‌కు మరొక అవకాశం ఇవ్వాలని బీజేపీ కేంద్ర నాయకత్వం నిర్ణయించినట్టు వార్తలు వచ్చాయి.**

పార్టీగా నిలిచింది. మరోవైపు ఎమ్‌వీఏలో పెద్దన్న పాత్ర పోషించిన కాంగ్రెస్ 102 స్థానాల్లో పోటీ చేసి 12.42 శాతం ఓట్లతో కేవలం 16 స్థానాలకే పరిమితమైంది. కూటమిలో శివసేన (ఉద్ధవ్ ఠాక్రే) పార్టీ 92 స్థానాల్లో పోటీ చేసి 9.96 శాతం ఓట్లతో 20 స్థానాల్లో గెలిచి కూటమిలో ఎక్కువ సీట్లు సాధించిన పార్టీగా నిలిచారు. మహారాష్ట్ర రాజకీయాల్లో సుదీర్ఘకాలం చక్రం తిప్పిన సీనియర్ నేత శరద్‌పవార్‌కు చెందిన ఎన్సీపీ 86 స్థానాల్లో పోటీ చేసి 11.28 శాతం ఓట్లతో కేవలం 10 సీట్లే గెలిచింది. ఈ ఫలితాలను గమనిస్తే మహారాష్ట్ర ఓటర్లు బీజేపీ నేతృత్వంలోని 'మహాయుతి'కి బ్రహ్మ రథం పడుతూ, కాంగ్రెస్ నేతృత్వంలోని 'ఎమ్‌వీఏ' కూటమిని కోలుకోలేని దెబ్బ తీశారని కచ్చితంగా చెప్పవచ్చు.

మహారాష్ట్ర రాజకీయాల్లో రెండు దశాబ్దాలుగా సోషలిజం అనుకూల, జాతీయవాదం అనుకూల వాదుల మధ్య పోరు నడుస్తుండడంతో కాంగ్రెస్ ఒక వైపు, బీజేపీ మరోవైపు ఉంటున్నాయి. ప్రధానంగా బీజేపీ, శివసేన ఒక కూటమిగా, కాంగ్రెస్ మరో కూటమిగా ఉండేవి. శివసేన నేత బాల్‌ఠాక్రే మరణానంతరం రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు సంభవించాయి. ఆయన అనంతరం పార్టీ బాధ్యతలు స్వీకరించిన బాల్‌ఠాక్రే కుమారుడు ఉద్ధవ్ ఠాక్రే బీజేపీని దూరం చేసుకొని 2014 ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయడంతో పాతికేళ్ల బీజేపీ–శివసేన బంధానికి తెరపడ్డట్టయ్యింది. అయితే ఈ ఎన్నికల్లో బీజేపీ 122 స్థానాలతో అతి పెద్దగా పార్టీగా అవతరించడంతో 63 సీట్లు గెలిచిన శివసేన తప్పనిసరి పరిస్థితుల్లో బీజేపీ ప్రభుత్వానికి మద్దతుగా నిలిచింది. 2014 అనుభవంతో పాఠం నేర్చిన ఉద్ధవ్ ఠాక్రే 2019లో బీజేపీతో పొత్తు పెట్టుకోవడంతో ఈ కూటమికి ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన మెజార్టీ



అజిత్ పవార్ ఏక్‌నాథ్ శిండే

వచ్చింది. బీజేపీ 105 స్థానాల్లో, శివసేన 56 స్థానాల్లో గెలిచాయి. అయితే సీఎం పదవిపై కన్నేసిన శివసేన నేత ఉద్ధవ్‌ఠాక్రే, అధిక స్థానాలు గెలిచిన బీజేపీకి ముఖ్యమంత్రి పదవి ఇవ్వడంపై బెట్టు చేశారు. దీంతో కలిసి పోటీ చేసిన ఈ రెండు పార్టీల మధ్య విభేదాలు రావడంతో రాష్ట్ర రాజకీయాల్లో కురువృద్ధుడైన శరద్‌పవార్ వేసిన పాచికలు రాష్ట్రంలో రాజకీయ అనిశ్చితికి కారణమైంది. తన అన్న కుమారుడు అజిత్ పవార్‌ను బీజేపీ వద్దకు పంపి మద్దతిస్తున్నట్టు తెర వెనుక నాటకం ఆడి, ప్రభుత్వం ఏర్పాటైన ఐదు రోజుల్లోనే ఫడణవీస్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వాన్ని కుప్ప కూల్చారు. అనంతరం ఉద్ధవ్‌ఠాక్రేకు ముఖ్యమంత్రి పదవి ఆశ జూపడంతో కాంగ్రెస్, ఎన్సీపీతో మద్దతుతో మహారాష్ట్రలో 'మహా వికాస్ అఘాఢీ' (ఎంవీఏ) ప్రభుత్వం ఏర్పాటైంది. మహారాష్ట్ర రాజకీయాల్లో చక్రం తిప్పిన బాలఠాక్రేకు పలుమార్లు అవకాశాలు వచ్చినా ఎన్నడూ అధికారం కోసం పాకులాడలేదు. జాతీయతవాదమే లక్ష్యంగా నిర్ణయాలు తీసుకునే వారు. అందుకు భిన్నంగా ఉద్ధవ్ ఠాక్రే అధికారం కోసం కుటుంబం ఒత్తిడికి లొంగి కాంగ్రెస్‌తో జతకట్టడం రాష్ట్రంలోనే కాదు, దేశవ్యాప్తంగా సంచలనం రేపింది.

కాంగ్రెస్ పార్టీ విధానాల వ్యతిరేకతతో ఆవిర్భవించిన శివసేన అధికారం కోసం అదే పార్టీ పంచన చేరడంతో తట్టుకోలేని శివసేన నేతలు తిరుగుబాటు చేయడంతో రెండు సంవత్సరాల అనంతరం శివసేనలో చీలికవచ్చి ఎంవీఏ ప్రభుత్వం కుప్ప కూలింది. ఏక్‌నాథ్ శిండే నేతృత్వంలోని శివసేన వర్గం బీజేపీతో జతకట్టడంతో 'మహాయుతి' ప్రభుత్వం ఏర్పాటైంది. ఈ సందర్భంగా బీజేపీ పోషించిన పాత్ర కీలకమైంది. 105 స్థానాలతో రాష్ట్రంలో అతిపెద్ద పార్టీగా నిలిచిన బీజేపీ తాను కాదని శివసేనకు చెందిన ఏక్‌నాథ్ శిండేకు ముఖ్యమంత్రి పదవి ఇవ్వడంతో రాష్ట్ర రాజకీయాల్లో పలు మార్పులు సంభవించాయి. అనతికాలంలోనే శరద్‌పవార్‌తో విభేదించిన అజిత్ పవార్ కూడా పార్టీని చీల్చి తన వర్గంతో 'మహాయుతి' కూటమితో జతకట్టారు. అనంతరం రెండు పార్టీల రెండు గ్రూపులు కోర్టుల కెక్కడంతో అత్యున్నత న్యాయస్థానం పార్టీ పేరును, పార్టీ గుర్తును ఏక్‌నాథ్ శిండేకి, అజిత్ పవార్‌లకే కేటాయించడంతో శివసేన (ఏకనాథ్ శిండే), శివసేన (ఉద్ధవ్ ఠాక్రే), ఎన్సీపీ (అజిత్ పవార్), ఎన్సీపీ (శరద్ పవార్) పార్టీలుగా మారాయి. ఈ ఘటనలు మహారాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్నే మార్చివేశాయి.

ఈ చీలికల రాజకీయ పరిణామాల మధ్య 2024 లోక్‌సభ ఎన్నికల్లో 'మహాయుతి', ఎంవీఏ కూటములు పోటాపోటీగా తలపడగా అనేక కారణాలతో ఎంవీఏ 'మహాయుతి'పై పైచేయి సాధించింది. మొత్తం 48 లోక్‌సభ స్థానాల్లో 30 సీట్లను 43.71 శాతం ఓట్లతో ఎంవీఏ గెల్చుకుంది. ఎంవీఏలో 17 స్థానాల్లో పోటీ చేసిన కాంగ్రెస్ 16.92 శాతం ఓట్లతో 13 సీట్లను, 21 స్థానాల్లో పోటీ చేసిన శివసేన (ఉద్ధవ్ ఠాక్రే) 16.52 శాతం ఓట్లతో 9 సీట్లను, ఎన్సీపీ (శరద్‌పవార్) 10 స్థానాల్లో పోటీ చేసి10.27 శాతం ఓట్లతో 8 సీట్లను గెలిచాయి. మరోవైపు మహారాష్ట్రపై ఎన్నో ఆశలు పెట్టుకున్న బీజేపీ కూటమి 17 స్థానాల్లోనే గెలిచి భంగపాటుకు గురయ్యింది. మహాయుతి కూటమిలో 28 స్థానాల్లో పోటీ చేసిన బీజేపీ 26.18 శాతం ఓట్లతో 9 సీట్లను, శివసేన (ఏకనాథ్ శిండే) 15 స్థానాల్లో పోటీ చేసి 12.95 శాతం ఓట్లతో 7 సీట్లను, ఎన్సీపీ (అజిత్‌పవార్) 4 స్థానాల్లో పోటీ చేయగా 3.60 శాతం ఓట్లతో ఒక సీటును గెలవగా, ఆర్ఎస్పీ ఒక స్థానంలో పోటీ చేసి ఓడిపోయింది.

ఈ ఫలితా లను పరిగణలోకి తీసుకొని శాసనసభ ఎన్నికల్లో ఎమ్‌వీఏ కూటమికి 150కు పైగా స్థానాలొస్తాయని, మహాయుతి కూటమికి ఓటమి తప్పదని పలు మీడియా సంస్థలు, రాజకీయ పండితులు, ఎన్నికల వ్యూహకర్తలు అంచనా వేసినా, వాటిని మహాయుతి పటాపంచలు చేస్తూ అద్భుత విజయంతో ప్రభంజనాన్ని సృష్టించింది.

స్థానికంగా ఏర్పడిన పలు రాజకీయ కారణాలతో మహారాష్ట్రలో లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఆశించిన ఫలితాలు సాధించలేకపోయింది. విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కోసం ఉద్యమించిన మరాఠాలు బీజేపీ తమకు అనుకూల నిర్ణయం తీసుకోవడంలో ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తుందనే భావనతో ప్రత్యేకించి విదర్భ ప్రాంతంలో మహాయుతికి వ్యతిరేకంగా ఓటు వేశారు. మరోవైపు బీజేపీకి 400 స్థానాలొస్తే భారత రాజ్యాంగాన్ని మార్చేస్తారని, రిజర్వేషన్లకు ముప్పు వాటిల్లుతుందనే కాంగ్రెస్ చేసిన అసత్య ప్రచారంతో దళితులు ఎమ్‌వీఏ వైపు మొగ్గారు. వీటికి తోడు స్వచ్ఛంద సేవ పేరు చెప్పుకునే ఎన్జీఓలు కూడా బీజేపీకి వ్యతిరేకంగా చాపకింద నీరులా పనిచేశారు. ముస్లిం ఓటర్లు ఎట్టి పరిస్థితుల్లో బీజేపీకి అవకాశమివ్వద్దనే ఆలోచనతో వ్యూహాత్మ కంగా ఓటింగ్ వేశారు. ఇందుకు దూలే పార్లమెంట్ నియోజకవర్గాన్ని ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఇక్కడ 2014, 2019లో వరుసగా రెండు సార్లు గెలిచి పటిష్టంగా ఉన్న బీజేపీని ఓడించడానికి కాంగ్రెస్ మత పాచికను వాడింది. ఈ పార్లమెంట్ పరిధిలోకి వచ్చే ఆరు అసెంబ్లీ సెగ్మెంట్లలోని ఐదు సెగ్మంట్లలో 1.90 లక్షల ఆధిక్యత సాధించిన బీజేపీ అభ్యర్థి, ముస్లిం ఓటర్లు అధికంగా ఉండే ఒక్క మాలేగావ్ సెంట్రల్ సెగ్మెంట్‌లోనే 1.94 లక్షల ఓట్లు వెనుకబడి కేవలం 4 వేల ఓట్లతో ఓడిపోయారు. ఇలా దాదాపు 14 నియోజకవర్గాల్లో ముస్లింలు నిర్ణయాత్మకంగా బీజేపీ ఓటమికి కారకులయ్యారు.

లోక్‌సభ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో మహారాష్ట్రలో పట్టుకోసం అన్ని పార్టీలు ముందస్తుగా జాగ్రత్తపడి వ్యూహరచనలు చేశాయి. మరాఠాలతో ఏర్పడే నష్టాన్ని అంచనావేసిన బీజేపీ ఓబీసీలకు, ఎస్సీల్లో బౌద్ధులకు చేరువయ్యేందుకు ప్రయత్నించి సఫలమైంది. ముస్లింలు కలిసికట్టుగా ఉద్దేశపూర్వకంగా బీజేపీని ఎలా ఓడిస్తున్నారో తెలియజేస్తూ, కలిసి ఉంటేనే సురక్షితంగా ఉంటామంటూ ప్రధాని మోదీ మొదలు బీజేపీ అగ్ర నేతలందరూ చేసిన ప్రచారం మంచి ఫలితాలిచ్చాయి. మరోవైపు పట్టణ ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వ సాయంతో పలు మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను చేపట్టి వేగవంతంగా పూర్తి చేసింది. రైతుల సమస్యలను గుర్తించి షెత్కారీ సమ్మాన్ యోజనను ఏడాదికి రూ.12 వేల నుండి 15 వేలకు పెంచింది. ఉల్లి

ఎగుమతిపై నిషేధాన్ని తొలగించింది. ఇవన్నీ అసెంబ్లీ ఎన్నికల్లో 'మహాయుతి' కూటమి గెలుపునకు దోహదపడ్డాయి. ప్రత్యేకించి కాంగ్రెస్‌కు గట్టి పట్టున్న విదర్భ ప్రాంతంలో బీజేపీ ఆ పార్టీతో అధిక స్థానాల్లో ముఖాముఖిగా తలపడడంతో 71 స్థానాలున్న ఈ ప్రాంతంలో 60 పైగా స్థానాల్లో 'మహాయుతి' గెలిచింది.

అన్నింటికంటే ప్రధానమైంది 'మాజీ లడ్కీ యోజన' కింద అర్హులైన మహిళలకు 1500 రూపాయలు అందించింది మహాయుతి ప్రభుత్వం. ఇదే సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన గ్యారెంటీలను మహారాష్ట్ర ఓటర్లు విశ్వసించలేదు. కాంగ్రెస్ తెలంగాణలో ఐదు గ్యారెంటీలలో భాగంగా మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామని ప్రకటించినట్టు మహారాష్ట్ర పత్రికల్లో ఫుల్ పేజీ ప్రకటనలిచ్చింది. దీనికి కౌంటర్‌గా బీజేపీ తెలంగాణలో హామీ ఇచ్చిన కాంగ్రెస్ దానిని నెరవేర్చలేదని, మహారాష్ట్రలో ఇప్పటికే మహాయుతి ప్రభుత్వం మహిళల ఖాతాల్లో 'మాజీ లడ్కీ యోజన' కింద డబ్బులు వేసిందని ప్రచారం చేసింది. మహారాష్ట్రలో మహాయుతి విజయానికి ప్రధాన కారణం ఈ పథకంతో లబ్ధి పొందిన మహిళలు ఆదరించడమే.

మహారాష్ట్రలో 2019 అసెంబ్లీ ఎన్నికల్లో కూటమిగా పోటీ చేసిన బీజేపీ, శివసేన పార్టీలు వేరుపడి నూతన కూటములుగా ఏర్పడడం, అనతికాలంలోనే ప్రాంతీయ పార్టీలైన శివసేన, ఎన్సీపీలలో చీలికి వచ్చి ఒక్కో గ్రూపు ఒక్కో జాతీయ పార్టీతో జతకట్టడం వంటి రాజకీయాల పరిణామాల నేపథ్యంలో 2024 దేశసార్వత్రిక ఎన్నికల్లో, 2024 అసెంబ్లీ ఎన్నికల్లో తమ బలాన్ని నిరూపించు కోవాల్సిన ఆవశ్యకత అన్ని పార్టీలకు ఏర్పడింది. లోక్‌సభ ఎన్నికల్లో ఎమ్‌వీఏ మహాయుతి ఆధిపత్యం కనబర్చడంతో రాజకీయ అవకాశాల కోసం పార్టీలను చీల్చే బీజేపీని మహారాష్ట్ర ప్రజలు తిరస్కరించారనే వాదన మొదలైంది. బీజేపీపైనే కాకుండా ఏక్‌నాథ్ శిండే, అజిత్‌పవార్‌లు తమ పార్టీని చీల్చడంతో, ఉద్ధవ్ ఠాక్రే, శరద్ పవార్‌లపై సానుభూతి ఏర్పడిందని, ప్రజలు 'మహాయుతి'ని అసెంబ్లీ ఎన్నికల్లో శిక్షిస్తారని పెద్ద ఎత్తున చర్చ జరిగింది. ఈ నేపథ్యంలో అన్ని పార్టీలకు 2024 అసెంబ్లీ ఎన్నికలు కీలకంగా మారాయి.

మరోవైపు జాతీయ పార్టీలు బీజేపీ, కాంగ్రెస్‌కు దేశ రాజకీయాల్లో పట్టు సడలకుండా ఉండాలంటే పెద్ద రాష్ట్రాల్లో ఒకటైన మహారాష్ట్రలో తమ బలాన్ని నిరూపించుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. నిజమైన శివసేన, ఎన్సీపీ ఎవరిదో ప్రజలు తేలుస్తారనే ఆందోళన వాటికి జీవన్మరణ సమస్యగా మారింది. కురువృద్ధుడు శరద్ పవార్ జీవిత చరమాంకంలో


శరద్ పవార్


ఉద్ధవ్ ఠాక్రే



రాహుల్

ఇవి తనకు చివరి ఎన్నికలంటూ సానుభూతి పొందేలా ప్రచారం చేసినా ఆ పార్టీని కేవలం పది స్థానాలకు పరిమితం చేశారు. అయితే పార్టీని చీల్చారనే సానుభూతి లోక్‌సభ ఎన్నికల్లో వలే తమకు మళ్లీ లాభిస్తుందని ఎమ్‌వీఏ కూటమి ఆశించినా, అసెంబ్లీ ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీలపై సానుభూతి 'మహాయుతి' కూటమి వైపు పనిచేసింది. నిఖార్సైన హిందూ వాది శివసేన నేత బాల్‌ఠాక్రే కుమారుడైన ఉద్ధవ్ ఠాక్రే కాంగ్రెస్‌తో జతకట్టడం, మైనార్టీ ఓట్ల కోసం బుజ్జగింపుల రాజకీయాలకు పాల్పడడం శివసేన అభిమానులకు రుచించలేదు. దాన్ని వారు జీర్ణించుకోలేక ఉద్ధవ్ వర్గం శివసేనను తిరస్కరించి ఏకపక్షంగా 'మహాయుతి'లో భాగమైన ఏక్‌నాథ్ శిండే శివసేనకే మద్దతుగా నిలిచారు. ఎన్సీపీలో కూడా పార్టీ అభివృద్ధి కోసం కృషి చేసిన అజిత్ పవార్‌ను కాదని శరద్ పవార్ తన కుమార్తె సుప్రియా సూలేకు ప్రాధాన్యం ఇవ్వడంతో ఎన్సీపీ సానుభూతిపరులు 'మహాయుతి'లోని అజిత్ పవార్ వర్గానికే మద్దతిచ్చారు.

అధికారమే లక్ష్యంగా దేశ ప్రజల్లో ప్రధానంగా హిందువులలో కులాల పేరుతో చిచ్చు రేపి లబ్ధి పొందాలని చూసిన కాంగ్రెస్‌ను మహారాష్ట్ర చరిత్రలో లేనివిధంగా అధఃపాతానికి తొక్కేశారు మహారాష్ట్రీయులు. వందేళ్ల చరిత్ర గల పార్టీగా ఢంకా భజాయించుకునే కాంగ్రెస్ మహారాష్ట్రలో 34 ఏళ్లుగా సొంతంగా మెజార్టీ సాధించలేకపోతోంది. 1991లో 141 స్థానాలు సాధించిన కాంగ్రెస్ ఇప్పటి వరకు తిరిగి మూడెంకల సీట్లను పొందలేక పోయింది. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్నడూ లేనివిధంగా ఆ పార్టీ 16 స్థానాలకే పరిమితమవడం కూడా ఒక చరిత్రనే.

'మహా'సంగ్రామంగా జరిగిన మహారాష్ట్ర ఎన్నికల్లో మహారాష్ట్రీయులు ఎంతో నేర్పుతో తీర్పు ఇచ్చి, జాతీయ వాద వ్యతిరేకులకు కర్రు కాల్చి వాత పెట్టారు. గత లోక్‌సభ ఎన్నికల్లో, కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో తెరవెనుక పనిచేసి బీజేపీకి నష్టం కలిగించిన ఎన్జీఓ సంస్థలకు మహారాష్ట్ర ప్రజలు తగిన బుద్ధి చెప్పారు. భారత్ దేశాన్ని ఆర్థికంగా బలహీన పర్చాలని అంతర్జాతీయ స్థాయిలో జరుగు తున్న కుట్రల్లో భాగంగా ఆర్థిక రాజధాని ముంబాయి కేంద్రమైన మహారాష్ట్రలో బీజేపీని ఓడించడానికి అన్నివిధాలా ప్రయత్నించిన పలు ఎన్జీఓ సంస్థల, కుహనా మేధావుల కుట్రలను ఛేదించిన మహారాష్ట్ర ప్రజలకు 'మహాయుతికి' తిరుగులేని ఆధిక్యతిచ్చి దేశంలో ఆదర్శంగా నిలిచి చరిత్ర సృష్టించారు.

దేశ సాంస్కృతిక, సార్వభౌమత్వాన్ని కాపాడ డంలో ఎల్లప్పుడూ ముందుండే మహారాష్ట్ర ప్రజలు రాష్ట్ర శాసనసభ ఎన్నిల్లో చారిత్రాత్మక తీర్పునిస్తూ తాము హైందవ రక్షకుడు ఛత్రపతి శివాజీ వారసులం అని ప్రపంచానికి చాటి చెప్పారు. భారతదేశ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడంలో కీలక పాత్ర పోషించిన చరిత్ర కలిగిన మహారాష్ట్ర మరోసారి చరిత్ర సృష్టించింది. అధికారమే లక్ష్యంగా శాసనసభ ఎన్నికల్లో ఎన్నో కుట్రలు, కుతంత్రాలకు పాల్పడిన జాతీయ వ్యతిరేకులకు తగినరీతిలో బుద్ధి చెప్పి ధర్మం కోసం, దేశం కోసం మహారాష్ట్రీయులు ఎప్పుడూ ముందుంటారని మరోసారి నిరూపించారు.



**డా.ఐ.వి.మురళీ కృష్ణ శర్మ**
సీనియర్ జర్నలిస్ట్



# ఉత్తరప్రదేశ్‌లో బదులు తీర్చిన కమలం

**మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలతో పాటు దేశంలో దేశంలో 46 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు కూడా జరిగాయి. ఇందులో 26 స్థానాలు బీజేపీ, మిత్రపక్షాలే కైవసం చేసుకున్నాయి. ఈ ఫలితాలన్నీ నవంబర్ 23న వెలువడినాయి. బీజేపీ తరువాత కాంగ్రెస్ ఏడు స్థానాలు గెలిచింది. కానీ ఆరు పాత స్థానాలు కోల్పోయింది. తృణమూల్ కాంగ్రెస్, ఆప్, సమాజ్‌వాదీ పార్టీ 6,3,2 వంతున సీట్లు గెలిచాయి. కేరళలో వామపక్ష ఫ్రంట్, రాజస్తాన్‌లో బీఏపీ ఒక్కొక్క స్థానం గెలిచాయి. సిక్కింలో రెండు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికల జరగగా రెండు కూడా సిక్కిం క్రాంతికారి మోర్చా గెలిచింది. వాయినాడ్, నాందేడ్ లోక్‌సభ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికలలో కాంగ్రెస్ విజయం సాధించింది.**

2024 లోక్‌సభ ఎన్నికలలో ఉత్తర ప్రదేశ్‌లో బీజేపీకి ఎదురైన చేదు ఫలితాలు తాత్కాలికమేనని ఉప ఎన్నికల ఫలితాలు వెల్లడించాయి. ఎన్నికలు జరిగిన తొమ్మిది స్థానాలలో బీజేపీ, మిత్రపక్షం ఏడు స్థానాలు గెలుచుకున్నాయి. గతంలో గెలిచిన ఘాజియాబాద్, ఖైర్, మజ్‌హవాన్, ఫూల్పూర్ నిలబెట్టుకుంది. సమాజ్‌వాదీ పార్టీ నుంచి కతేహారి, కుందర్కి స్థానాలను తన వశం చేసుకుంది. బీజేపీ మిత్రపక్షం రాష్ట్రీయ లోక్‌దళ్ ఒక్కస్థానం గెలిచింది. శిషామావు, కర్హాల్ స్థానాలను సమాజ్‌వాదీ నిలబెట్టుకుంది. రాజస్తాన్‌లో ఏడు స్థానాలకు ఉప ఎన్నికలు జరిగాయి. అందులో ఐదు బీజేపీ ఖాతాలో పడ్డాయి. అందులో మూడు కాంగ్రెస్‌కు చెందినవి. ఒకటి ఆర్ఎల్‌పీది. భారత్ ఆదివాసి పార్టీ, కాంగ్రెస్ చెరొక స్థానం గెలిచాయి. పంజాబ్‌లో ఆప్ గిద్దెర్‌బాహా, దేరాబాబా నానక్, చబ్బేవాల్ స్థానాలను గెలుచుకుంది. గతంలో ఇవి కాంగ్రెస్ స్థానాలు.

బిహార్‌లో ఎన్‌డీఏ ప్రభంజనం సృష్టించింది. ఇమామ్‌గంజ్, తరాయి, బేలాగంజ్ ఎన్‌డీఏకు దక్కాయి. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ అన్ని స్థానాలు గెలిచింది. ఆరు స్థానాలకు ఎన్నికలు జరగగా అన్నీ అధికార పార్టీకే దక్కాయి. ఇందులో మాదారిహాట్ బీజేపీ నుంచి టీఎంసీ వశం చేసుకుంది. మేఘాలయలో ఎన్‌డీఏ భాగస్వామి నేషనల్ పీపుల్స్ పార్టీ ఒక స్థానం గెలిచింది. ఇక్కడ ఒక్క స్థానానికే ఎన్నిక జరిగింది.

కర్ణాటకలో మూడు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నిక జరిగింది. మూడు స్థానాలు కాంగ్రెస్‌కే దక్కాయి. ఇందులో రెండు బీజేపీ, జేడీఎస్‌లకు చెందినవి. కేరళలో పాలక్కాడ్ స్థానాన్ని కూడా కాంగ్రెస్ గెలుచుకుంది. చెలక్కార అసెంబ్లీ స్థానాన్ని వామపక్ష కూటమి నిలబెట్టుకుంది. ఇక్కడ ఈ రెండు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికల జరిగింది.

అస్సాంలో ఉప ఎన్నికలు జరిగిన ఐదు స్థానాలను ఎన్‌డీఏ గెలిచింది. గుజరాత్‌లో వావ్ స్థానాన్ని బీజేపీ కాంగ్రెస్ నుంచి కైవసం చేసుకుంది. రాయపూర్ (చత్తీస్‌గఢ్), కేదార్‌నాథ్ (ఉత్తరాఖండ్) స్థానాలను నిలబెట్టుకుంది. మధ్యప్రదేశ్‌లో బుధినీ స్థానాన్ని బీజేపీ నిలుపుకుంది. విజయ్‌పురి స్థానాన్ని కాంగ్రెస్ నిలుపుకుంది.

జార్ఖండ్‌లో జేఎంఎం–కాంగ్రెస్ కూటమి 56 స్థానాలు గెలిచింది. ఎన్‌డీఏ కూటమి 24 స్థానాలు సాధించింది. బీజేపీ 68 స్థానాలలో పోటీ చేసి 33.18 శాతం ఓట్లు తెచ్చుకుంది. 34 సీట్లు గెలిచిన జేఎంఎం 23.44 శాతం ఓట్లు సాధించింది. అంటే జార్ఖండ్‌లో గెలిచిన పార్టీ కంటే బీజేపీకే ఎక్కువ శాతం ఓట్లు వచ్చాయి. 16 స్థానాలలో గెలిచిన కాంగ్రెస్ ఓట్ల శాతం 15.56.

మహారాష్ట్ర అసెంబ్లీకి ఈసారి ఎన్నికలలో 21 మంది మహిళలు ఎన్నికయ్యారు. నిరంతరం సెక్యులరిజం, సమానహక్కులు గురించి మాట్లాడే కాంగ్రెస్ బృందం నుంచి ఒక్కరు మాత్రమే ఎన్నికయ్యారు. అత్యధికంగా బీజేపీ నుంచి, అంటే 14 మంది అసెంబ్లీలో అడుగు పెడుతున్నారు. ఇందులో 10 మంది మరొకసారి అసెంబ్లీకి ఎన్నికయ్యారు.

రాజ్ ఠాక్రే నాయకత్వంలోని మహారాష్ట్ర నవ నిర్మాణ సేన, ప్రకాశ్ అంబేడ్కర్ నాయకత్వంలోని వంచిత్ బహుజన్ అఘాడీ ఎన్నికలలో ఎలాంటి ప్రభావం చూపలేదు. బహుజన్ సమాజ్ పార్టీ, ఆజాద్ సమాజ్ పార్టీ (కాన్షీరామ్) కూడా ఎలాంటి ప్రభావం చూపలేదు. ఇంత హడావిడి చేసిన ఎంఐఎం ఒక్క సీటుతో సరిపెట్టుకుంది.

మహారాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు నానా పటోలే సాకోలి నియోజకవర్గాన్ని నిలబెట్టుకున్నారు. అయితే సమీప ప్రత్యర్థి బీజేపీ అభ్యర్థి అవినాశ్ బ్రహ్మాకర్ మీద కేవలం 208 ఓట్ల తేడాతో గెలిచారు. రాష్ట్రంలో మైనారిటీ మతోన్మాద శక్తులు కొన్ని ఎంత రగడ సృష్టించినా ముస్లింలు అధికంగా ఉన్న నియోజక వర్గాలలోను బీజేపీ సత్తా చూపింది. 35 శాతం పైగా ముస్లింలు ఉన్న అసెంబ్లీ స్థానాలు రాష్ట్రంలో 11 ఉన్నాయి. ఇందులో ఆరు మహా వికాస్ అఘాడీ గెలుచుకుంది. నాలుగు బీజేపీ గెలిచింది. కింగ్ మేకర్ ఆశలు కుప్పకూలిపోగా మాలేగావ్ సెంట్రల్ స్థానాన్ని మాత్రం ఎంఐఎం గెలిచింది. అదైనా 162 ఓట్ల తేడాతో ఈ పార్టీ అభ్యర్థి గెలిచాడు. ఇదే నియోజక వర్గం నుంచి పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థికి వచ్చిన ఓట్లు 7,527. 85స్థానాలకు పోటీచేసి కేవలం 17 స్థానాలు మాత్రమే గెలిచిన శివసేన (ఉద్ధవ్) నాయకుడు ఠాక్రే ప్రతిష్ట ఇంకాస్త దిగజారింది.★



జార్ఖండ్ ఫలితం ఇండీ కూటమికి దక్కింది. ప్రజాతీర్పును గౌరవిస్తూనే ఆ రాష్ట్రంలో వాస్తవిక పరిస్థితుల గురించి కూడా మాట్లాడాలి. ఆ పని బీజేపీ చేసింది. అక్కడ గిరిజన జనాభా తగ్గి మైనారిటీలు పెరగడం ప్రమాదకరంగా పరిణమించింది. అన్ని రాజకీయ పక్షాల కంటే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక ఓట్లు సంపాదించుకుంది. అధికారం దక్కించుకోకపోయినా ఓట్ల శాతం పరంగా అగ్రస్థానంలో నిలిచి జార్ఖండ్ ప్రజల ఆదరణ చూరగొంది. చిన్నా చితక పార్టీలతో జట్టు కట్టినప్పటికీ పూర్తిగా సొంత బలంపైనే ఆధారపడిన బీజేపీ 33.18 శాతం ఓట్లు దక్కించుకుంది. మొత్తం 59,21,474 ఓట్లు కమలానికి పడ్డాయి. దీంతో 81 సీట్ల జార్ఖండ్ బీజేపీ 21 స్థానాలు కైవసం చేసుకొంది.

# ఓట్లు కమలానివి! సీట్లు జేఎంఎంవి

ఎన్‌డీఏ మిత్రపక్షాలైన ఆల్ జార్ఖండ్ స్టూడెంట్స్ యూనియన్ (ఏజేఎస్‌యూ), జనతాదళ్ యునైటెడ్ (జేడీయూ), లోక్ జనశక్తి పార్టీ (రాంవిలాస్ పాశ్వాన్) (ఎల్జేపీ (ఆర్వీ)) తలా ఒక్కొక్క సీటు గెలుచుకున్నాయి. అంటే జార్ఖండ్‌లో ఎన్డీఏ కూటమి మొత్తం 24 స్థానాలు దక్కించుకుంది. జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) నేతృత్వంలోని ఇండీ కూటమి 56 స్థానాలతో అధికారాన్ని నిలబెట్టుకుంది. ఈ కూటమిలో అతిపెద్ద పార్టీగా అవతరించిన జేఎంఎం 34 సీట్లు దక్కించుకుంది. జేఎంఎం మిత్రపక్షం కాంగ్రెస్ 30 స్థానాల్లో పోటీ చేసి16 స్థానాలతోనే సరిపెట్టుకుంది. ఈ కూటమిలోని రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జేడీ) 4, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్–లెనినిస్ట్) లిబరేషన్ (సీపీఐ(ఎంఎల్)) 2 చోట్ల విజయం సాధించాయి. మరో ప్రాంతీయ పార్టీ జార్ఖండ్ లోక్‌తాంత్రిక్ కాంతికారీ మోర్చా (జేకేఎల్ఎం) 1 సీటు సాధించింది. నవంబర్ 13, 20న రెండు దశల్లో ఈ రాష్ట్రంలో ఎన్నికలు జరగగా నవంబర్ 23న ఫలితాలు వెలువడ్డాయి.



హేమంత్ సోరెన్

**సానుకూలంగా సానుభూతి**

సాధారణంగా భారతీయులది జాలి గుండె. బద్ధ విరోధికైనా సరే కష్టమొస్తే అయ్యో పాపం అని జాలి చూపించే సంస్కృతి మనది. ఇక ఎన్నికల్లో సానుభూతి ప్రభావం ఉంటుందనడానికి అనేక ఉదాహరణలున్నాయి. అవినీతి కేసుల్లో జైలుకెళ్లిన వారు ఎన్నికల్లో గెలిచి అందలమెక్కిన దృష్టాంతాలు మన భారతదేశంలో అనేకం ఉన్నాయి. ఈ జాబితాలో ప్రస్తుత జార్ఖండ్ ఎన్నికను కూడా చేర్చేందుకు సందేహించాల్సిన పని లేదు. మనీ లాండరింగ్ కేసులో ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ అరెస్టు కావడం ఈ ఎన్నికల్లో జేఎంఎంకు కలిసొచ్చింది. మీడియా, సోషల్ మీడియాను ఉపయోగించుకొని చట్ట ప్రకారం జరిగిన హేమంత్ సోరెన్ అరెస్టును రాజకీయ ప్రేరేపిత చర్యగా జేఎంఎం పెద్ద ఎత్తున ప్రచారం చేసుకుంది. ముఖ్యంగా అప్పటివరకూ ఇంటి పట్టునే ఉన్న హేమంత్ సతీమణి కల్పానా సోరెన్‌ను రోడ్డెక్కించారు. తన భర్తను అన్యాయంగా అరెస్టు చేశారంటూ ఆమె కన్నీరు కార్చడం, అక్రమ కేసులు బనాయించారంటూ ఏడుపులు వంటి చర్యలన్నీ ప్రజల్లో సానుభూతిని కూడగట్టేందుకు దోహద పడ్డాయి. కల్పానా సోరెన్ ప్రచారం ముఖ్యంగా మహిళల మద్దతును సంపాదించిపెట్టినట్టు తెలుస్తోంది. దీనికి తోడు ప్రస్తుతం అమల్లోఉన్న

**ఓట్లశాతంలో బిజెపిదే అగ్రస్థానం**

| పార్టీ | సాధించిన సీట్లు | పోలైన ఓట్లు | ఓట్ల శాతం |
|---|---|---|---|
| బీజేపీ | 21 | 5,921,474 | 33.18 |
| జేఎంఎం | 34 | 4,183,281 | 23.44 |
| కాంగ్రెస్ | 16 | 2,776,806 | 15.56 |

మెయ్యా సమ్మాన్ యోజన కింద 18-50 ఏళ్ల వయసున్న మహిళలకు ప్రతి నెలా ఇస్తున్న రూ.1000 సాయాన్ని తిరిగి అధికారంలోకి వస్తే రూ.2500కు పెంచుతామని హామీ ఇవ్వడం ప్రభావం చూపింది. ఇది గిరిజన మహిళలను, యువతులను భారీ ఎత్తున ఆకర్షించింది. మొదటి నుంచీ ముస్లిం, క్రిస్టియన్‌తో పాటు ఆదివాసీల్లోనూ పట్టున్న జేఎంఎంకు మహిళల మద్దతు సానుకూలంగా మారింది. దీనికి తోడు 'గ్యారెంటీ'లతో ప్రజలను మభ్యపెట్టడం అలవాటైన ఇండీ కూటమి జార్ఖండ్‌లోనూ 7 గ్యారెంటీల కార్డును ప్రయోగించింది. ఓట్ల కోసం అలవికాని హామీలు గుప్పించింది. గ్యారెంటీల అమలులో తెలంగాణ, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వాల వైఫల్యాలను నిరక్షరాస్యత, వెనకబాటుతనం, గిరిజన జనాభా ఎక్కువగా ఉన్న జార్ఖండ్ ప్రజలు గుర్తించలేక పోయారు. అదీ కాక అధికారంలోకి వచ్చినా కాంగ్రెస్ కన్నా జేఎంఎం ప్రభావమే ఎక్కువగా ఉంటుందని భావించి ఆ పార్టీపై నమ్మకం పెట్టుకున్నారు. ఫలితంగా 7 గ్యారెంటీల హామీలు కూడా అంతో ఇంతో ప్రభావం చూపించి ఉంటాయని రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు.

**గెలుపు పతనానికే**

ప్రస్తుతం వామపక్షాలకు పశ్చిమ బెంగాల్, కేరళ తప్పిస్తే అధికారంలోకి రాగలిగే రాష్ట్రాలు కనుచూపు మేరలో కూడా కనిపించడం లేదు. కారణం ఆ పార్టీ తమ గెలుపు కోసం కన్నా, తమ ప్రత్యర్థుల ఓటమి కోసం పని చేయడమూ ఒక కారణం. జాతీయవాదాన్ని, సెక్యులర్ ముసుగులో హిందుత్వను ఓడించాలన్న మిషలో పడ్డ వామపక్షాలు తాము గెలవాలన్న సోయిని మరిచాయి. ఇప్పుడు ఉనికి కోసం ఆరాటపడే పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం కాంగ్రెస్ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఏమీ కనిపించడం లేదు. జార్ఖండ్‌లో తమ కూటమి అధికారంలోకి వచ్చిందన్న సంతోషంలో తాము కూర్చొన్న కొమ్మను నరుక్కుంటు న్నామన్న విషయం మరచిపోయారు. దేశంలో 125 సంవత్సరాల చరిత్ర కలిగిన పార్టీ అని చెప్పుకునే కాంగ్రెస్ ఇప్పుడు సహాయక పాత్రకే పరిమితమైంది. జార్ఖండ్ లోనూ కాంగ్రెస్ ప్రధాన పార్టీ జేఎంఎంకు అనుచర పార్టీనే. వచ్చిన ఆ కొన్ని సీట్లు కూడా సొంత బలం కన్నా జేఎంఎం చలవ వల్లే అనడంలో అతిశయోక్తి లేదు. అధికారంలో భాగమైనా బీజేపీపై కాంగ్రెస్ పైచేయి సాధించలేకపోయింది. జేఎంఎంను పక్కకుపెడితే ఈ ఎన్నికల్లో చేయి గుర్తుపై కమలానిదే పైచేయి. ఇప్పుడు ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీజేపీ తర్వాత జరిగే ఎన్నికల్లో అధికారానికి రాగలుగుతుంది. ఇప్పుడు సహాయ పాత్రకు పరిమితమైన కాంగ్రెస్ రేపు అధికారం కోల్పోతే ఉనికే ప్రశ్నార్థకం అవుతుంది. ఒకప్పుడు అనేక పర్యాయాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో హస్తం పార్టీ ఇప్పుడు ఉనికి కోసం పోరాడాల్సిన పరిస్థితి కనిపిస్తుంది. జమ్ముకాశ్మీర్ నుంచి మొదలు పెడితే ఉత్తరప్రదేశ్, బిహార్, ఒడిశా, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ వరకు అనేక ఉదాహరణలు మన కళ్ల ముందున్నాయి. ఇప్పుడు ఆ జాబితాలో ఝార్ఖండ్ కూడా చేరిపోయింది.

**ఓటమి పాఠాలు**

గత లోక్ సభ ఎన్నికల్లో దెబ్బతిన్న మహారాష్ట్రలో లోపాలను సరిదిద్దుకొని అసెంబ్లీ ఎన్నికల్లో పుంజుకున్నట్టే జార్ఖండ్ ఫలితాల నుంచి బీజేపీ నేర్చుకోవాల్సింది ఉంది. ఈ ఫలితాలు చూస్తే ప్రభుత్వ వ్యతిరేకతను తమకు అనుకూలంగా మలచుకోక పోవడంలో వైఫల్యం కనిపిస్తోంది. ఎన్నికల ప్రచారంలో ప్రధానంగా ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా పైనే ఎక్కువగా ఆధారపడడంతో బలమైన స్థానిక నేత లేని లోటు కనిపించిందన్న విశ్లేషణ లున్నాయి. బాంగ్లాదేశ్ నుంచి అక్రమ వలసలు, అవినీతి వంటి వాటిపై భారీగా ప్రచారం చేసినప్పటికీ... స్థానిక అంశాలను ప్రజల్లో మెరుగ్గా తీసుకెళ్లలేక పోవడం ప్రభావం చూపింది. ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించకపోవడమూ బీజేపీకి ప్రతికూలంగా మారిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఏమైనప్పటికీ గుణపాఠాలను నేర్చుకొని తప్పులను త్వరగానే సరిదిద్దుకుని బీజేపీ భవిష్యత్తులో జార్ఖండ్‌లోనూ మెరుగైన ఫలితాలు సాధించి, అధికారంలోకి వస్తుందని ఆశిద్దాం.

– భువన

## ఓట్లు రాని వ్యూహకర్త



ఏ ఎన్నికలలో అయినా విజయం సాధించడం ఎలా? అన్న అంశం మీద కోట్ల రూపాయలు తీసుకుని సలహాలు ఇస్తారు ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్. ఆయన కూడా జన్‌సురాజ్ పార్టీ పేరుతో ఒక పార్టీని ఇటీవలే లాంఛనంగా ప్రారంభించారు. ఇది రెండేళ్ల నుంచి జనం మధ్యలో పని చేస్తున్నా, పార్టీగా రిజిస్టర్ కాలేదు. ఆ పని ఈ అక్టోబర్ 2న చేశారాయన. ఇంతకీ బిహార్‌లో ఇటీవల నాలుగు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరిగాయి. అన్ని స్థానాలకు ప్రశాంత్ కిశోర్ తన అభ్యర్థులను నిలిపారు. ఇందులో ముగ్గురికి డిపాజిట్ కూడా దక్కలేదు. ఆ పార్టీ ఎన్నికలలో పోటీ చేయడం ఇదే మొదటిసారి. అయితే 2025లో జరిగే బిహార్ అసెంబ్లీ ఎన్నికలలో మొత్తం 243 స్థానాలకు కూడా తమ పార్టీ అభ్యర్థులు బరిలో ఉంటారని ప్రశాంత్ కిశోర్ చెప్పారు. మా పార్టీ స్థాపించి నెల కూడా కాలేదు. మాకు పార్టీ గుర్తు కూడా పది రోజుల క్రితమే వచ్చింది, అందుకే ఈ ఓటమి అన్నట్టు చెప్పారాయన. అయినా మేం పోలైన మొత్తం ఓట్లలో 10 శాతం సాధించామని తెలియచేశారు.





# డిజిటల్ అరెస్ట్ అంటే...?

సైబర్ మోసగాళ్ల నయా ఘరానా చోరీనే 'డిజిటల్ అరెస్ట్' అంటున్నారు. నేడు డిజిటల్ అరెస్ట్ సైబర్ నేరగాళ్ల నూతన ఆయుధమనీ, దీని పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలనీ, అవగాహనతో వారి మాయమాటలకు బెదరకుండా తగు సమాధానం ఇవ్వాలని పోలీసు అధికారులు/సైబర్ క్రైమ్ విభాగాలు కోరుతున్నాయి. ఈ అంశాన్ని ప్రధాని నరేంద్ర మోదీ సైతం ఇటీవల 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ప్రస్తావించడంతో దాని తీవ్రత ప్రజలకు అర్థం అవుతున్నది.

డిజిటల్ అరెస్టుకు ఈ వ్యాసకర్త కూడా బాధితుడే. ఆ అనుభవాన్ని మీతో పంచుకుంటాను. దాదాపు మూడు నెలల క్రితం కరీంనగర్‌లో ఉన్న నాకు ఉదయం 10 గంటల ప్రాంతంలో ఫోన్ కాల్ వచ్చింది. తాము ఢిల్లీ పోలీసులమంటూ, నా ఆధార్ కార్డు నెంబర్‌తో సహా నా పూర్తి పేరు, ఊరు, పూర్తి అడ్రసు చెప్పారు. కాళ్ల కింద భూమి కదిలిందంటే నమ్మాలి. ఆ వివరాలన్నీ నిజమే. మీరు ఒక పార్సల్‌ని ఆస్ట్రేలియాకు ఇటీవలే బుక్ చేశారని, అందులో ప్రమాదకర మాదక ద్రవ్యాలు, కొన్ని ఫేక్ పాస్‌పోర్టులు ఉన్నాయంటూ చెమటలు పట్టించేంతగా నమ్మించారు. నిజానికి ఆస్ట్రేలియాలో ఉన్న మా కుమారులకు ఇటీవలే కొన్ని తినుబండారాలు, వస్త్రాల పార్సల్‌ను బుక్ చేసిన మాట నిజమే కాబట్టి మొదట నమ్మక తప్పలేదు. ఆ పార్సిల్స్ వల్ల ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేశారని, వెంటనే అరెస్టు చేసి ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం కనీసం ఏడాది పాటు జైలులో ఉంచి దర్యాప్తు చేస్తారని బెదిరించే స్వరంతో మాట్లాడడం ప్రారంభించారు. వెంటనే స్కైప్ యాప్ డౌన్‌లోడ్ చేసుకొమ్మని, వీడియో కాల్ ద్వారా ఢిల్లీ పోలీసు యూనిఫాం ధరించిన వ్యక్తి నేరారోపణలు చేయడం, ఎలాంటి చర్యలు తీసుకోబోతున్నామో తెలపడం, నన్ను, మా ఆవిడను కదలవద్దని, వీడియో కాల్‌లో మాత్రమే ఉండాలని బలవంతం చేస్తూ భయాందోళనలకు గురి చేశారు. నా బ్యాంకు వివరాలు, నగదు వివరాలు తెలుసుకోవడం ప్రారంభించగానే నాకు అనుమానం వచ్చింది. పక్కకు జరిగి నగర ఏసీపీకి ఫోన్ చేశాను. దీనితో అది సైబర్ మోసగాళ్ల నాటకమని తెలియడం, నేను వీడియో కాల్ కట్ చేసే ముందు 'మీకు మా నగర ఏసీపీ ఫోన్ నంబరు ఇస్తున్నానని, వారికి పూర్తి వివరాలు చెప్ప' మనడంతో అవతలి కాల్ కట్ అయింది. నేను మా ఆవిడ ఊపిరి పీల్చుకున్నాం. మనం విదేశాలకు బుక్ చేసే పార్సల్ మీద ఆధార్ కార్డు జిరాక్స్ కాపీని అతికిస్తాం. ఆ వివరాలు సేకరించి లక్షలు, కోట్లల్లో నగదును ఆన్‌లైన్ మోసాలతో బదిలీ చేయించుకోవడం నిత్యం ఎక్కడో ఒకచోట జరుగుతూనే ఉన్నాయి. ఈ విధంగా వీడియో కాల్‌లో బంధించి, కదలకుండా చేసి, భయపెడుతూ నగదు బదిలీ చేసుకోవడాన్ని నేడు 'డిజిటల్ అరెస్ట్' అంటున్నాం.

**లక్షలు గుంజుతున్న సైబర్ నేరగాళ్లు**

ఇటీవలే ముంబాయికి చెందిన ఒక ట్యూషన్ మాస్టారును 22 గంటలు 'డిజిటల్ అరెస్టు' చేసి ఆయన ఖాతా నుంచి రూ. 51.27 లక్షలు బదిలీ చేయించుకోవడం, హైదరాబాద్‌కు చెందిన ఒక రిటైర్డ్ లెక్చరర్‌ను డిజిటల్ అరెస్టు చేసి రూ. 45 లక్షలు, పుణేకు చెందిన ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీ ఉన్నత అధికారిని బెదిరించి ఏకంగా రూ. 6.29 కోట్లు, లక్నోకు చెందిన డాక్టరు నుంచి రూ. 2.8 కోట్లు సైబర్ నేరగాళ్లు దోచారు. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే.


**డిజిటల్ అరెస్ట్ ఓ ప్రత్యక్ష నరకం**

సైబర్ నేరగాళ్లు మనల్ని ఇంట్లోనే వీడియో కాల్‌లో బంధించి, పోలీసులమని, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులమని, యూనిఫాం ధరించి నేరుగా బెదిరించి, వీడియో కాల్ ముందే నిలబెట్టి మన నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు కాజేసే కుట్ర ఇది. వైజ్ఞానిక, సాంకేతిక శాస్త్రాలు కొత్త పుంతలు తొక్కడం, నేడు డిజిటల్ యుగం కావడం, ఏఐ యుగంలోకి అడుగిడుతున్న వేళ సైబర్ నేరగాళ్లు కూడా తమ అతి తెలివిని ప్రదర్శించి నయా మోసాలకు పూనుకోవడంతో అమాయక జనాలు భారీగా నష్ట పోతున్నారు. డిజిటల్ అరెస్ట్ అనే పదమే మన న్యాయ వ్యవస్థలో లేదని, అలాంటి అరెస్టులు జరగవని, కేసు తీవ్రతను బట్టి అవసరమైతే నేరుగా పోలీసులు ఇంటికి వచ్చి అరెస్టు చేస్తారని ప్రజలు గమనించాలి. సైబర్ నేరగాళ్లు పలు విధాలుగా మన వ్యక్తిగత వివరాలను తెలుసుకునే ప్రయత్నాలు చేస్తారని గమనించాలి. ఫోన్ కాల్స్, మెసేజెస్, ఈ మెయిల్స్, వాట్సప్ కాల్స్ చేసి మన వ్యక్తిగత వివరాలు తెలుసుకునే అవకాశాలు ఉన్నందున అందరూ జాగ్రత్తగా ఉండాలని, తమ వివరాలను ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వవద్దని నిఘా వర్గాల వారు హెచ్చరికలు చేస్తున్నారు.

**నివారించే మార్గాలు**

సైబర్ నేరగాళ్ల ఫ్రాడ్‌లకు అవధులు ఉండడం లేదు. కొత్త కొత్త వ్యూహాలను వాడి అమాయక సామాన్యులను ఒప్పించి/బెదిరించి డబ్బులు గుంజుతున్నారు. మనం వాడుకునే స్మార్ట్‌ఫోన్, ట్యాబ్, ల్యాప్‌టాప్, ట్యాబ్లెట్ పిసి లాంటి ఉపకరణాలలో లేటెస్ట్ సాఫ్ట్‌వేర్‌ను వాడి ఫేక్ కాల్స్‌ను కట్టడి చేయాలి. మన వ్యక్తిగత పాస్‌వర్డ్‌ను ఎవ్వరితో పంచుకోవద్దు. మనం ఆర్థిక లావాదేవీలు చేసినపుడు కనీసం రెండు భద్రతా వివరాలను (పాస్‌వర్డ్, ఓటిపి, బయోమెట్రీ, భద్రతా ప్రశ్నలు లాంటివి) వాడుకోవాలి. పబ్లిక్ ప్లేసెస్‌లో అందుబాటులో ఉండే వైఫై కనెక్షన్లను వాడరాదు. ప్రతి సారి సైన్ అవుట్ కావడం, బ్రౌజ్ చేసిన అంశాలను డిలీట్ చేయడం మరిచి పోవద్దు. తెలియని ఈ మెయిల్స్‌లో వచ్చిన ఎలాంటి అటాచ్‌మెంట్లను డౌన్ లోడ్ చేయవద్దు. ఆడియో వీడియో కాల్స్‌లో బెదిరిస్తే తము విధంగా సమాధానమిస్తూ, లోకల్ పోలీసులను సంప్రదించమని చెప్పండి. గుర్తు తెలియని వ్యక్తులు చేసే కాల్స్, ఆరోపణలను కొట్టి పారేయండి. అలాంటి కాల్స్ చేసిన వారికే చెమటలు పట్టించే వాగ్దాటిని ప్రయోగించండి. ఒక వేళ తెలియక నగదు బదిలీ చేసినా వెంటనే స్థానిక సైబర్ క్రైమ్ పోలీసు విభాగాలకు తెలియజేయండి.

సైబర్ నేరగాళ్లు క్షణాల్లో వ్యక్తిని ఒత్తిడికి గురి చేసి, అర్జంట్ కేస్ అంటూ, ఇల్లు దాటవద్దని, వీడియో లేదా ఆడియో కాల్ కట్ చేయవద్దని ఆన్‌లైన్‌లో బెదిరించడం జరిగితే అది నకిలీ కాల్ అని తెలుసుకొని బయట పడాలి. పోలీస్ లేదా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఎవరు కాల్ చేసి వ్యక్తిగత వివరాలు అడగరని, అవసరమైతే మన ఇంటికే ప్రత్యక్షంగా వస్తారని గమనించి డిజిటల్ అరెస్ట్ విషపు వలలో పడొద్దని నిపుణులు కోరుతున్నారు. నగదు పోయిన తర్వాత తిరిగి పొందడం కష్టం కాబట్టి మన జాగ్రత్తే మనకు శ్రీరామరక్ష అని తెలుసుకుందాం, దానికి అనుగుణంగా మసలుకుందాం.



**డా. బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీకి ఓ పేరుండేది. ఒక్క ఆంధ్రప్రదేశే కాదు.. దేశవ్యాప్తంగా ఆ పార్టీకి ఓ ముద్ర ఉండేది. ఎక్కడ కాంగ్రెస్ గెలిచినా, ఢిల్లీ పెద్దల ఆశీస్సులున్న వారే ముఖ్యమంత్రులు అవుతారని వాదన బలంగా ఉండేది. అది వాస్తవమని నిరూపణ అయ్యింది. ఒక్కమాటలో చెప్పాలంటే కాంగ్రెస్ గెలిస్తే 'సీల్డ్ కవర్ సీఎం' గద్దెనెక్కేవాళ్లు. ఢిల్లీ నుంచి ప్రతినిధి వచ్చి శాసనసభా పక్ష సమావేశంలో శాసనసభాపక్ష నేత (ముఖ్యమంత్రి) ఎవరనేది అధిష్టానానికి నిర్ణయాన్ని అప్పగిస్తూ తీర్మానం చేసేవాళ్లు. ఆ తీర్మానం చేసిన తర్వాత ఢిల్లీ నుంచి తెచ్చిన సీల్డ్ కవర్ విప్పేవారు. అందులో పేరున్న వ్యక్తి ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యేవారు. అంతేకాదు.. ఆయన ఎన్ని రోజులు అధికారంలో ఉంటారో కూడా వాళ్లకే నమ్మకం ఉండేది కాదు. హస్తిన నుంచి ఎప్పుడు ఏ దూత వస్తాడో, ఎప్పుడు సీల్డ్ కవర్ తెస్తాడో, ఏ సమయంలో ముఖ్యమంత్రి పదవికి ఎసరు వస్తుందో, ఎవరిని అప్పటికప్పుడు ముఖ్యమంత్రిని చేస్తారో అన్నభయంతోనే గతంలో గత ముఖ్యమంత్రులందరూ పనిచేశారు.

# ఎక్కే విమానం.. దిగే విమానం...


వాస్తవం చూస్తే.. చరిత్రను పరిశీలిస్తే.. కాంగ్రెస్‌పార్టీ సహజ ధోరణిని విశ్లేషించుకుంటే సీల్డ్ కవర్ ముఖ్యమంత్రులన్న పేరు, అధిష్టానం చేతిలో ఆటబొమ్మలుగా ఉంటారన్న వాదనలు ఎంతమేరకు నిజమో తెలుస్తుందంటున్నారు రాజకీయ విశ్లేషకులు. 'కాంగ్రెస్ అంటేనే కుర్చీలాట' అనే నానుడి కూడా ఉమ్మడి రాష్ట్రంలో ఉండేది. 'అధికారం ఇక్కడ.. పెత్తనం అక్కడ' అనే వ్యంగ్యోక్తి కూడా ఉంది. అంటే.. ఎవరు సీఎం కావాలో, మంత్రులుగా ఎవరెవరు ఉండాలో, ఏ మంత్రికి ఏ శాఖ ఉండాలో కూడా ఢిల్లీ నుంచే ఆదేశాలు వస్తుంటాయని సొంతపార్టీ నేతలే ఇప్పటికీ చెప్పుకుంటారు. తమకు నచ్చిన వాళ్లను, జీహుజూర్ అనేవాళ్లనే సీఎంగా, మంత్రులుగా నియమిస్తారన్న ప్రచారం ఉంది. వాళ్లకు ఎప్పుడు ఇష్టం లేకపోయినా వెంటనే పదవి నుంచి తొలగించి మరో వ్యక్తిని ఆ కుర్చీలో కూర్చోబెడతారన్న అనుభవాలున్నాయి. ఐదేళ్ల కాలంలో కనీసం ఇద్దరు ముగ్గురు సీఎంలు మారేవాళ్లు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలో గడిచిన అరవై యేళ్లలో చూసుకుంటే దాదాపు నలభైయేళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉంది. అయితే, ఆ సమయంలో పూర్తి కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన వాళ్లు మాత్రం ఇద్దరే ఇద్దరు అని రికార్డులు చెబుతున్నాయి. 40 ఏళ్ల పాలనలో ఏకంగా 16 మంది సీఎంలుగా పనిచేయాల్సి వచ్చింది.



ఇప్పుడు కాలం మారింది. ప్రజలూ, ఓటర్లూ చైతన్యవంతులయ్యారు. అధికారంలోకి వచ్చే పార్టీ ఏదో జనం పక్కా ఆలోచనతోనే ఓట్లేస్తున్నారు. కానీ, కాంగ్రెస్ పార్టీలో మాత్రం 'ఢిల్లీ సీల్డ్ కవర్ సీఎం' ముద్ర పోవడం లేదు.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన తర్వాత పదేళ్లకు కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చింది. అయితే, అందులోని సీనియర్లందరూ ముఖ్యమంత్రి అభ్యర్థులే అన్న సెటైర్లు కొనసాగాయి. అయినప్పటికీ.. సీనియర్లందరిలోకన్నా జూనియర్,అదీ... వేరే పార్టీ నుంచి వచ్చి రేవంత్‌రెడ్డికి అధిష్టానం ముఖ్యమంత్రి పీఠాన్ని ఖరారు చేసింది. అప్పటిదాకా 'మేమే సీఎం...పలానా వాళ్లు సీఎం పదవికి ఏం తక్కువ? 'అని బహిరంగం గానే వాదనలు వెళ్లగక్కిన వాళ్లు, మీడియా ముందు మాట్లాడిన వాళ్లు కూడా అధిష్టానం నిర్ణయాన్ని గతంలో మాదిరిగానే శిరసా వహించారు. అయినా, సీఎం పదవి గురించి అడపా దడపా ప్రసంగాల్లో ప్రస్తావిస్తూనే ఉన్నారు. అయితే, ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రేవంత్‌రెడ్డి.. తనదైన వ్యూహంతో సీనియర్లందరి నోళ్లు మూయించేలా జాగ్రత్తలు తీసుకున్నారు. తుమ్మితే ఊడే ముక్కుగా ముద్ర పడిన ముఖ్యమంత్రి పదవి తన నుంచి జారిపోకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలూ తీసుకుంటున్నారు. అన్నింటికీ మించి అధిష్టానంతో సంబంధాలను నిరంతరం కొనసాగిస్తున్నారు. అధిష్టానం తనపట్ల కన్నెర్ర చేయకుండా, తెరవెనుక తనపట్ల కుట్రలు సాగకుండా, తన పదవికి ఎసరు రాకుండా జాగ్రత్త పడుతున్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తూ,ఢిల్లీలో అధిష్టానం ముందు సహజంగానే గతంలో మాదిరి ముఖ్యమంత్రుల మాదిరిగానే మోకరిల్లుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. ప్రతిపక్ష బీఆర్ఎస్ వీటిపై ఏకంగా బహిరంగ విమర్శలే చేస్తోంది కూడా.

తెలంగాణ ఏర్పాటయ్యాక మూడోసారి ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ విజయం సాధించిన తర్వాత గత యేడాది డిసెంబర్ 7వ తేదీన రేవంత్‌రెడ్డి రెండో ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి యేడాది పూర్తవుతోంది. ఈ కాలంలో రేవంత్‌రెడ్డి మొత్తం 28సార్లు ఢిల్లీ వెళ్లొచ్చారు. బీఆర్ఎస్ నాయకులు పక్కాగా ఈ లెక్కలు గుర్తు పెట్టుకుంటున్నారు. ఇప్పటికి చూస్తే నవంబర్ 25వ తేదీన చివరి సారిగా రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లారు. అయితే, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కూతురు వివాహానికి హాజరయ్యేందుకు తాను ఢిల్లీ వెళ్తున్నట్లు ప్రకటించారు. కానీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్ర ముఖ్యమంత్రి ఢిల్లీ వెళ్తే ఎవరెవరిని కలుస్తారు? ఎందుకు వెళ్తారు? ఏయే అంశాలు చక్కదిద్దుకొని వస్తారు? అనేది కాస్త రాజకీయ పరిజ్ఞానం ఉన్నవాళ్లందరికీ తెలుసు. అందుకే రేవంత్‌రెడ్డి.. తాను ఢిల్లీకి వెళుతున్న కారణాన్ని మీడియా సమావేశంలో ప్రత్యేకంగా ప్రస్తావించాల్సి వచ్చిందని విశ్లేషకులు



# మారని కాంగ్రెస్ వైనం

అంటున్నారు. పేరుకు లోక్‌సభ స్పీకర్ కూతురి వివాహం అయినప్పటికీ.. పార్టీ పరంగా, ప్రభుత్వం పరంగా చేయాల్సిన కార్యాచరణ గురించి అధిష్టానం నుంచి అనుమతి తీసుకోవడం కూడా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.

ముఖ్యంగా రేవంత్‌రెడ్డి ఇన్నాళ్ల హస్తిన పర్యటనలను పక్కనబెడితే ఈసారి పర్యటనలో అధిష్టానంతో పలు కీలక అంశాలు చర్చించేందుకు సమయం కేటాయించుకున్నారు. పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో చేపడుతున్న విజయోత్సవాల గురించి అధిష్టానం పెద్దలతో చర్చించడంతో పాటు.. పలు కార్యక్రమాలు రూపకల్పన చేశారు. విజయోత్సవాల్లో పాల్గొనాలని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక వాద్రాలకు ప్రత్యేక ఆహ్వానం అందజేశారు. ముఖ్యంగా డిసెంబరు 9న తెలంగాణ సచివాలయం ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమం కోసం వారిని ఆహ్వానించారు. ఆ తేదీకి, తెలంగాణకు ప్రత్యేక సంబంధం ఉంది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు అప్పటి యూపీఏ ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చి అధికారిక ప్రకటన విడుదల చేసింది ఆ తేదీననే. ఆ రోజు పార్టీ అగ్రనాయకురాలు సోనియాగాంధీ జన్మదినం కూడా. అందుకే..ఆ తేదీన ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించారు. ఆరోజు సోనియాగాంధీ తప్పనిసరిగా తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ వేడుకకు వస్తారని ఆశిస్తున్నారు. ఆ వేడుకలకు లక్షమందిని తరలించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఇదిలా ఉంటే.. రాష్ట్ర మంత్రివర్గంలో ఇంకా ఖాళీగా ఉన్న ఆరు స్థానాల భర్తీపై కూడా ఈ పర్యటనలో రేవంత్‌రెడ్డి అధిష్టానంతో చర్చించారు. ఈ అంశాన్ని రాహుల్ గాంధీ దృష్టికి తీసుకువెళ్లి, త్వరితగతిన మంత్రివర్గ విస్తరణకు ఆమోదం పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. గత కొన్ని పర్యటనల్లో కూడా రేవంత్ రెడ్డి ఈ అంశాన్ని అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లారు. అయితే, ఇప్పుడు మహారాష్ట్ర, జార్ఖండ్ శాసనసభల ఎన్నికలు ముగియడంతో అందరి దృష్టి పెండింగ్‌లో ఉన్న కేబినెట్ విస్తరణపై పడింది. అయితే.. మహారాష్ట్రలో కాంగ్రెస్ అనుకున్న ఫలితాలను సాధించలేక పోయింది. వారి నమ్మకం పెట్టుకున్న మైనారిటీ ఓట్లు పోలరైజ్ అయినా.. మెజారిటీ ప్రజల ఓట్లు బీజేపీ కూటమి వైపు మొగ్గుచూపడం కాంగ్రెస్‌ను చావు దెబ్బ తీసింది. కాగా, పెండింగ్‌లోని మంత్రివర్గ విస్తరణపై మాత్రం రేవంత్ అధిష్టానం అనుమతి తీసుకున్నట్లు తెలుస్తోంది. మరోవైపు.. డిసెంబర్ రెండో వారంలో అసెంబ్లీ సమావేశాలు నిర్వహించ డానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈలోగా మంత్రివర్గ విస్తరణపై ఓ స్పష్టత రావచ్చని తెలుస్తోంది. ఖాళీగా ఉన్న కార్పొరేషన్ పదవుల భర్తీ, కులగణన వంటి అంశాలు కూడా ఈ చర్చలలో ప్రాధాన్యం సంతరించుకున్నాయి.


ఎప్పటి మాదిరిగానే... ఈసారి కూడా రేవంత్‌రెడ్డి హస్తిన పర్యటనపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.తారకరామారావు ఎక్స్ వేదికగా వ్యంగ్యాస్త్రాలు సంధించారు. పదే పదే ఢిల్లీకి ఎందుకు వెళ్తున్నారో తెలియదని.. కనీసం ఒక్క రూపాయి కూడా తేలేకపోయారని, దీనిపై నిలదీయాల్సిన అవసరం తెలంగాణ పౌరులుగా తమకు ఉందని పేర్కొన్నారు. బడేభాయ్, చోటామియాలు ఈడీ దాడులు బయటపడకుండా ఉన్నారంటూ తీవ్ర ఆరోపణలే చేశారు. 'పెండ్లికి పోతున్నావో.. పేరంటానికే పోతున్నావో.. సావుకు పోతున్నవో' అంటూ.. చేసిన ట్వీట్‌లో.. మీరు దేనికి ఢిల్లీకి వెళ్తున్నారో గాని ఇప్పటి వరకు 28సార్లు ఢిల్లీ వెళ్లి 28 రూపాయలు కూడా రాష్ట్రానికి తీసుకురాలేదని ఎద్దేవా చేశారు. సీఎం పర్యటనలపై ప్రశ్నించడం పౌరులుగా తమ బాధ్యత అన్నారు.

గడిచిన ఏడాది కాలంలో రాజ్యాంగబద్ధంగా రావాల్సిన నిధులు తప్ప, అదనంగా ఒక్క రూపాయి కూడా రాష్ట్రానికి తీసుకురాలేదని మండి పడ్డారు. ఈడీ దాడులు తప్పించుకోవడానికి ఫైవ్ స్టార్ హోటల్లో ఎవరి కాళ్లు పట్టుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. తాము ఎన్నడూ ఢిల్లీకి గులాములం కాదని, పోరాటం తెలంగాణ రక్తంలోనే ఉందని తెలియజేశారు. తమ ఎజెండా, జెండా ఎన్నటికీ తెలంగాణ అభివృద్ధి మాత్రమే అని కేటీఆర్ స్పష్టం చేశారు.

ఇటీవలే ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి 25వ సారి ఢిల్లీ పర్యటనకు వెళ్లడంపై కూడా కేటీఆర్ సెటైర్ ట్వీట్లు చేశారు. 'పైసా పనిలేదు.. రాష్ట్రానికి రూపాయి లాభం లేదు. పది నెలల్లో 25సార్లు రేవంత్ ఢిల్లీ వెళ్లారు. పోను 25సార్లు.. రాను 25 సార్లు.. నీ ఢిల్లీ పెద్దల చుట్టూ ప్రదక్షిణలుచేసి సిల్వర్ జూబ్లీ కూడా చేస్తివి. తట్టా మట్టి తీసింది లేదు.. కొత్తగా చేసింది అసలే లేదు.. అయినను పోయి రావలె హస్తినకు..' అంటూ.. సీఎం రేవంత్ ఢిల్లీ పర్యటనపై కేటీఆర్ విమర్శలు గుప్పించారు. 'అన్నదాతల అరిగోసలు, గాల్లో దీపాల్లా గురుకులాలు, కుంటుపడ్డ వైద్యం, గాడితప్పిన విద్యా వ్యవస్థ.. అయినను పోయి రావలె హస్తినకు.' 'మూసీ పేరుతో, హైడ్రా పేరుతో పేదోళ్ల పొట్టలు కొట్టి, 420 హామీలు మడతపెట్టి మూలకు వేశారు. పండుగలకు ఆడబిడ్డల చీరలు అందనేలేవు. అవ్వా తాతలు అనుకున్న పింఛను లేదు. తులం బంగారం జాడనే లేదు.. స్కూటీలు లేవు, కుట్టుమిషన్లు లేవు.. అయినను పోయి రావాలె హస్తినకు..' అంటూ కేటీఆర్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఆ తర్వాత కూడా మరో మూడుసార్లు హస్తినకు వెళ్లారు రేవంత్‌రెడ్డి.

దాదాపు ప్రతిసారి రేవంత్‌రెడ్డి. ప్రత్యేక విమానంలో వెళ్లడం, ఆ పర్యటనల ఖర్చులపైనా విపక్షాలనుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఢిల్లీ వెళ్లిన ప్రతిసారీ రాష్ట్రానికి సంబంధించిన పాలనాంశాలు, ప్రభుత్వం తీసుకునే చర్యల గురించి, ఆయా పోస్టుల గురించే చర్చలు సాగుతుండటం పరిపాటి. అటు పార్టీ.. ఇటు ప్రభుత్వానికి సంబంధించిన నియామకాలన్నీ అధిష్టానం కనుసన్నల్లోనే సాగుతాయన్నది బహిరంగ రహస్యమే అంటున్నారు రాజకీయ విశ్లేషకులు. సీఎం ఢిల్లీ వెళ్లిన ప్రతిసారీ కేబినెట్ విస్తరణ గురించి చర్చలు సాగుతూనే ఉన్నాయి. అలాగే, నామినేటెడ్ పోస్టులకు సంబంధించి కూడా అనేకసార్లు చర్చలు జరిగాయి. పలుదఫాలుగా హస్తిన పర్యటనలు పూర్తయితే గానీ చాలావరకు నామినేటెడ్ పదవుల పంపకం పూర్తికాలేదు. ఇప్పుడు కేబినెట్ బెర్తుల విషయంలోనూ అదే పరిస్థితి నెలకొంది. కాంగ్రెస్ అధిష్టానం గ్రీన్‌సిగ్నల్ కోసం ఆశావహులు చకోర పక్షుల్లా ఎదురుచూస్తున్నారు.

**సుజాత గోపగోని,**
**6302164068, సీనియర్ జర్నలిస్ట్**



పోలవరం ప్రాజెక్టును 2027 డిసెంబరు నాటికి పూర్తి చేసే బాధ్యత తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు బడ్జెట్ సమావేశాలలో సాగునీటి ప్రాజెక్టులపై జరిగిన చర్చకు ముఖ్యమంత్రి సమాధానం చెప్పారు. ప్రతిపక్షం లేకుండా శాసనసభ సమావేశాలు సాగాయి. వైసీపీ శాసనసభకు హాజరు కాలేదు. శాసనమండలిలో మాత్రం ఆ పార్టీ ప్రాతినిధ్యం ఎక్కువ ఉన్నందున హాజరైంది. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుచేయాలని సమావేశం తీర్మానించింది.

# 2027 చివరకు పోలవరం..

ఆంధ్రప్రదేశ్ ఆబ్కారీ (సవరణ) బిల్లు, ఆంధ్రప్రదేశ్ (స్వదేశంలో తయారైన విదేశీ మద్యం, విదేశీ మద్యాల వ్యాపార క్రమబద్ధీకరణ) (సవరణ) బిల్లు, ఆంధ్రప్రదేశ్ మద్య నిషేధ (సవరణ) బిల్లులను, ఆంధ్రప్రదేశ్ ద్రవ్య వినియోగ బిల్లు 2024ను, ఏపీ భూ దురాక్రమణ నిషేధ బిల్లు-2024ను, రాష్ట్రంలో సహజవాయు వినియోగంపై జీఎస్టీ తగ్గిస్తూ సవరణ బిల్లు, ఏపీ లోకాయుక్త చట్ట సవరణ బిల్లు, ఆంధ్రప్రదేశ్లో చెత్త పన్నును రద్దు చేస్తూ ఏపీ మున్సిపల్ చట్టాల సవరణ బిల్లు, సోషల్ మీడియాతో పాటు ఇతర 14 చట్టాలకు సంబంధించి ప్రవేశపెట్టిన బిల్లు, ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలున్నా స్థానిక సంస్థల ఎన్నికల పోటీకి అర్హతను కల్పిస్తూ పంచాయతీరాజ్ (సవరణ) బిల్లు-2024, ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ చట్టాల సవరణ బిల్లు-2024కు శాసనసభ ఆమోదం తెలిపింది. వీటితోపాటు డాక్టర్ ఎన్టిఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ (అమెండ్మెంట్ బిల్లు-2024, ఆంధ్రప్రదేశ్ (ఆంధ్ర ఏరియా) ఆయుర్వేదిక్, హోమియోపతి మెడికల్ ప్రాక్టీషనర్స్ రిజిస్ట్రేషన్ (అమెండ్మెంట్) బిల్లు-2024, ఆంధ్రప్రదేశ్ మెడికల్ ప్రాక్టీషనర్స్ రిజిస్ట్రేషన్ (అమెండ్మెంట్) బిల్లు-2024ను, ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ సొసైటీస్ (అమెండ్మెంట్) బిల్లు-2024ను అమోదించారు. బీసీలకు చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని పెట్టిన తీర్మానాన్ని సభ్యులు ఆమోదించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు పెట్టాలని ప్రవేశపెట్టిన తీర్మానానికి సభ్యులు ఆమోదం తెలిపారు.

**ప్రాజెక్టులపై సుదీర్ఘ చర్చ**

పోలవరం, ఇతర సాగునీటి ప్రాజెక్టుల చర్చపై పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడారు. పోలవరం నిర్వాసితులపై సర్వే నిర్వహించి, 18 ఏళ్లు నిండిన వారందరికీ ప్యాకేజీ వర్తింపజేయాలని, కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరం మండలాల నిర్వాసితులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు కోరారు. గత ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల గేట్ల మరమ్మతులు విస్మరించడమే కాదు, కనీసం లస్కర్లకు జీతాలివ్వ లేదని వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి విమర్శించారు. కనిగిరి రిజర్వాయర్ గేట్లు, కట్టలకు మరమ్మతులు చేయాలని, పూడిక తీయించాలని కోరారు. గుండ్లకమ్మ, పులిచింతల గేట్లు కొట్టుకుపోయినా పట్టించుకోలేదని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు గుర్తు చేశారు. కాటన్ బ్యారేజీ కూడా ప్రమాదకర స్థితిలో ఉందని, 117 గేట్లు మార్చాలని కేంద్ర జలసంఘం 2022లో నివేదిక ఇచ్చినా జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదని నల్లమిల్లి రామకృష్ణా రెడ్డి ఆరోపించారు. 10 వేల ఎకరాల ఆయకట్టుతో పాటు విశాఖకు తాగు నీరందించే రైవాడ జలాశయం రేడియల్ గేట్ల మరమ్మతులకు రూ.336 కోట్లు అవసరమని గతంలోనే అంచనా వేశారని, ఈ ప్రభుత్వం నిధులిచ్చి, పనులు చేయాలని బండారు సత్య నారాయణమూర్తి కోరారు.

వర్స్ టెండర్ పేరుతో చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని గత ముఖ్యమమంత్రి జగన్ ఆపేశారని ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి మండిపడ్డారు. విధ్వంసానికి మారుపేరైన జగన్.. జలజీవన్ మిషన్, అమృత్ పథకాల ద్వారా ఇంటింటికీ రక్షిత నీరివ్వాలన్న ప్రధాని నరేంద్ర మోదీ ఆశయాలకు గండి కొట్టారని బీజేపీ పక్ష నేత విష్ణుకుమార్ రాజు దుయ్యబట్టారు.

**సీమకు ప్రాధాన్యత ఇవ్వాలన్న ఎమ్మెల్యేలు**

'గత ప్రభుత్వంలో రాయలసీమ ఎత్తిపోతల పేరిట రూ.3,800 కోట్లతో ప్రాజెక్టు చేపట్టి రూ. 832 కోట్లు మింగేశారు. గుండ్రేవుల ప్రాజెక్టును దెబ్బతీశారు. అన్నమయ్య ప్రాజెక్టు గేట్లు కొట్టుకు పోయినా పట్టించుకోలేదు. సీమ జిల్లాలను నిలువునా ముంచేశారు' అని బీవీ జయనాగేశ్వర రెడ్డి మండిపడ్డారు.

ముచ్చుమర్రి వద్ద మరో మూడు పంపులు ఏర్పాటు చేయాలని భూమా అఖిలప్రియ; పుట్ట కనుమ ప్రాజెక్టుకు భూములిచ్చిన రైతులకు తాజా ధరల ప్రకారం పరిహారం చెల్లించాలని, పేరూరు ప్రాజెక్టు పూర్తి చేయాలని పరిటాల సునీత ప్రభుత్వాన్ని కోరారు. 'గోదావరి- కృష్ణా- పెన్నా నదుల అనుసంధానంతో సీమలో ప్రతి ఎకరాకు నీరివ్వవచ్చు. హంద్రీనీవా మొదటి దశతో పాటు ఉరవకొండ నియోజకవర్గంలో బిందు సేద్యం ప్రాజెక్టును పూర్తిచేయాలి' అని ఎమ్మెల్యేలు కోరారు.

సాగునీటి ప్రాజెక్టులపై చర్చకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమాధానమిస్తూ, 'రాష్ట్రానికి పోలవరం ప్రాజెక్టు జీవనాడి. దానిని పూర్తిచేసి నదుల అనుసంధానం చేస్తే రాష్ట్రంలో కరవనేది ఉండదు.నదుల అనుసంధానం నా జీవిత కల. నీళ్లిస్తే రైతులు బంగారం పండిస్తారు. ఫ్లోరైడ్ నీళ్లతో బాధపడేవారికి ఉపశమనం కలుగుతుంది. 2025 జనవరి నుంచి పోలవరం కొత్త డయాఫ్రంవాల్ నిర్మాణం చేపట్టి 2026కు పూర్తి చేస్తాం. పోలవరం ఎడమ ప్రధాన కాలువకు రూ.960 కోట్లతో త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తాం. ఆ కాలువ ద్వారా విశాఖకు, అక్కడి నుంచి ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ద్వారా నీరందిస్తాం. పోలవరం ఎడమ కాల్వ ద్వారా వంశధార వరకు అనుసంధానం చేయాలనే ఆలోచనలో ఉన్నాం. తద్వారా వంశధారలో ఎక్కువ నీరుంటే దిగువకు కూడా వచ్చేలా చేసుకునేందుకు ఉపయోగపడుతుంది. ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్ 1 ఫిబ్రవరి 2026నాటికి, గ్యాప్-2 2027 డిసెంబర్ నాటికి పూర్తవుతుంది. ఎట్టి పరిస్థితుల్లో 2027 నాటికి పోలవరం పూర్తికి




# . కర్నూలులో 'బెంచ్'

చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో..నదుల అనుసంధానం తో ప్రతి ఎకరాకు నీరివ్వాలనేది ఎన్డీయే ప్రభుత్వ సంకల్పం. రూ.70 వేల కోట్లతో గోదావరి– బనకచర్ల ప్రాజెక్టు పూర్తి చేస్తే.. రాయల సీమ సహా రాష్ట్రమంతా సస్యశ్యామలమవుతుంది. అప్పుడు రైతుల ఆదాయం రెండు, మూడింతలు పెరుగుతుంది. గోదావరి నీటిని పోలవరం కుడి ప్రధాన కాల్వ ద్వారా కృష్ణా నదికి, అక్కడ నుంచి వైకుంఠపురం బ్యారేజి ద్వారా బొల్లాపల్లి వద్ద 150 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో నిర్మించే జలాశయానికి,అక్కడి నుంచి ఉమ్మడి కర్నూలు జిల్లాలోని బనకచర్లకు చేరుస్తాం. ప్రైవేటు వాళ్లు ఖర్చు పెడితే.. కేంద్ర, రాష్ట్రాలు కొంత భరిస్తాయి. వారు పాతికేళ్ల వరకు వసూలు చేసుకోవచ్చు. రాష్ట్రానికే ఇది గేమ్ ఛేంజర్ అవుతుంది. కరవును శాశ్వతంగా నివారించవచ్చు' అని వివరించారు.

**కర్నూలులో హైకోర్టు బెంచ్**


అధికారంలోకి వస్తే కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుచేస్తామని ప్రజాగళం యాత్రలో ఇచ్చిన హామీని నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ ప్రతిపాదనను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి పంపాలని నిశ్చయించింది. లోకాయుక్త, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ కార్యాలయాలను కూడా కర్నూలులోనే కొనసాగించాలని నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) కార్యాలయాన్ని మాత్రం అమరావతికి తరలించాలని నిర్ణయించింది. విద్యుత్ సంస్థల అధికారులతో సమన్వయంతో పనిచేయాల్సి ఉన్నందువల్ల ఏపీఈఆర్సీ కార్యాలయం రాజధానిలో ఉండాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. రాయలసీమలోని 8 జిల్లాలను ప్రతిపాదిత కర్నూలు బెంచ్ పరిధిలోకి తేవాలని నిర్ణయించిన ప్రభుత్వం.. సీమ ప్రాంతానికి సంబంధించి ప్రస్తుతం హైకోర్టులో ఎన్ని కేసులున్నాయో తెలపాలని కోరుతూ, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు లేఖ రాసింది. ఒక బెంచ్ కొత్తగా ఏర్పాటు కావాలంటే,మొత్తం కేసుల్లో మూడింట ఒక వంతు సదరు ప్రాంతం పరిధిలో ఉండాలి. రాష్ట్ర విభజన చట్టంలోని సెక్షన్ 32 (3) ప్రకారం.. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనకు గవర్నర్ ఆమోదం లభిస్తే బెంచ్ ఏర్పాటు చేయవచ్చు. గవర్నర్ ఆమోదం తర్వాత కేంద్రం, సుప్రీంకోర్టు ఆమోదం లాంఛనప్రాయమే నంటున్నారు.

మొదటి నుంచీ కర్నూలుకు అన్యాయం జరుగుతోందన్న భావన ఆ ప్రాంత వాసుల్లో బలంగా ఉంది. 1953లో ఆంధ్ర రాష్ట్రం అవతరించినప్పుడు కర్నూలునే రాజధానిగా ప్రకటించారు. అయితే హైదరాబాద్ రాష్ట్రం విలీనంతో 1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడింది. హైదరాబాద్‌ను రాజధానిని చేయడంతో కర్నూలుకు నిరాశే ఎదురైంది. రాష్ట్ర విభజన తర్వాత అమరావతిని రాజధానిగా చేశారు, కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని తెదేపా గతంలో ప్రకటించింది. అయితే జగన్ సీఎం అయ్యాక రాజధానిపై మూడు ముక్కలాట ఆడి.. కర్నూలును న్యాయరాజధానిగా చేస్తామని మభ్యపెట్టారు. ఏదీ జరక్కపోవడంతో సీమ ప్రజలు ఇలాంటి హామీలు నమ్మలేని స్థితికి వచ్చేశారు. ఈ నేపథ్యంలో కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటును సాకారం చేయాలని కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. సదరు బెంచ్ కోసం స్థలసేకరణ చేసి శాశ్వత భవనాలు నిర్మించేందుకు వేగంగా అడుగులు వేస్తూనే.. మరోవైపు పై స్థాయిలో అవసరమైన అనుమతులు తీసుకునేందుకు శ్రీకారం చుట్టారు.

2022లో రాయలసీమలో 8 జిల్లాలు ఏర్పడ్డాయి. రాష్ట్ర జనాభా 4.95 కోట్లు కాగా.. సీమలో 1.59 కోట్ల మంది ఉన్నారు. మొత్తం రాష్ట్ర జనాభాలో ఇది 25 శాతం కంటే ఎక్కువ. మొత్తం రాష్ట్ర విస్తీర్ణంలో ఈ ఎనిమిది జిల్లాల విస్తీర్ణం 43 శాతానికి పైగానే ఉంది.

**గత ప్రభుత్వ అవినీతిపై చర్చ**


గత ప్రభుత్వం చేసిన అవినీతిపైనా సభలో చర్చ జరిగింది. వైసీపీ ప్రభుత్వంలో పేదల ఇళ్ల కోసం భూముల సేకరణ, నిర్మాణంలో ప్రతి దశలోనూ భారీస్థాయిలో జరిగిన అవినీతి, అవకతవకలపై ముఖ్యమంత్రితో చర్చించి అవసరమైతే హౌస్ కమిటీకి సిఫార్సు చేస్తామని గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ, రాష్ట్రంలో 30 లక్షల ఇళ్ల పట్టాలు ఇస్తామని చెప్పిన జగన్ ప్రభుత్వం రూ.7 వేల కోట్ల దోపిడీకి పాల్పడిందని ఆరోపించారు. స్థానిక వైసీపీ నాయకులు చిన్న సన్నకారు రైతుల నుంచి ఎకరాకు 6 నుంచి 7 లక్షలకు తీసుకుని.. ప్రభుత్వానికి జగనన్న కాలనీ కోసం రూ. 60 నుంచి రూ.70 లక్షలకు విక్రయించి రూ.కోట్లు స్వాహా చేశారని తెలిపారు. దీనిపై సీఐడీ విచారణ లేదా న్యాయ విచారణ లేదంటే హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే విజిలెన్స్ విచారణ కొనసాగుతున్నందున.. హౌస్ కమిటీపై ఏర్పాటుపై ముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మద్యం సరఫరా కంపెనీల నుంచి రూ.3,113 కోట్లు కమీషన్లు తీసుకున్నారని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు. ఒక్కో మద్యం కేసుకు రూ.250 చొప్పున రూ. 2,861 కోట్లు, ఒక్కో బీరు కేసుకు రూ.50 చొప్పున మొత్తం రూ.252 కోట్ల మేర అక్రమ వసూళ్లకు పాల్పడ్డారని పేర్కొన్నారు. ఆ కమీషన్లు చెల్లించే కంపెనీలకు మాత్రమే సరఫరా ఆర్డర్లు ఇచ్చారని వెల్లడించారు. దీనిపై సీఐడీతో దర్యాప్తు జరిపిస్తున్నామని.. అది పూర్తయ్యాక మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వస్తాయని పేర్కొన్నారు. గత ఐదేళ్లలో జగన్ జల్సాలకు రూ.5 వేలకోట్లు ఖర్చు చేశారని టీడీపీ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. సర్వే రాళ్లపై బొమ్మలు, పాస్ పుస్తకాలపై బొమ్మలు, కార్యాలయాలకు పార్టీ రంగులు, రుషికొండ ప్యాలెస్‌ల పేరుతో వేలకోట్లు వృథా చేశారన్నారు.



**తురగా నాగభూషణం**
సీనియర్ జర్నలిస్ట్

47

# యాచన కాదు... పౌరుషమే పరమావధి




ఏకచక్రపురంలో ఉంటున్నారు పాండవులు. బాగానే ఉంది. తిండి ఎలాగో గడిచిపోతున్నది. ఫర్వాలేదు. అయితే భీముడికే ఏమీ తోచటంలేదు. చేతులకు ఏమీ పనిలేదాయె. ఇంకోటి కూడా ఉంది. పస్తుండటం కంటే బిచ్చమెత్తుకోవటం మేలు కదా అనేది బలహీనుల సిద్ధాంతం. లేదా సర్వసంగ పరిత్యాగులయి భిక్షాన్నమాత్ర జీవనులయిన వారి సిద్ధాంతం. బలశాలి, పరాక్రమశాలి. క్షాత్ర తేజస్సంపన్నుడు అయిన భీమసేనుడి సిద్ధాంతం అది కాదు. ఆతనిది చావో బ్రతుకో తేల్చుకునే తత్త్వం. చావటం కాదు, జీవించాలి. జీవించినన్నాళ్లు పౌరుషంగా ఉండాలి. తలెత్తుకొని బతకాలి. నలుగురిలో భేష్ అనిపించుకోవాలి. మగసిరిగా ఉండాలి. అంతేగాని చచ్చుపీనుగులవలె పడి ఉండటం భీముడివల్ల కాదు. జీవచ్ఛవాలవలె ఉండే మనుషులంటే భీముడికి గిట్టదు. 'మేము అహింసా వాదులం. కాబట్టి అవతలివాళ్లు మమ్మల్ని ఏం చేసినా సరే మేము సహిస్తాము, క్షమిస్తాము. అవసరమయితే వాళ్ల చేతుల్లో మరణిస్తాము" అని చెబితే భీమసేనుడు ససేమిరా ఒప్పుకోడు.

అట్లాంటి ఘట్టం రానే వచ్చింది. పాండవులు ఐదుగురూ తమ తల్లితో ఒక బ్రాహ్మణుని ఇంటిలో ఉన్నారు. అవతల బకాసురుడు రంకెలు వేస్తున్నాడు. ఆ రోజున వంతు ఆ ఇంటివారిది. దున్నపోతుల బండి, దాని నిండా అన్నం సిద్ధంగా ఉన్నాయి ఇంటి ముందు. ఇంటిలో నుండి ఎవరో ఒకరు వెళ్లాల్సిన వంతు వచ్చింది. వెళ్లటమేమో తప్పదు. అయితే బాధ కదా! ఏడుపులు, పెడబొబ్బలూ. వీడ్కోలు ఇచ్చే ఘట్టం. యుద్ధానికి వెళ్లే వీరుడికి కాదు. రాక్షసుడికి ఆహారంగా వెళ్లేవాడికి.

కుంతీదేవి చూస్తూనే ఉంది. ఆమెకు తెలుసు దీనికి పరిష్కార మార్గం. భీముణ్ణి పిలిచింది. "నాన్నా, వీళ్ల సంగతి ఇది. నీవు వెళ్లు ఈ బండితో. అక్కడ ఎవడో బకుడనే తుంటరి ఉన్నాడుట, అల్లరి పెడు తున్నాడుట. వాడి సంగతి చూసిరా కాస్త" అన్నది. ఇంటివారికి ధైర్యం చెప్పింది. "మా వాడు సమస్యను మూల మట్టంగా పరిష్కరించి వస్తాడని చెప్పింది. మాతృదేవి ఆజ్ఞను శిరసున దాల్చి వెళ్లాడు వాయు పుత్రుడు. భీముడికి పండుగ. బండి నిండా కావలసిన అన్నం. ముందు దానిని పూర్తి చేశాడు. ఈలోగా బండి అడవిలోకి వెళ్లవలసిన చోటికి వెళ్లింది. అక్కడ బకాసురుడు ఆవురు ఆవురుమంటు న్నాడు. "ఏమిటి చెప్మా, ఇవ్వాళ ఇంతవరకు రాలేదు వీళ్లు" అని కాసేపు "రానీ, వీళ్ల పని చెబుతాను" అని కాసేపు "అసలు ఏకచక్రపురవాసుల సంగతే తేలుస్తాను రేపు" అని కాసేపు ఆవేశపడిపోతున్నాడు. కాలు గాలిన పిల్లిలా తిరుగుతున్నాడు, నిప్పులు త్రొక్కుతున్నాడు, హుంకరిస్తున్నాడు. ఉద్రేక పడిపోతున్నాడు.

బండి వచ్చింది. ఖాళీ బండి దిట్టంగా తిని త్రేన్పుతూ మీసం మెలిమేస్తూ, జబ్బలు చరుచుకుంటూ బండిమీద భీమసేనుడు. ఇదీ దృశ్యం. బకాసురుడికి అగ్నిమీద ఆజ్యం పోసినట్లయ్యింది. అమాంతం భీముడుపైకి లంఘించాడు. భీముడు ఎడమచేత్తో వాడిని ఒక ప్రక్కకు నెట్టాడు. గభీలున క్రిందపడ్డాడు వాడు. ఛట్టున దూకి భీముడు వాడి రొమ్ముల మీదకి ఎక్కి నిల్చున్నాడు. గొంతుమీద తన ఎడమకాలితో తొక్కిపెట్టాడు. వాడి చేతులు మెలి త్రిప్పాడు. అకస్మాత్తుగా జరిగింది ఇది. ఈ మెరుపు సంఘటనకు బకాసురుడు బిత్తరపోయాడు. తత్తర పడ్డాడు. అర్థంకాలేదు. విషయం ఇలా జరుగు తుందని వాడు కలలో కూడా ఊహించలేదు. ఊహ కందలేదు. లేకపోతే సిద్ధపడి ఉండేవాడే. తనకు ఎదురు తిరుగుతారు ఎవరైనా అని వాడెలా అనుకుంటాడు? ఏకచక్రపురవాసుల ప్రతాపం వాడికి తెలియనిదా? చెప్పుక్రింద తేళ్లు కదా వారంతా. ఏదో కొత్త రక్తం ప్రవేశించింది. లేకపోతే ఇది అసంభవం.

భీముడే తీర్చాడు వాడి సందేహాన్ని. "ఏమిరాదీ! ఇక చెప్పు. మన లెక్కలు తేల్చేసుకుందామనుకున్నాడు. "ఏమిటి! నీకు రోజూ రెండు దున్నపోతులూ, వాటితో పాటు ఒక బండి అన్నమూ– ఇవి చాలక ఒక మనిషి కావాలా భోజనానికి" అని ప్రశ్నించాడు. "ఇవి చాలువా, ఇంకేమన్నా ఉన్నాయా నీ కోరికలు, తీరు స్తాను చెప్పు.

**–వైశంపాయన, జాగృతి, 7.8.1982**

ఆధ్యాత్మికం




# ఆగ్రహంతో పాటే అనుగ్రహం

దుర్వాసుడు పరమేశ్వర అంశంతో అత్రి, అనసూయ దంపతులకు జన్మించాడు. అన్ని యుగాలలోని ప్రధాన సంఘటనలలో ఆయన ప్రమేయం కనిపిస్తుంది. ఆయన ముక్కోపి అంటూ కోపానికి చిరునామాగా చెబుతారు. అందుకే వెళ్లిన చోటల్లా విపరీత భక్తిశ్రద్ధలతో పూజలందుకున్నాడు. అయితే ఎంతటి ఆగ్రహవంతుడో అంత అనుగ్రహశీలి కూడా. ఇష్టులను మన్నించినట్లే, కోపం తెప్పించిన వారిని శపిస్తాడు. కుంతీదేవి తన సపర్యలతో మెప్పించి ఆయన అనుగ్రహపాత్రురాలు కాగా అంబరీషుడు, శకుంతల తదితరులు ఆయన శాపాల బారినపడ్డారు. దుర్వాసుడు గర్భస్థశిశువు గానే హైహయ వంశానికి చెందిన రాజును తన కోపంతో దహించివేశాడని పురాణ కథనం. ఆ రాజు అత్రి మహర్షిపై కోపంతో అనసూయ గర్భంలోని శిశువును ఎదగనీయకుండా చేశాడట. అందుకు బాధపడిన అనసూయ రుద్రత్వంతో క్రోధమూర్తిగా మారందని, ఆ తమోగుణం గర్భం లోని శిశువులోకి ప్రవేశించగా, ఆతని కోపానికి ఆ రాజు భస్మమైపోయాడట. పెరిగి, ఉపవీతు డైన దుర్వాసుడు తల్లిదండ్రుల ఆశీస్సులు అందుకొని

# దేహానికి 'ఆత్మ' దేశానికి 'ధర్మం'

47




"దేహానికి ఆత్మ ఎలాంటిదో – దేశానికి ధర్మం సైతం అలాంటిది. ఆత్మవినా దేహం – ధర్మం వినా దేశం మృతప్రాయాలు. ఈ దేశ ధర్మానికి ప్రపంచంలోని ఏ ఇతర దేశ ధర్మాలకూ పోలని ఒక విశిష్ట లక్షణ సంచయం ఉంది. అందువల్లనే మన ధర్మం విశ్వధర్మం కాదగింది.

ఒక జాతి ధర్మం, ఆ జాతి సంస్కృతి ఎంతటి సనాతనమనదే అయినా సమాజంలో నీ తద్ధర్మానోష్ఠానం నిత్యం జరుగుతున్నప్పుడే ఆ ధర్మం సజీవం, సచైతన్యం. మన ధర్మం ఈనాటిది కాదు. వేదాల ఉద్భవానికే ఒక కాలా న్నంటూ నిర్ణయించినా, మన ధర్మం అంతకన్న పురాతమైనదిగా పేర్కొన్నారు. 'ఇతి ప్రాచీన యోగ్యోపాస్వా...' అని వేదంలో ఒక వాక్యం ఉంది. వేదకాలంలోనే ఒక గురువు తన శిష్యునితో, 'ఈ ప్రాచీన విద్యకు నీవు ఈ విధంగా యోగ్యుడవు' అని అంతకు గూడా సనాతనమైన ఒక సంస్కృతి, విద్యను గురించి గురువు శిష్యునకు బోధించడం ఉంది. దీనినిబట్టి మన ధర్మం ఏనాడు రూపొందిందో నిర్ణయించటం కష్టం. అంతటి అతి సనాతన ధర్మం, ఇటీవలి ముస్లిం, బ్రిటిషు దండయాత్రలూ, తాకిడులను తట్టుకొని నిలబడగలిగింది. అలా మన ధర్మం నిలబడగలగటానికి గల ఏకైక కారణం – అది నిత్య చైతన్యంతో మన సమాజంలో అనుష్ఠితమవుతూ ఉండటమే.

అయితే, ఇటీవల కొంతకాలంగా సమాజంలో ధర్మగ్లాని ఏర్పడింది. ఈ గ్లాని ఎంతదాకా దోవ తీసిందంటే..మన పరిసారలలోనే ధర్మనిష్ఠాతుక చర్యలు జరుగుతున్నా మనకు పట్టని స్థితికి మనలను దిగజార్చింది. ప్రాణభూతమైన ధర్మం ఇలా విస్మరణపాలవుతూర నేటి సమాజం జీవచ్ఛవంలా తయారయింది. ఇది ఇలాగే కొనసాగితే – ఈ దేశం, ఈ ధర్మం ఒకనాటికి ఏమవుతుందో అన్న ఆదుర్దా ధర్మచింత గల కొద్దిమందిలో కలిగింది. ఒక వంక మన ధర్మవిస్మరణాన్ని ఆసరాగా తీసుకొని విమత

**'నేను హిందువును' అని చెప్పుకోటానికి గర్వపడగలగాలి. ఆ స్థాయికి మనం చేరుకో గలిగిన నాడు, ఆ స్థాయిలో మన మనోభావరీతి సాగ గలిగిననాడు మన ధర్మంపై ఎవరూ ఎలాంటి ఆఘాతాలను కలుగజేయలేరు. మన గీత మనకు కర్తవ్యం బోధిస్తుంది.**

శక్తులు విజృంభించి, మన దేశీయ జనసందోహాన్ని, తమ భౌతిక వైభావాది ప్రలోభాలకు బానిసలను చేసుకొంటు న్నాయి. మరోవంక దేశ ప్రభుత్వం 'సెక్యులరిజం' అంటూ స్వీయధర్మ విస్మరణానికీ, పరధర్మాచరణానికీ పూనుకోవడం కనిపిస్తుంది. ఈ ధర్మసంజాతు లయినవారే, ఈ అధునాతన 'సెక్యులర్' నినాదం మోజులోని పడి ఈ ధర్మజులం కాదని చెప్పుకొనే స్థితికి దిగజారటం కనిపిస్తోంది, సంస్కృతి దేశ లక్షణానికి వ్యక్తి వికాసానికీ సంకేతం. ఆధారభూతం మన సంస్కృతి. ప్రాచీనమూ, సనాతనమూ అయిన వైదిక సంస్కృతిని పరి రక్షించుకోవటం ఈ సంస్కృతీ భవులుగా మన కనీస విధి. మనకు ధర్మం వినా సంస్కృతి లేదు.

'నేను హిందువును' అని చెప్పుకోటానికి గర్వపడగలగాలి. ఆ స్థాయికి మనం చేరుకోగలిగిననాడు, ఆ స్థాయిలో మన మనోభావరీతి సాగ గలిగిననాడు మన ధర్మంపై ఎవరూ ఎలాంటి ఆఘాతాలను కలుగజేయలేరు. మన గీత మనకు కర్తవ్యం బోధిస్తుంది. మన హిందువులలో ప్రగాఢంగా పాదుకొనాలంటే నిత్య భగవద్గీతాధ్యయనం, ఆచరణాలు అవసరం. మన ధర్మ, విశ్వాసాలను మరొకరెవరూ తాకినా భరించలేని,సైపజాలని తీవ్ర ఆచంచల భక్తి ప్రపత్తులూ, శ్రద్ధాసక్తులు మనలో పాదుకొనిననాడు తప్ప మన హైందవ ధర్మం పూర్వ వైభవస్థితికి రాదు. అంతటి ఉచ్చస్థితికి, ఉత్తమోత్తమ వైభవస్థితికి ఈ మన ధర్మాన్ని కొనిపోగల శక్తియుక్తులు సాధించటం హిందువుడై పుట్టిన ప్రతివాని కనీస బాధ్యత. ఈ బాధ్యతను మనం మనసా, వాచా, కర్మణా భావించి, ఆచరించగలప్పుడే మన ధర్మం రక్షణ పొందతుంది. అప్పుడే మనలను మన ధర్మం గూడా రక్షిస్తుంది('ధర్మో రక్షతి రక్షితః').

**– స్వామి దయానంద సరస్వతి**

**జాగృతి, 24.3.1969**

---

దూరప్రాంతానికి వెళ్లి తీవ్ర తపస్సు చేశాడు. ఏ లోకంలో అయినా స్వేచ్ఛగా సంచ రించగల శక్తి పొందాడు. శ్రీరామ, శ్రీకృష్ణుల అవ తరాలు పరిసమాప్తికి సయమం ఆసన్నమైనప్పుడు ఆయన ఒక పరికరంగా ఉపకరించి, ధర్మకార్యం జరిగేలా పూనుకున్నాడు. అనేక మంది శిష్యులకు జ్ఞానబోధ చేశాడు. ఆయన కుంతీదేవికి అనుగ్ర హించిన వరం కారణంగానే కర్ణుడు జన్మించాడు. అనంతర కాలంలో పాండు రాజు శాపగ్రస్థుడై, సంసారానికి దూరం కాగా, వంశం నిలుపు కునేందుకు ఆ ముని వరంతోనే కుంతి ముగ్గురికి జన్మనిచ్చింది. అదే మంత్రమహిమతో పాండురాజు రెండవ భార్య మాద్రికి ఇద్దరు పుత్రులు (నకులు సహదేవులు) కలిగారు. అలా పాండురాజు వంశ క్షయం కాకుండా వరం రూపంలో కాపాడాడు దుర్వాసముని. ఆయన ఒకసారి కుంతీభోజుడి దగ్గరకు వచ్చినప్పుడు, ఆయన తన కుమార్తె కుంతిని మునిసేవకు నియోగిస్తాడు. ఆమె సపర్యలకు మెచ్చిన దుర్వాసుడు, దేవతా ఉపాసన మంత్రాలను ఉపదేశించాడు. ఆమె ఆ మంత్రాన్ని పరీక్షించే క్రమంలో సూర్యుని ఉపాసించి కర్ణుడిని పుత్రుడిగా పొందింది. అయితే ,అవివాహిత కావడంతో ఎటూ పాలుబోక ఆ బిడ్డను నదిలో వదిలి వేస్తుంది. మరో సందర్భంలో విష్ణువు పరమ భక్తుడు అంబరీషుడిని పరీక్షించబోయి, పరాభూతుడవు తాడు. ఆయన వైఖరివల్ల అంబరీషుడి చరిత జగద్విఖ్యాతమైంది. దుర్వాసుని శాపం కారణం గానే యాదవకులంలో ముసలం పుట్టిందని భారతం చెబుతోంది. భూభారం తగ్గించేందుకు శ్రీకృష్ణుని ఎత్తుగడలో అది ఒక భాగమని ఒక పురాణం పేర్కొంది.

**– రామచంద్ర రామానుజ**

---

## వివేకానంద సూక్తిశతి

**In eating dressing or lying, in singing or playing in enjoyment or disease, always manifest the highest moral courage if you build your character after such an idea! then althousand others will follow**

**ఆటపాటలందు అలవాట్లయందున**
**వేషభాషలందు వృత్తులందు**
**నీతి తప్పకుండ నీవు చరింపుము**
**వినుడి స్వామి సద్వివేక వాణి!!**





బండిరాజుల శంకర్

# తూర్పు పడమర



3

రెండు సంవత్సరాలు గడిచాయి. నా ఇంటర్ పూర్తైంది. నాకు 90 శాతం పైగా మార్కులు వస్తే సమీరకి 85 శాతం వచ్చాయి. నాకు ఎమ్‌సెట్‌లో 200 లోపు ర్యాంకు వచ్చింది. సమీరకు 500 రాంకు. మొత్తానికి వేసవి తరువాత మేము విశాఖపట్నంలో యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలో చేరాం. మధు, శ్రీరామ్‌లకి పెద్ద రాంకులు రావడంతో విశాఖలోనే ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీ లో చేరారు. కాకపోతే మా నలుగుర్లో నేనొక్కణ్ణే సివిల్ ఇంజనీరింగ్‌లో చేరితే సమీరతో సహా మిగిలిన ముగ్గురు కంప్యూటర్ సైన్స్ చేరారు. అప్పటికి కంప్యూటర్ సైన్స్ బాగా డిమాండ్‌లో ఉంది. చాలా మంది కంప్యూటర్ సైన్సే చదివి అమెరికా వెళ్లిపోతునారు. అమెరికా చాలామందికి గమ్యం అయిపోయింది. ఇక్కడ ఏ బ్రాంచిలో చదివినా అమెరికాలో ఎమ్ఎస్ చదవడం, ఆ తరువాత సాఫ్ట్‌వేర్ కొలువులు.

నేను మా అమ్మానాన్నలకి ఒక్కడినే. అందుకే వాళ్లని వదలి వెళ్లడం ఇష్టంలేక సివిల్ ఇంజనీరింగ్ తీసుకున్నాను. సివిల్ ఇంజనీరింగ్ అయితే ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చే అవకాశాలు ఎక్కువ అని మా సైన్స్ లెక్చరర్ చెప్పడం కూడా ఇంకొక కారణం. 200లోపు రాంకు వచ్చిన నేను సివిల్లో చేరడం చాలా మందికి ఆశ్చర్యం కలిగించింది. ఊరందరిదీ ఓ దారి అయితే ఉలిపి కట్టెది వేరే దారన్నట్లు నాలాంటి వాళ్లు సమాజంలో ఎప్పుడూ ఉంటారు.

నాకెందుకో చిన్నప్పట్నుంచీ ఆధునిక చదువులు, నాగరికత అంటే అంత ఇష్టం ఉండేది కాదు. ఈ కొత్త తరం సమాజానికి చేటు చేస్తుందని నా నమ్మకం. నా నమ్మకం నిజమో కాదో కాలమే చెబుతుంది. ఇలాంటి భావాలు నాకు రావడానికి కారణం నేను చదివిన తెలుగు సాహిత్యం. ముఖ్యంగా వేయిపడగలు, కన్యాశుల్కం, మహాప్రస్థానం, అమృతం కురిసిన రాత్రి లాంటి పుస్తకాలు. మరీ ముఖ్యంగా వేయిపడగలు బాగా ప్రభావితం చేసింది. ఆ పుస్తకాన్ని మా హెడ్మాస్టర్ రమణమూర్తి గారింటి నుంచి తెచ్చి పదవతరగతి సెలవుల్లో చదివాను. 999 పేజీల ఉద్గ్రంథం. విశ్వనాథ వారు 1933లో ఆంధ్ర విశ్వవిద్యాలయం పెట్టిన నవలల పోటీ కోసం రాశారు. అందులో ప్రథమ బహుమతి వచ్చింది. దానిని చదవడానికి నాకు పదిరోజులు పెట్టింది. కానీ కొన్ని నెలల దాకా నన్ను వెంటాడింది.

ఆ రోజు మా హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ రామారావు గారు కొన్ని ఆసక్తికరమైన విషయాలు చెప్పారు. ఇంజనీరింగ్ అంటే సైన్స్ అప్లికేషన్ అనీ, ప్రపంచంలో జీవరాశి ఉనికి ఐదు వేల సంవత్సరాల నుంచీ ఉన్నట్లు రుజువులున్నాయనీ, బిగ్ బేంగ్ థియరీ ద్వారా పెద్ద విస్ఫోటనం జరిగి భూమి, సముద్రాలు ఏర్పడ్డాయనీ చెప్పారు. పురాణాల్లో మయుడు ఓ పెద్ద ఇంజనీరనీ, పాండవులకు మయసభను ఆయనే నిర్మించారనీ, గాలిలో ఎగిరే విమానాలు పుష్పక విమానల రూపంలో కొన్ని వేల సంవత్సరాల కితమే ఉన్నట్లు రుజువులు న్నాయనీ చెప్పారు.

“హరప్పా, మొహేంజదారోలో 1921లో జరిపిన తవ్వకాల్లో గొప్ప నగరాలు బయటపడ్డాయి. అంటే మానవ నాగరికతకు చాలా సంవత్సరాల చరిత్ర ఉంది. సివిల్ ఇంజనీరింగ్ అంటే పౌరులకు సంబంధించినది. సమాజానికి కావలసిన వనరులను సమకూర్చేది. దానికి కావలసిన గృహాలు, రహదారులు, వంతెనలు, చెరువులు, ఆనకట్టలు, కర్మాగారాలు... ఇలా

‘జాగృతి’ నిర్వహించిన స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక నవలల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన రచన



ఎన్నింటినో నిర్మించే ఇంజనీరింగ్.

రాతియుగం, లోహయుగం... లోహయుగం అంటే మళ్లీ ఇత్తడి, ఇనుముల యుగాలు. మొదట్లో ఆదిమ మానవుడు గుహల్లో ఉండేవాడు. ఆహారం కోసం బయటకు వచ్చేవాడు.

రోజూ ఏ దారంట ప్రయాణించాడో తన అడుగులను చూసుకొని, మళ్లీ అదే దారిలో వెనక్కి వచ్చేవాడు. అలా ఆ అడుగుల ముద్రలు కొన్నాళ్లకు దారిగా పరిణామం చెందాయి. అది రహదార్లకు నాంది పలికింది. మానవుడికి ఎప్పుడైనా చిన్న చిన్న ప్రవాహాలు లేదా చెలమలు అడ్డు వచ్చినప్పుడు వాటిని ఎలా దాటాలో తెలియక వెనుతిరిగి పోయేవాడు. ఒకసారి తుపానుకి ఒక చెట్టు ఆ గెడ్డకి అడ్డంగా పడినప్పుడు దాని మీద నుంచి ఒక కోతి అవతలి వైపుకి వెళ్లడం చూసి తాను కూడా దాని మీద నడుచుకుంటూ అవతలి ఒడ్డుకి వెళ్లాడు. అలా వంతెనలకు బీజం పడింది. 1830 ప్రాంతంలో 3 కిలోమీటర్ల వెడల్పు గల గోదావరి ప్రవహిస్తున్నా గోదావరీ పరివాహక ప్రాంతమైన ప్రస్తుత కోనసీమ ప్రాంతం కరవు బారినపడి వేలమంది చనిపోయారు. అప్పుడు సర్ ఆర్థర్ కాటన్ మహాశయుడు బ్రిటిష్ ప్రభుత్వంతో పోరాడి ధవళేశ్వరం దగ్గర రాతితో ఆనకట్ట కట్టి కాలువల ద్వారా పొలాలకు నీరందించాడు. ఆ ప్రాంతం తరువాత సస్యశ్యామల మైంది. అదే కోనసీమ .. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో..!. సివిల్ ఇంజనీర్లను సమాజ నిర్మాత లంటారు. “దే ఆర్ గుడ్ బిల్డర్స్ ఆఫ్ సొసైటీ” అంటూ సివిల్ ఇంజనీరింగ్ మీద ఎన్నో ఆసక్తికరమైన విషయాలు చెప్పాడాయన.

ఆయన చెప్పిన తరువాత నాకు మొదటిరోజే సివిల్ ఇంజనీరింగ్ అంటే గౌరవం ఏర్పడింది.

ఆ రోజు సాయంత్రం కాలేజీ ఆవరణలో సమీరని కలిసాను. ఇద్దరం బీచ్‌కి వెళ్లాం.

బీచ్ నిండా జనమే. ఒకచోట సరుగుడు చెట్ల దగ్గర నిర్మానుష్యంగా ఉంటే అక్కడికెళ్లి కూర్చున్నాం.

దూరంగా సముద్రపు హోరు. కెరటాలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయి. పడమటి సంజె ఎర్రగా కనిపిస్తోంది. కనుచూపు మేరలో చిన్నచిన్న పడవలు కనిపిస్తున్నాయి. తీరమంతటా చల్లటి గాలి.



“ఎక్కడ ఉంటున్నావు?” అడిగాను సమీరని. కాలేజీలో చేరిన తరువాత ఆమెను కలవడం కుదరలేదు. ఈ రోజే ఆమెను చూశాను. తెల్లటి పంజాబీ దుస్తుల్లో అందంగా కనిపిస్తోంది.

“హాస్టల్లో... అదృష్టవశాత్తు సీటు దొరికింది. ఒక్కరోజు ఆలస్యమైనా దొరికేది కాదు... మరి నువ్వెక్కడ ఉంటునావు?” అనీ అడిగింది.

“నేను కూడా హాస్టల్ కోసం అప్లై చేసాను. ప్రస్తుతం నేను, మధు ఒక రూము తీసుకున్నాం. శ్రీరామ్ గాడికి వాళ్ల హాస్టల్లో సీటు దొరికిందిట. మీరు ముగ్గురు కట్టకట్టుకొని మరీ కంప్యూటర్ సైన్స్‌లో చేరారు. అందరూ అమెరికాకి సేవ చేద్దామనే’గా!’ అన్నాను నవ్వుతూ...

నా మాటలు సమీరకు కోపం తెప్పించాయి. “కంప్యూటర్స్ చదివిన ప్రతీవాళ్లు అమెరికాకి వెళ్లిపోతారా?” అంది కోపంగా ముఖం పెట్టి.

“నేను మామూలుగా అన్నాను. అమెరికా వెళ్లాలంటే కంప్యూటర్స్ చదవక్కర్లేదు...ఇంతకీ మొదటి రోజు ఏం చెప్పారు?” అనీ అడిగాను.

“ఎవరో ప్రొఫెసర్ వచ్చారు. ఆయన నువ్వు చెప్పినట్లే అంతా అమెరికా గురించే మాట్లాడాడు. మనదేశం నుంచి ప్రతి సంవత్సరం 2 లక్షల మంది వెళుతున్నారట. అమెరికా వెళ్లాలంటే సాఫ్ట్‌స్కిల్స్ ముఖ్యమట. అందుకనీ కొన్ని లాంగ్వేజెస్ నేర్చుకోవాలిట. కాలేజీ కన్నా బయటే లాంగ్వేజెస్ బాగా చెబుతారట. ఇక్కడ సరియైన ఫ్యాకల్టీ లేదట. అందుకనీ ఇక్కడ ఏదో మంచి ఇన్స్టిట్యూట్ ఉందట. అందులో సీలాంగ్వేజ్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్... ఇంకా ఏవో చెప్పాడు. వాటినన్నింటినీ నేర్చుకోవాలిట. ఇంత డబ్బు పోసి యూనివర్సిటీ కాలేజీలో చేరితే బయట నేర్చుకోవాలట.” అంది ఎగురుతున్న ముంగురుల్ని వెనక్కి తోసుకుంటూ.

పడమర సంజె వెలుగు ఆమె ముఖంపై పడి పరావర్తనం చెందుతుంటే బుగ్గలు గులాబీ రంగుని సంతరించుకున్నాయి. పొడవైన జడలోని మల్లెదండ సుగంధం ముక్కుకు సోకుతూ మత్తుని కలిగిస్తోంది. స్వతహాగా సమీర చాలా అందగత్తె. దానికి తోడు పరువం తోడై మరింత అందాలు సంతరించు కోవడంతో ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తోంది. ఆమెను అలా తేరిపార చూడటం సంస్కారం కాదనీ ముఖం పక్కకి తిప్పుకున్నాను.

“మరి ఆ కోర్సుల్లో చేరతావా?” అడిగాను.


“ఇంకా ఏం నిర్ణయించుకోలేదు. మాఫ్రెండ్స్‌ని అడుగుతాను. వాళ్లు చేరితే నేనూ చేరక తప్పదు. లేకపోతే వెనకబడిపోతాను” అంది కెరటాల వైపు చూస్తూ.

“మిగతా మన స్నేహితుల గురించి ఏమైనా తెలిసిందా?” అనీ అడిగాను.

“మాధురి కంప్యూటర్స్‌లోనే ప్రైవేట్ కాలేజీలో చేరింది. అది వాళ్ల చుట్టాల ఇంట్లో ఉంటోంది”.

“మాధురి నాకు బాగా తెలుసు. మన పక్క ఊరే... చాలా సరదాగా ఉంటుంది. మంచి తెలివైనది.”

“ఇంతకీ ఇంజనీరింగ్‌లో చేరిన తరువాత మీ ఇంట్లో వాళ్లు ఏమంటున్నారు? ముఖ్యంగా మీ నాన్న?”




‘‘వ వా అమ్మ చాలా సంతోషించింది. మా అన్నయ్యకు నన్ను అమెరికా పంపించాలనీ ఉంది. అప్పుడే అమెరికా ఎలా వెళ్లాలో, ఏ కంపెనీలో ఉద్యోగాలొస్తాయో చెప్పేస్తు నాడు. వాడు మళ్లీ సంవత్సరం అమెరికా వెళ్లిపోతాడట. ప్రస్తుతం వాడు ఏదో కంపెనీలో చేస్తున్నాడు. అమెరికాలో ఎమ్మెస్‌కి అప్లయ్ చేశాడు. ఈ సారి జీఆర్ఈలో స్కోర్ కూడా బాగా వచ్చిందిట” అంది.

“ఓహో... ముందు అన్న. వెనకే చెల్లెలు అమెరికా చెక్కేస్తా రన్నమాట. మీలా అందరూ అక్కడికి వెళ్లిపోతే ఇండియాని ఎవరు బాగు చేస్తారు చెప్పు!” అన్నాను ఆమెని ఉడికించాలని.

“నువ్వు ఉన్నావుగా! బాగు చెయ్యి. ఎందుకంటే నువ్వు గొప్ప దేశభక్తుడివి... మేమేమో వ్యతిరేకులం” అంది సమీర నవ్వుతూ...

“అలా అని కాదు... 20 సంవత్సరాల నుంచీ మన దేశంలో యువత, విద్యార్థుల విదేశీ వలసలు ఎక్కువయ్యాయి. అందువల్ల చాలా కుటుంబాల్లో తల్లితండ్రులు ఒంటరి వారవుతున్నారు. వాళ్లని చూసేందుకు ఎవ్వరూ లేక వృద్ధాశ్రమాల బాట పడుతునారు. ఇది మానవ సంబంధాల మీద పెద్ద ప్రభావం చూపిస్తుందనీ ఆంత్రోపోలజిస్టులు చెబుతున్నారు. చదువు కోసం అమెరికాకి వెళ్లవచ్చు కానీ, అక్కడ ఉండిపోతేనే సమస్య. దాని వల్ల మన తరువాత తరం మనకి దూరం అవుతుంది. వాళ్లు ఆ దేశ పౌరులైపోతారు. కొన్నాళ్లకు అది మన ఉనికినే ప్రశ్నార్థకం చేస్తుంది” అన్నాను ఆలోచిస్తూ.



గన్నవరపు నరసింహమూర్తి

# భారత ప్రగతి

**ప్రధాని మోదీని సాధించేందుకు, పార్లమెంటులో ప్రభుత్వ అజెండాను అడ్డుకునేందుకు ఇటీవల ప్రతిపక్షాలు వ్యాపారవేత్త అదానీని ఆయుధంగా వాడుకుంటున్నాయి. గత సమావేశాలలో అదానీ అవినీతిపరుడంటూ హిండెన్‌బర్గ్ సంస్థ విడుదల చేసిన నివేదికను అడ్డుపెట్టుకొని పార్లమెంటు నడవకుండా అటంకపరిచిన ప్రతిపక్షాలకు ఈసారి మరింత పదునైన ఆయుధం లభించింది. ఎక్కడో అమెరికాలోని న్యూయార్క్‌లో ఒక జిల్లా కోర్టులో బ్రియాన్ స్టేసీ పీస్ అనే ప్రభుత్వ న్యాయవాది అదానీ తన వ్యాపారాల విస్తరణ కోసం భారత్‌లోని రాష్ట్ర ప్రభుత్వాలకు లంచం ఇస్తున్నాడంటూ అభియోగాలు మోపడం ఒక సంచలనమై పోయింది.అంతేకాదు, ఈ మేరకు అదానీకి సమన్లు కూడా జారీ అయ్యాయని వార్తలు వచ్చాయి. ఈ విషయాన్ని మీడియా రిపోర్టు చేయడంతో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చెలరేగిపోయారు. అయితే, ఆ కోర్టు పేర్కొన్న రాష్ట్ర ప్రభుత్వాలలో ఒక్కటి కూడా బిజేపీది కాదనే విషయాన్ని గుర్తించలేదు. పైగా, ఒక్క వైఎస్ఆర్‌సీపీ మినహా అవన్నీ కూడా ఇండీ కూటమి ప్రభుత్వాలే! కాగా అభియోగాలు మోపిన న్యాయవాదికి, అసుర సోరోస్‌కూ సంబంధం ఉందని, అందుకే ఈ తీర్పు వచ్చిందని విశ్లేషకులు అంటున్నారు. ఇక అమెరికాలోని డీప్ స్టేట్‌తో మన ప్రతిపక్ష నేతకు ఎంత మంచి సంబంధాలున్నాయో, ఆ మధ్య కాలంలో ఆయన అమెరికా పర్యటన వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే.**

ప్రధానమంత్రి మోదీ, ఆదానీ ఒకే రాష్ట్రానికి చెందిన వారు కావడం, ఇద్దరూ తమ తమ రంగాల్లో కొరకరాని కొయ్యల్లాగా తయారు కావడాన్ని ప్రతిపక్షాలు తట్టుకోలేకపోతున్నాయి. ముఖ్యంగా, కేవలం భారత్‌లోనే కాక అంతర్జాతీయంగా ప్రధాని మోదీకి రాజనీతిజ్ఞుడిగా గుర్తింపు రావడంతో పాటుగా, అదానీ కూడా ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా ఆసియా, ఆఫ్రికాల్లో తన ప్రభావాన్ని పెంచుకుం టున్నాడు. తమ రాష్ట్రాలలో పెట్టుబడులు పెట్టి, ప్రాజెక్టులు ప్రారంభించమని కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలన్నీ ఆయన వెంటపడుతుండే విషయం తెలిసిందే. అయినప్పటికీ, పార్లమెంటు సమావేశాల సమయంలో అదానీ మాత్రం 'విలనే'.

పునరావృత ఇంధన ప్రాజెక్టుల కోసం 265 మిలియన్ డాలర్ల మేరకు లంచాలను ప్రభుత్వ అధికారులకు ఇచ్చేందుకు అదానీ, ఆయన మేనల్లుడు సాగర్ అదానీ అంగీకరించారంటూ న్యూయార్క్‌కు చెందిన న్యాయవాది వాదించాడు. సోలార్ ఇంధన సరఫరా కాంట్రాక్టులను పొందేందుకు 2020 నుంచి 2024 మధ్య కాలంలో ఈ పని జరిగిందంటూ అతడు ఆరోపించినప్పటికీ, దానిని నిరూపించేందుకు తమ వద్ద ఏమైనా ఆధారాలున్నాయా? లేదా? అన్న విషయాన్ని స్పష్టంగా చెప్పలేదు.

**భారత ఆర్థిక మూలాలనును దెబ్బతీసేందుకు ప్రణాళికా?**

కాగా, దీనికి మరొక కోణం ఉందని విశ్లేషకులు అంటున్నారు. నానాటికీ భారతదేశ ఆర్థిక వ్యవస్థ స్థిరపడి అంచలంచెలుగా ఎదిగి తొలి ఐదు ఆర్థిక వ్యవస్థల్లో ఒకటి అయింది. ఇదే వేగంతో వృద్ధి చెందితే చైనాను కూడా దాటిపోతుందని అంచనాలు ఉన్నాయి. అదే, జరిగితే అమెరికాతో పోటీ పడే స్థితిలోకి అది వస్తుంది. కాగా, ఇటీవలి కాలంలో అదానీ గ్రూపుపై దాడులు పెరగడానికి కారణం అతడి సంస్థ వృద్ధికి దోహదపడే మౌలిక సదుపాయాల వ్యవస్థను రూపొందిస్తుండడమే. దీనికి తోడుగా, రుణాలు ఇస్తున్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ), లైఫ్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి)ని అస్థిరం చేసేందుకు అమెరికా డీప్ స్టేట్ చేస్తున్న ప్రయత్నాలని వారు అంటున్నారు. నిజానికి హిండెన్‌బర్గ్ ఘటన జరిగిన సమయంలో ఈ సంస్థల నుంచి అదానీ గ్రూపు తీసుకున్న రుణాలు ఒక శాతం కన్నా తక్కువగా ఉండటం వల్లే ఆ సమయంలో వచ్చిన పుకార్ల వల్ల ఆ సంస్థల ఆర్థిక పునాదులు ఏమీ సడలలేదు. ప్రస్తుతం కూడా ఈ వార్త వచ్చిన రోజు స్టాక్ మార్కెట్ పడి పోయినా, మరురోజే పుంజు కొని, ఈ వదంతులను ప్రచారం చేస్తున్న శక్తులను నిరాశపరచింది.

**అంతర్జాతీయ గుత్తాధిపత్యాలను సవాలు చేస్తున్న అదానీ?**

అదానీ కేవలం ఒక పెద్ద వ్యాపారవేత్త అయితే, పాశ్చాత్య దేశాలలో ఎవరికీ అంత పెద్ద సమస్య ఉండి ఉండేది కాదేమో. కానీ ఇప్పటికే పాతుకు పోయిన ప్రపంచ గుత్తాధిపత్యాలను సవాలు చేస్తూ దూసుకు రావడమే ఇన్ని ఆరోపణలు, విమర్శలకు కారణమవుతోంది.

**రేవులు:** భారతదేశంలోనే అతిపెద్ద పోర్ట్ నెట్‌వర్క్‌ను అదానీ నియంత్రిస్తూ, విదేశీ సంస్థల పై ఆధారపడకుండా చేసి, ప్రపంచ షిప్పింగ్ పెద్దలను సవాలు చేస్తున్నాడు. ముఖ్యంగా, ఇతడు నిర్వహించే పోర్టులు అన్నీ ఐఎంఇసి (భారత్, మధ్య ప్రాచ్య వాణిజ్య) కారిడార్‌లో అత్యంత కీలకమైనవి. దీనితో డీప్ స్టేట్‌ను వేడుకోకుండా భారతీయ పరిశ్రమలు ఐరోపా మార్కెట్లను అందుబాటులోకి తెచ్చుకోవచ్చు.

**ఇంధనం:** బొగ్గు నుంచి పునరావృత ఇంధనం వరకూ భారతీయ ఇంధన స్వేచ్ఛను అదానీ ప్రోత్సహిస్తున్నాడు. బాంగ్లాదేశ్ తన సంస్థకు పద్ద బకాయిలను చెల్లించకపోతే, తాను విద్యుత్ ఇవ్వనంటూ అమెరికా కీలుబొమ్మలా ఆడిస్తుంటే ఆడుతున్న మహమ్మద్ యూనుస్‌ను హెచ్చరించాడు. ఇప్పుడు అదానీపై మోపిన అభియోగాల కారణంగా, బకాయలు చెల్లించనని యూనస్ మొండిపట్టు పట్టే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు.

**ఆఫ్రికా:** కెన్యాలో అదానీ పోర్టు ప్రాజెక్టును సాధించుకోవడం అన్నది డీప్ స్టేట్ నియంత్రణకు


గౌతమ్ అదాని

అవాంతరమేనన్నది నిపుణుల మాట. అభియోగాల వార్త బయటకు వచ్చిన వెంటనే కెన్యా తమ ప్రాజెక్టును రద్దు చేసుకుంటున్నట్టు ప్రకటించింది. కాగా, ఈ ప్రాజెక్టు వ్యవహారం మొదటి నుంచే గందరగోళంగా ఉందన్నది వాస్తవం. ఏమైనా, భారత్ వంటి నూతన శక్తి ఒకటి ప్రవేశించి, ఆఫ్రికాలో వనరులను ఉపయోగించుకోవడం డీప్ స్టేట్‌కు ఇష్టం లేదు.

**అదానీని పదే పదే లక్ష్యంగా చేసుకున్న సోరోస్**

అయినప్పటికీ, జార్జి సోరోస్ తన సంస్థలు, తమ పర్యావరణ వ్యవస్థ గతంలో కూడా మోదీపై అక్కసుతో అదానీ సంస్థను అభాసుపాలు చేశాయి. అయినప్పటికీ, స్టాక్ మార్కెట్ కోలుకోవడంతో తట్టుకోలేకపోయిన జార్జ్ సోరోస్, 16 ఫిబ్రవరి 2023న అదానీ–హిండెన్‌బర్గ్ వివాదాన్ని అడ్డుపెట్టు కొని భారతీయ

# ని అడ్డుకోవడమే లక్ష్యం

ప్రభుత్వంపై విరుచుకుపడ్డాడు. మోదీ, అదానీ సన్నిహిత మిత్రులని, వారి అదృష్టం కూడా మెలిపడి ఉందన్నాడు. ఈ నేపథ్యంలో స్టాక్ మార్కెట్ నుంచి నిధులను కూడగట్టాలనుకుని అదానీ విఫలమయ్యాడు. స్టాక్‌ను మానిపులేట్ చేస్తున్నాడంటూ వచ్చిన ఆరోపణల కారణంగా అతడి స్టాక్ విలువ పడిపోయింది. ఆ సమయంలోనే హిండెన్‌బర్గ్ ఆ స్టాక్‌ను చౌకగా కొనుక్కొని, తర్వాత లాభానికి అమ్ముకుంది. ఇదే సోరోస్ ధనవంతుడైన పద్ధతని చెబుతుంటారు. అంతేనా, ప్రధాని మోదీ క్రోనీ కేపిటలిజాన్ని ప్రోత్సహిస్తున్నారని ఆరోపించాడు. దానితో ఆగాడా? లేదు, ఇప్పుడు మోదీ మౌనంగా ఉన్నారని, కానీ విదేశీ పెట్టుబడిదారుల వేసే ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పాలని, అది కూడా



సాగర్ అదాని

పార్లమెంటులో చెప్పాలంటూ ప్రకటించాడు. అంతేనా? హిండెన్‌బర్గ్ నివేదిక భారతీయ మార్కెట్లను వణికించిన తీరు అత్యవసరమైన వ్యవస్థాగత సంస్కరణలకు, ప్రజాస్వామ్య పునరుద్ధరణకు దారి తీస్తుందని కూడా జోశ్యం చెప్పాడు. కానీ, భారత ప్రజలు అదానీపై విశ్వాసాన్ని ప్రకటించి అతడిని నిరాశపరిచారు.

**అదానీ మార్కెట్ విస్తరణతో పాశ్చాత్య మీడియా అసహనం**

పాశ్చాత్య మీడియా దృష్టి అదానీ గ్రూపు, దాని అవినీతిపై ఉంటుందే తప్ప రాబర్ట్ వాద్రా వంటివారి వ్యాపారలావాదేవీలపై ఉండదు. ముఖ్యంగా అదానీ గ్రూపు అంతర్జాతీయ సంస్థగా రూపుదిద్దుకుంటూ త్వరలోనే ట్రిలియన్ డాలర్ విలువను సాధించే దిశలో ఉన్న వాస్తవాన్ని సామ్రాజ్యవాద మీడియా జీర్ణం చేసుకోలేకపోతున్నది. అందుకే, అదానీకి సంబంధించిన ప్రతి కాంట్రాక్టునూ, ఆ సంస్థకు సంబంధించిన నిపుణులకన్నా ఎక్కువ నిశితంగా పరీక్షించి, లొసుగులున్నాయంటూ గగ్గోలు పెడుతుంటుంది.

**ప్రస్తుత వ్యవహారంలో చైనా కోణం**

అమెరికాలోని మౌలిక సదుపాయాలు, ఇంధన ప్రాజెక్టులలో 10 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెడతానంటూ అదానీ హామీ ఇవ్వడమే ప్రస్తుతం వారి అసహనానికి కారణమైందనే వాదన కూడా వినిపిస్తున్నది. ఈ రంగాలలో ప్రస్తుతం చైనా కంపెనీలు ఆధిపత్యం వహిస్తున్నాయి. సోరోస్, హంటర్ బైడెన్ సహా అనేకమంది ప్రముఖ డెమొక్రాట్లతో సంబంధాలు కలిగి, పాతుకుపోయి ఉన్న చైనా కంపెనీలకు అదానీ ప్రత్యక్ష పోటీ కానున్నాడు. రెండోసారి హిండెన్‌బర్గ్ నివేదికను వెలుగులోకి తీసుకువచ్చి, అదానీ షేర్లను చౌకగా కొందామనుకున్న సోరోస్ కంపెనీలు, భారత ప్రజలు, కంపెనీలు దాన్ని నమ్మకపోవడంతో ఆర్థికంగా నష్టపోయాడు. అందుకే, భవిష్యత్తులో అమెరికాలో అదానీ పెట్టుబడులు పెట్టకుండా నిరోధించేందుకే ఈ అభియోగాలని విశ్లేషకులు చెబుతున్నారు.

ఒకవైపు బహిరంగ మార్కెట్లను, నిజాయతీతో పోటీని ప్రోత్సహిస్తామంటూ జబ్బలు చరుచుకునేవారే, నేడు విదేశీ పోటీదారును అణిచివేసేందుకు చురుకుగా వ్యవహరిస్తున్నారు. అది కూడా చట్టపరమైన వ్యవహారం వల్ల కాదు, తమ ఆర్థిక ఆధిపత్యానికి ముప్పుగా పరిణమిస్తున్నాడని అంటున్నారు. భౌగోళిక రాజకీయ, ఆర్థిక నియంత్రణ కోసం చట్టపరమైన యంత్రాంగాన్ని పాశ్చాత్య దేశాల పవర్ బ్రోకర్లు ఉపయోగించేందుకు ఎలా ముందుకు వస్తున్నారో ఈ ఉదంతం చెప్పకనే చెప్తోంది. తాము నిలబెడుతున్నామని చెప్పుకునే విలువలనే వారు తుంగలో తొక్కుతున్న వైనం స్పష్టంగా కనిపిస్తుంది.

**అదానీకి సమన్లు జారీ చేసేందుకు అమెరికా కోర్టుకు అధికారం ఉందా?**

కాగా, అమెరికాలోని సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజ్ కమిషన్‌కు గౌతం అదానీ వంటి విదేశీయులకు సమన్లు జారీ చేసే అధికారం లేదని, ఆ పని వారు తగిన మార్గాల ద్వారా మాత్రమే చేయాలని కన్వర్ సిబల్ వంటి సీనియర్ దౌత్యవేత్తలు సోషల్ మీడియా వేదిక సాక్షిగా స్పష్టం చేస్తున్నారు. అమెరికా ఎస్ఇసి గౌతమ్ అదానీకి సమన్లు



సోరోస్

పంపడమన్నది అవివేకమైన పని అని వారంటున్నారు. సోలార్ ఇంధన కాంట్రాక్టుల కోసం లంచాలు ఇచ్చారన్న ఆరోపణల విషయంలో అదానీలు వివరణ ఇవ్వాలని ఎస్ఇసి కోరుతోంది. కానీ, అటువంటి వివరణ కోరాలంటే, వారు అమెరికాలోని ఇండియన్ ఎంబసీ ద్వారా ప్రోటోకాల్‌ను అనుసరించి చేయాల్సి ఉంటుంది. ఎందుకంటే, విదేశీ పౌరులను అలా కోరే అధికారం ఎస్ఇసికి ఉండదు. ఈ విషయాలు భారత్, అమెరికాల మధ్య 1965లో జరిగిన హేగ్ కన్వెన్షన్ కిందకు మ్యూచ్యువల్ లీగల్ అసిస్టెన్స్ ఒప్పందం కిందకు వస్తాయి. ఈ ఒప్పందాల ప్రకారం ఇటువంటి సందర్భాలలో ఇరు దేశాలూ ఏర్పాటు చేసిన స్పష్టమైన పద్ధతిని అనుసరించి మాత్రమే ఇది ఉండాలి.

**భారతీయుడిగా ఉంటూ వ్యాపారం చేయడమే అదానీ తప్పా?**

పాశ్చాత్య దేశాలలోలా కాకుండా అదానీల వ్యాపారాలు అన్నీ కుటుంబమే చూసుకుంటుంది. అతడు కేవలం భారత్‌కే పరిమితమై తన వ్యాపారం చేసుకొని ఉంటే, వారు సహించేవారేమో కానీ అన్ని రంగాల్లో అంతర్జాతీయ ప్రభావాన్ని కలిగి ఉండాలన్న భారతీయ ఆకాంక్షలకు అతడు ప్రతినిధిగా ఉండడమే అతడి నేరంలా వారికి కనిపిస్తోంది. వివిధ ఖండాలలో కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను కలిగి ఉన్న అదానీ ఎదుగుదల పాశ్చాత్య దేశాలలో పాతుకుపోయిన అధికార వ్యవస్థలను సవాలు చేస్తోంది. ఈ పరిణామం కేవలం చైనాకే కాదు, అమెరికా మిత్రదేశాలకు కూడా అసౌకర్యాన్ని కలిగిస్తోంది.

ఈ క్రమంలో అదానీని సమర్ధించడమంటే, కేవలం ఒక వ్యక్తిని సమర్ధించడం కాదు, అది భారతీయ సార్వభౌమత్వాన్ని, దేశ ఆర్థిక భవిష్యత్తును, ప్రపంచ స్థిరత్వానికి హామీ ఇవ్వడంలో అది పోషిస్తున్న కీలక పాత్రను కాపాడుకోవడమే. ఆర్థిక యుద్ధం ద్వారా భారత వ్యూహాత్మక ఆకాంక్షలను ధ్వంసం చేసేందుకే సోరోస్ మద్దతుతో పని చేసేవారు ఈ కథనాన్ని ప్రచారం చేస్తున్నారనే విషయం దీనితో స్పష్టం కావడం లేదూ?


**– డి. అరుణ**

# దేవదేవుడే స్వయ
# మిచ్చిన భక్తుడు –

"హరి యను రెండక్షరములు
హరియించును పాతకములనంబుజ నాభా
హరి నీ నామ మహాత్మ్యము
హరి హరి పొగడంగ వశమె హరి శ్రీకృష్ణా"

– శ్రీకృష్ణ శతకము

(నాభిలో పద్మము కలిగిన ఓ విష్ణుమూర్తి! హరి అనే ఆ రెండు అక్షరాలు మా పాపాలను హరిస్తున్నాయి. నీ పేరులోని మహత్యాన్ని కీర్తించడం మా తరమా!)



**15**వ శతాబ్దంలో హరి'దాసు' ఉద్యమము మహోన్నతంగా ప్రచారంలో ఉండేది. నిజానికి నాడు భగవంతుని చేరుకోవడానికి ఎన్నో సంప్రదాయాలు ప్రాచుర్యంలో ఉండేవి. వాటిలో దాస సంప్రదాయం ఒకటి. మనసా వాచా కర్మణా హరి నామస్మరణ చేస్తూ దేవదేవుని పైన మనసు లగ్నం చేసి భగవంతునికి దాసుడుగా ఉండటమే ఈ సంప్రదాయం.

కలియుగంలో మోక్ష సాధనకు యజ్ఞాలు, యాగాలు, తపస్సు చేయనవసరం లేదు, హరి నామస్మరణ చేస్తే చాలని కొక్కె సుబ్రహ్మణ్య మఠాధిపతి శ్రీశ్రీశ్రీ విద్యా ప్రసన్న తీర్థస్వామి ఉద్ఘాటించారు. శ్రీ వేంకటేశ్వరుడు వైకుంఠం నుండి తిరుమలపై కాలు మోపి సకల జీవరాశులను రక్షిస్తున్నారని వారు అన్నారు.

హరి నామస్మరణ చేసే వారిని అనుగ్రహించడా నికి హరిదాసు రూపంలో మహావిష్ణువు వైకుంఠపురం నుండి వస్తాడన్నది ప్రజల నమ్మకం. హరిదాసు పేద ధనిక భేదం లేకుండా అందరి ఇళ్లకు వెళతాడు. నారదుడిని మొదటి హరిదాసుగా గుర్తిస్తారు. వీరిలో మూడు వర్గాల వారున్నారు. మొదటి వర్గం శ్రీహరిగాథల వ్యాప్తికి హరికథ అనే ప్రక్రియ ద్వారా ప్రదర్శనలిస్తూ ఉంటారు. రెండవ వర్గం కర్ణాటక ప్రాంతంలో హరి దీక్ష తీసుకుని భజన, గానం, నృత్యాల ద్వారా హరినామాన్ని వ్యాప్తి చేస్తారు. మూడవ వర్గం హరినామ సంకీర్తన చేస్తూ కార్తీకమాసం, సంక్రాంతి సమయాల్లో గ్రామాల్లో భిక్షాటన చేస్తూ జీవించేవారు. ఈ సంప్రదాయంలో అన్ని సామాజిక వర్గాల వారూ ఉంటారు. వీరిలో కనకదాసు చరిత్ర ప్రసిద్ధుడు. ఈ భక్తుడు కర్ణాటక రాష్ట్రంలో హరిదాసుగా మారి, సంఘ సంస్కరణోద్య మానికి కృషి చేశాడు.

కనకదాసు అసలు పేరు తిమ్మప్పనాయకుడు. చిన్నతనంలోనే శ్రీనివాసాచార్యుల వద్ద తర్క, వ్యాకరణ, మీమాంసలు నేర్చుకున్నాడు. యుద్ధవిద్యలోనూ నిష్ణాతుడయ్యాడు. కర్ణాటక లోని బంకాపురం కోట సైన్యాధ్యక్షునిగా నియమితుడయ్యాడు. ఓ యుద్ధంలో పాల్గొని బాగా గాయపడ్డాడు. చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడు తున్నాడు. ఆ పరిస్థితుల్లో కనకదాసుకు ఓ బిచ్చగాడు కనిపించాడు. పేరు అడగ్గా 'కనక' అన్నాడతడు. అతడి పరిచయం తరువాత సిపాయి తిమ్మప్ప కనకదాసు అయ్యాడు. బిచ్చగాడు నిధులు కావాలా అని అడిగాడు. కనకదాసు నిరాకరించాడు. కానీ తనకు మూడు కోరికలు న్నాయి అన్నాడు కనక. తన గాయాలు త్వరగా నయం కావాలనీ, పిలిచినప్పుడల్లా ఆ బిచ్చగాడు రావాలనీ, బిచ్చగాడు అసలు రూపంతో తనకు దర్శనమివ్వాలని కోరాడు. అలా ఆ బిచ్చగాడు తన నిజరూపాన్ని చూపాడు. అప్పుడే దాసుకు అర్థమయ్యింది. ఆ వచ్చింది సాక్షాత్తూ శ్రీహరియేనని. త్యాగరాజస్వామి తన కీర్తనలో చెప్పినట్లు నిధి ముఖ్యమా రాముని సన్నిధి ముఖ్యమా అని అడిగితే రాముని సన్నిధే ముఖ్యమన్నట్లు" కనకదాసు తన సైనిక వృత్తిని వదిలి శ్రీహరిని గురించి సంగీత రచన, సాహిత్యం, తత్వాల ద్వారా ప్రజలకు వివరించడానికి అంకితమయ్యాడు.

కనకదాసు తండ్రి బీరప్పకు సంతానం లేకపోతే కాలినడకన తిరుమలకు వెళ్లి వేంకటేశ్వరుని దర్శించుకున్నాడు. ఆ తరువాతే కనకదాసు జన్మించాడని ప్రతీతి. కర్ణాటక రాష్ట్రం హావేలి జిల్లా బాడ గ్రామంలో బీరప్ప బాచమ్మ దంపతులకు నవంబరు 18, 1509న కనకదాసు జన్మించాడు. చిన్న వయస్సులోనే నరసింహ స్తోత్రం రామధ్యాన చరిత, మోహన తరంగిణి భక్తి కావ్యాలను రచించాడు. ఆ సమయం లోనే శ్రీకృష్ణదేవరాయల గురువు వ్యాసరాయలకు కనకదాసు శిష్యుడైనాడు, వ్యాసరాయలు ఉడిపిలో ఉండేవారు కాబట్టి కనకదాసు కూడా గురువుతో పాటు ఉడిపిలోనే ఉండిపోయాడు. ఉడిపిలో శ్రీ కృష్ణుని దర్శనానికి వెళ్లగా పూజారులు కనకదాసుకు ఆలయ ప్రవేశం నిరాకరించారు. ఆ విషయంపై ఓ కథ ప్రచారంలో ఉంది.

కనకదాసు గుడి బయట పడమర వైపు కూర్చుని శ్రీకృష్ణుని కీర్తనలు కొన్ని రోజులపాటు భక్తి పారవశ్యంతో గానం చేశాడు. దానితో తూర్పున ఉన్న కృష్ణ

## ంగా దర్శన
## - శ్రీ కనకదాసు


విగ్రహం తన భక్తునికి దర్శనమివ్వాలని పడమర వైపునకు తిరగటం, ఆలయగోడ కూలి పోవడం, కనకదాసుకు కనకమహాలక్ష్మీ విభుడైన శ్రీ కృష్ణస్వామి దివ్య దర్శనం లభించడం వరసగా జరిగిపోయాయి. తప్పు గ్రహించిన పూజారులు కనకదాసుని సగౌరవంగా ఆలయ ప్రవేశం చేయించారని ప్రతీతి. అప్పటి నుండి ముఖద్వారం తూర్పుకే ఉన్నా కృష్ణ విగ్రహం పడమటి వైపే ఉంటుంది. ఇప్పుడు ఇక్కడ ఓ కిటికీ అమర్చారు. దానికే 'కనకదాసు కిటికి' అని పేరు. ఈ మహాభక్తుని కోసం ఓ మందిరం కూడా నిర్మించారు. అంతకు ముందు కాగినేలిలో కొలువైన ఆదికేశవస్వామిపై 240 కృతులు రచించి, గానం చేశాడు. "కెగినేలే ఆది కేశవ" అనే మకుటంతో ఈ కీర్తనలు ఉన్నాయి. వాటిలో కుల వ్యవస్థను వ్యతిరేకిస్తూ "కుల కుల వేందుహోదాదరి" అంటే కులం కులం అని ఎందుకు మొత్తుకుంటావు అని చీవాట్లు పెట్టాడు.

కనకదాసు "రామధ్యాన చరిత"లో రాగి ధాన్యానికీ బియ్యానికీ ఉన్న తేడాను స్పష్టంగా చెప్పాడు. రాగి పేద వాళ్ల ఆహారం. బియ్యం ధనవంతుల ఆహారం. బియ్యం గొప్పదే అయినా రాగిలో ఉండే పోషక విలువలు బియ్యంలో లేవని వివరించాడు.

కర్ణాటకలోని షిగ్గాల్ ప్రాంతంలోని "బాదా" వద్ద పురావస్తు శాఖ జరిపిన త్రవ్వకాల్లో కనకదాసు కాలం నాటి కోట, భవనాల శిథిలాలను కనుగొన్నారు.

ఓ రోజు గురువైన వ్యాసరాయలు తన శిష్యులందరిని కూర్చుండబెట్టి "మీలో మోక్షానికి ఎవరు అర్హులు" అని ప్రశ్నించగా "నేనే కాదు వీళ్లెవ్వరు అర్హులు కారని" కనకదాసు సమాధానం చెప్పాడు. గురువు వెంటనే "నేను మోక్షం పొందుతానా?" అని అడుగ్గా "మీరూ పొందలేరు" అని చెప్పాడు. చివరకు గురువు దాసుని "నీకు మోక్షం పొందాలని లేదా?" అని అడగ్గా "నేను అనేది పోతే అంతా పోతుంది. మోక్షం వస్తుంది" అని కనకదాసు చెప్పగా వ్యాసరాయలు పరమానంద భరితుడయ్యాడు. శ్రీరమణ మహర్షి కూడా "నేనెవరు అనేది తెలుసుకుంటే అంతా తెలుస్తుంది" అన్నారు.

శ్రీ భక్త కనకదాసు జీవితాన్ని ప్రతిబింబించే చక్కటి భవంతిని ఆయన జన్మస్థానం 'బాడ'లో నిర్మించారు. జీవిత చరమాంకంలో కనకదాసు ఆంధ్రదేశంలోని తిరుమల బాలాజీ సన్నిధిలో గడిపి, నిండు నూరేళ్ల జీవితాన్ని అనుభవించి 1609లో శ్రీకృష్ణ సన్నిధానం చేరుకున్నారు. అందుకే కనకదాసు జయంతిని కన్నడ రాష్ట్రంలో ప్రభుత్వ పండుగగా నిర్వహిస్తున్నారు. ఈ సారి ఆంధ్ర ప్రభుత్వం కూడా ఆయన జన్మదినాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించింది.




**కాశింశెట్టి సత్యనారాయణ**
విశ్రాంత ఆచార్యుడు



**ఆధారాలు:**

1. దుర్గా ప్రసాద్ గబ్బిట "సరస భారతి" (30.04.2018)
2. కర్ణాటక మహా సంత్ "కనకదాస బై ఎమ్.బసవరాజు
3. అయ్య చూసిన (పి) హంఫి బై పులపర్తి నాగపద్మిని.


# లెంపలేసుకున్న నొమానీ

ఇటీవలే మహారాష్ట్రలో 'ఓట్ జిహాద్' పిలుపు ఇచ్చి సంచలనం సృష్టించిన మౌలానా సజ్జాద్ నొమానీకి బుద్ధి వచ్చినట్టుంది. హిందువులు ఓట్ జిహాద్ అవసరం లేకుండానే బీజేపీ నేతృత్వంలోని మహాయుతిని గెలిపించడంతో, పొరపాటు జరిగింది క్షమించమంటున్నాడు తాలిబన్ ఆరాధకుడు నొమానీ. ముస్లింలంతా ఓట్ జిహాద్ చేసి మహావికాస్ అఘాఢీని గెలిపించాలని ఎన్నికలకు ముందు కోరిన అతడు, కేవలం వారి ఓట్లతో అధికారం చేజిక్కదని అర్థం చేసుకున్న విజ్ఞతతో సులువుగా క్షమాపణ పత్రాన్ని విడుదల చేసేశాడు. ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు అధికార ప్రతినిధి నొమానీ ముస్లింలు ఎవరైనా తన మాట కాదని కాషాయపార్టీకి వోటు వేస్తే వారిని బాయ్‌కాట్ చేస్తానని కూడా బెదిరించాడు. అంతేకాదు, మహారాష్ట్రలో బీజేపీ ఓడితే, అది కేంద్ర ప్రభుత్వాన్ని అస్థిరం చేస్తుందన్నాడు. పైగా, బీజేపీని సమర్ధించే ముస్లింలు తమ పేరు ఘన్‌శ్యామ్ అని మార్చుకోవాలని సలహా కూడా పడేశాడు.

మహాయుతి గెలిచిన తీరు, తన మాటలకున్న విలువ అర్థం కావడంతో, ఆత్మ రక్షణ కోసమూ, ఎన్నికల సమయంలో మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొట్టినందుకు క్షమించండంటూ అధికారికంగా క్షమాపణ పత్రాన్ని విడుదల చేశాడు. బీజేపీకి ఓటువేసిన ముస్లింలను బాయ్‌కాట్ చేస్తామన్న నా మాటలు ఒక నిర్దిష్ట సందర్భంలో అన్నవి. లోక్‌సభ ఎన్నికలలో వీరిని ఓటు వేయనివ్వలేదు. సాధారణ పౌరుడు తన హక్కుని వినియోగించుకొని ఓటు





వేయకుండా నివారిస్తున్న వారిని ఉద్దేశించి అన్న మాటలు. కనుక, నా మాటలను సందర్భోచితంగా తీసుకోవాలే తప్ప మరోలా కాదు అని భాష్యం చెప్పాడు.

అలాగే, నా పై ప్రకటన మహారాష్ట్ర ఎన్నికలకు ముందుగా ఇచ్చింది. అది ఏ మతపరమైన సమాజాన్ని ఉద్దేశించి అన్నది కాదు, నా ఉద్దేశమూ అది కాదు. అదేమీ ఫత్వా కూడా కాదు. అయితే, నా ప్రకటన ఎవరినైనా బాధపెట్టి ఉంటే నేను చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకొని, షరతులు లేకుండా క్షమాపణలు చెప్తాను. వారు ముస్లింలు అయినా కాకున్నా, నేను ఎప్పుడూ అన్యాయం జరిగిన సామాన్య ప్రజల పక్షాన నిలబడి వారికి న్యాయం కోసం పోరాడాను అంటూ చెప్పుకొచ్చాడు.

ఇక, పూర్తిగా ముస్లిం వస్త్రధారణతో తలపై ముసుగు వేసుకొని గొప్ప ఫెమినిస్టు స్వరాభాస్కర్, ఆమె భర్త ఫహాద్ అహ్మద్ మద్దతు, ఆశీర్వచనం కోసం ఆయనను కలుసుకున్న విషయం తెలిసిందే. ఎన్సీపీ టిక్కెటుపై అణుశక్తి నగర్ నుంచి పోటీ చేసిన ఫహాద్, మహాయుతికి చెందిన సనా మాలిక్ చేతిలో ఓటమి పాలయ్యాడు. కాగా, సనా మాలిక్ కూడా నొమానీని కలుసుకోవడంతో, ఆమె ద్వంద్వ వైఖరిని నెటిజెన్లు దుయ్యబట్టారు. అయితే, తాను ఓటింగ్ పూర్తి అయిన తర్వాతే ఆయన్ని కలుసుకున్నానంటూ సనా నిస్సిగ్గుగా తనను తాను సమర్థించుకోవడం వేరే విషయం. ★

**శ్రీమద్భగవద్గీత సాక్షాత్తూ భగవంతుని దివ్యవాణి. సకల వేదసారం. సార్వకాలిక, సార్వజనీన విశిష్ట గ్రంథం. వ్యక్తిత్వ వికాసానికి నిలువెత్తు నిదర్శనం. ధృతరాష్ట్రుడు, సంజయుడు, అర్జునుడిని పాత్రలుగా చేసుకొని పరమాత్మ ప్రవచించిన వేదాంతసార విజ్ఞాన భాండాగారం. నారాయణుడి అంశ వేదవ్యాసుడు అందించిన ఇది నిత్య పారాయణ గ్రంథం. జ్ఞానం, విజ్ఞానం, ఆధ్యాత్మికత, ధర్మబద్ధమైన జీవన విధానం, రాజకీయ పరిజ్ఞానం, పరిపాలన దక్షత, సాహసోపేత నిర్ణయాలు, మానవ కల్యాణానికి, సమాజ వికాసానికి తగిన అనేక సద్గుణాలను వివరించే వ్యక్తిత్వ వికాస దర్శిని. ఒక గ్రంథం జయంత్యుత్సవం జరుపుకోవడం 'గీత'కే సొంతం. 'మాసానాం మార్గశీర్షోహం' అని భగవానుడు ఇందులోనే చెప్పినట్లు అదే మాసం శుద్ధ ఏకాదశి నాడే గీతాజయంతి కూడా. ప్రపంచ భాషలన్నిటిలోకి అనువదితమైన భగవద్గీతపై ఎన్నో భాష్యాలు వచ్చాయి. మనిషి మనీషిగా మారే వైనం చెప్పే 'జ్ఞాన' గీతను అంతిమయాత్ర/సంస్కార సందర్భంలో వినిపించేదిగా మారడం శోచనీయం. ఇది 'శోభ' గీతే కాని 'శోక' గీత కాదు, కారాదు.. అని నిరూపించేందుకు కంకణబద్ధులు కావడమే 'గీతా జయంతి'కి ఇచ్చే నిజమైన గౌరవం.**

# విశిష్ట వ్యక్తిత్వ వికాసానికి గీతాధ్యయనం



భగవద్గీత సాక్షాత్తు భగవద్వాణి. గీతోపదేశానికి భారతయుద్ధం, అర్జునాది పాత్రలు నిమిత్త కారణాలు. మానవాళి అభ్యుదయాన్ని కాంక్షించిన శ్రీకృష్ణ భగవానుడు వారిని ఆలంబనగా చేసుకొని సర్వ శాస్త్రసారంగా 'గీతా'మృతాన్ని పంచి, జ్ఞానసిరులను అనుగ్రహించాడు. నరనారాయణుల మధ్య సంవాద రూపంలో అనేక విషయాలను ప్రబోధించిన ఈ అష్టాదశాధ్యాయనిలోని ప్రతి అంశం మానవ జీవనానికి ఉపకరించేదే. మొత్తం 701 శ్లోకాలతో మానవ కల్యాణానికి మార్గదర్శక గ్రంథంగా ఉన్న 'గీత'లో భగవానుడు 574 శ్లోకాలు, అర్జునుడు 85, సంజయుడు 41 ధృతరాష్ట్రుడు ఒక శ్లోకం ద్వారా తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు.

'భగవద్గీతలోని ఒక్కొక్క శ్లోకభావాన్ని అర్థం చేసుకొంటూ ఆచరణలో పెట్టేవారు జన్మరాహిత్యం పొందుతారు. ఒక్క శ్లోకాన్నైనా గురుముఖతః అధ్యయనం చేసినవారు ధన్యులు' అని తొలుతగా గీతా భాష్యం రాసిన శంకర భగవత్పాదులు ప్రవచించారు. 'భగవద్గీతా కించిదధీతా గంగాజలల కణికా పీతా' (గీతా శ్లోకం ఒక్కటి పారాయణం చేసినా గంగ జలం తాగినంత పుణ్యం వస్తుంది)అనీ చెప్పారు.

నిరాశా నిస్పృహలు, నిస్తేజం,నిస్సత్తువ లాంటివి ఆవరించినప్పుడు గీతా సందేశం మార్గదర్శిగా నిలుస్తుందని వివేకానంద, మహాత్మా గాంధీ లాంటి ఎందరో మహనీయులు పేర్కొన్నారు. ఉత్తమ లక్ష్యాన్ని తీర్చేదిద్దే 'ధర్మసింధు' గీత అని స్వామి వివేకానంద,'కర్తవ్య బోధ చేసే గ్రంథం'గా బంకిం చంద్ర చటర్జీ అభివర్ణించారు. పంజాబ్ కేసరి లాలా లజపతిరాయ్ మాండలే జైలు జీవితంలో దీనిని లోతుగా అధ్యయం చేసి 'గీతా సందేశం'అనే పుస్తకాన్ని రాశారు. 'గీత'లోని కర్మయోగం అధ్యాయనంతో ప్రభావితులైన బాలగంగాధర తిలక్ 'గీతా రహస్యం' అనే గ్రంథం రాశారు. భగవద్గీత లేకపోతే ప్రపంచ వాఙ్మయం పరిపూర్ణమైనట్టు కాదని ఇంగ్లండ్ కవి ఎడ్విన్ ఆర్నాల్డ్ అన్నారు.

లక్ష శ్లోకాల మహాభారత గ్రంథంలో భీష్మ పర్వంలో 24 నుంచి 41 వరకు పద్దెనిమిది అధ్యాయాలుగా ఉన్న భాగం భగవద్గీత. ఈ అష్టాదశాధ్యాయినికి గీత, గంగ, గాయత్రి, సీత, సత్య, వేదత్రయి, పర, అనంత, త్రిసంధ్య, సరస్వతి, బ్రహ్మవిద్య, బ్రహ్మవల్లి, ముక్తిగేహిని, అర్ధమాత్ర, చిదానంద, భవఘ్ను, భయనాశిని, తత్త్వార్థ జ్ఞానమంజరి అని పద్దెనిమిది పేర్లున్నాయి. భగవానుడు శ్రీకృష్ణుడు ఉపదేశించాడు కనుక 'భగవద్గీత', పరబ్రహ్మను తెలిపే విద్య కనుక 'బ్రహ్మవిద్య'ని, వేదాంతాలను సంగ్రహించి చెప్పినందున 'ఉపనిషత్సారం' అంటారు.

భగవద్గీత, బ్రహ్మసూత్రాలు, ఉపనిషత్తులను పూర్వీకులు ప్రస్థానత్రయంగా చెప్పారు. గమ్యంవైపు నిరంతరం సాగడమే ప్రస్థానం. అదే శ్రేష్ఠమైన ప్రయాణం. ఆ గమ్యమే భగవత్ సన్నిధి. ఆయనను చేరుకునే ప్రయత్నమే ప్రస్థానం. వృత్తిని లేదా లక్ష్యాన్ని భగవత్ స్వరూపంగా భావిస్తే... దానిని సాధించేందుకు సాగించే యత్నమే ప్రస్థానం. ఆ గమ్యం 'అగమ్యం' కాకుండా ఉండేందుకు వ్యక్తిత్వ వికాస నిపుణులు 'గీత'ను ఒక సాధనంగా పరిగణిస్తున్నారు.

భగవద్గీత కేవలం ఒక మతపరమైనదో, సన్యాసులకో, యోగులకో, వృద్ధులకో పరిమితమైనది కాదు. కురుక్షేత్రంలో అర్జునుడి మోహాంధకారాన్ని నశింప చేసిన ఈ గ్రంథం, భారత స్వరాజ్య సమరంలో ఎందరికో స్ఫూర్తిని ఇచ్చింది.

**'న కాంక్షే విజయం కృష్ణ**
**న చ రాజ్యం సుఖాని చ**
**కిం నో రాజ్యేన గోవింద**
**కిం భోగై ర్జీవితేన వా'...**

'విజయం వద్దు.. రాజ్యసుఖమూ వద్దు' అని అర్జునుడు అస్త్ర సన్యాసానికి సిద్ధపడినప్పుడు భగవానుడు కర్తవ్యబోధ చేశాడు. అర్జునుడు ప్రబుద్ధుడై 'విజయుడు' అయ్యాడు. భగవద్గీతను శ్రద్ధగా విని ఆచరిస్తే మోహాంధకారాన్ని (మోహం అంటే చేయవలసిన పనిని మరచి ఇతర ఆలోచనలో పడడం) వీడి

నిశ్చయంగా సత్ఫలితాలు సాధిస్తారని భావం

✼ పిరికితనాన్ని వదలి లక్ష్య దిశగా ధైర్యంతో అడుగువెయ్యి. గతాన్ని తలచి వగచడం కాదు. భవిష్యత్‌లో సాధించాలనుకునే విజయాల కోసం ప్రణాళికబద్ధంగా సాగు.

✼ విజయాలకు మనసే మూలం. అధైర్యంతో నిండి ఉండే మనసు ఏమీ చేయలేదు. అన్యాయాలను ఎదుర్కోవడం లాంటివి చేయలేదు. అందుకే మనో దౌర్బల్యాన్ని విడనాడి సాహసాన్ని శ్వాసగా చేసుకోవాలి.

✼ ఎలాంటి పరిస్థితుల్లోనైనా స్థితప్రజ్ఞుడుగా ఉండడం. అంటే కష్టంలో కుంగకపోవడం, సుఖంలో



పొంగక పోవడం.

✼ నీకు అప్పగించిన విధిని సక్రమంగా నిర్వర్తించు. నువ్వు చేసే మంచి పనులే నిన్ను రక్షిస్తాయి.

✼ సర్వ ప్రాణుల పట్ల సమదృష్టి కలవారే పండితులు. సమాజం నుంచి ఏదో కోరుకుంటు న్నప్పుడు తాను కూడా సమాజానికి తిరిగి ఇవ్వాలి.

✼ విషయాలపై అనురక్తి కలవాడు శాంతిని పొందలేడు. అథం పాతాళానికి దారితీసే స్వార్థపరమైన కోరిక విషవలయంలో చిక్కుకోవద్దు.

✼ అభ్యాసం, వైరాగ్యాలతో మనసు నిగ్రహించుకో వచ్చు. ఆహార నియమాలు పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి.

✼ ఉత్తమ జీవితం సాగించాలంటే ఇంద్రియాల అదుపు అవసరం. కోరికలు దుఃఖానికి హేతువులు. కోరికలే లేకపోతే దుఃఖానికి తావేలేదు

✼ భగవంతుడిని ఏ దృష్టితో సేవిస్తే అలానే అనుగ్రహిస్తాడు. పరమాత్మే సర్వమని అని నమ్మిన వారికి మోక్షం తప్పక సిద్ధిస్తుంది..

✼ అనవసరమైన ఆలోచనాలకు తావీయవద్దు. అవి బుద్ధి వేగాన్ని మందగింప చేస్తాయి. ఏ విషయాన్ని అయినా బాగా ఆలోచించి స్థిరమైన నిర్ణయానికి రావాలి. ఏకాగ్రతతో పని చేయాలి.

✼ నిస్వార్థ బుద్ధితో చేసే పనిలో పాపపుణ్యాల ప్రసక్తి ఉండదు.... ఇలా మానవజీవితానికి చుక్కాని. కనుకనే.....

*'ఏకం శాస్త్రం దేవకీ పుత్రగీతమ్*
*ఏకోదేవో దేవకీ పుత్ర ఏవ*
*ఏకో మంత్రస్య నామానియాని*
*కర్మాప్యేకం తస్య దేవస్య సేవా'* (గీతాశాస్త్రమే ఏకైక శాస్త్రం, దేవకీనందనుడు శ్రీకృష్ణుడే ఏకైక దైవం, ఆయన నామాలు దివ్యమంత్రాలు, ఆయన సేవే సత్కర్మయుక్తం) అని ఆర్యోక్తి.

'జీవితమంటేనే నిరంతర సమరం. సంసారంలో కాని, సమరంలో కానీ పురోగమనమే తప్ప పలాయనం చిత్తగించడం, అర్థాంతరంగా నిష్క్రమించడం, అచేతనులుగా వ్యవహరించడం ధీరుల లక్షణం కాదు. ప్రతి వ్యక్తిలోనూ కొన్ని ప్రత్యేకతలు, శక్తియుక్తులు ఉంటాయి. వాటిని గుర్తించి సద్వినియోగం చేసుకోవడం ద్వారా మనసులోని అల్లకల్లోలాలను నివారించి, కర్తవ్య పరాయణులు కావాలి' అన్నది గీతాచార్యుని మహోపదేశం. 'ఒక పనిని చేయబూనడం కానీ, నిరాకరించడం కానీ విధి లేదా ప్రకృతికి లోబడి ఉంటుంది తప్ప మనిషి చేతిలో లేదని భగవద్గీత చెబుతోంది. 'అర్జునా! నీవు చేయబోతున్న యుద్ధంలో నీవు చంపుతున్నావని, వైరి పక్షంలోని వారు చావబోతున్నారని అనుకోవడం భ్రమ. నీవు నిమిత్తమాత్రుడివి. యుద్ధం చేయడమే నీ ధర్మం. అలా చేయకున్నా వారిలో బతికేవారు ఎవరూ లేరు. ఈ విషయంలో బాధపడి ప్రయోజనం లేదు' అన్న భగవానుడి మాటలు వేదాంతంలా అనిపించవచ్చు. శ్రద్ధగా పరిశీలిస్తే.. ఎవరి కర్తవ్యాన్ని వారు నిర్వహిస్తూ పోవాలని, జనన మరణాలు, జయాపజయాలు సహజ పరిణామాలని బోధపడి, చింత, శోకం లాంటి భావోద్వేగాలు దూరమై ప్రశాంత జీవనానికి ఆస్కారం కలుగుతుందని ఆధ్యాత్మికవేత్తలు, వ్యక్తిత్వ వికాసనిపుణులు అంటారు.

**వ్యక్తిత్వ వికాస 'గీత'**

'ధర్మవిహితమైన కర్తవ్య పాలనలో ఊగిసలాట పనికిరాదు. కర్తవ్యాన్ని నిర్వహించాల్సిందే. నిష్కామ కర్మకు అంతిమ విజయం తథ్యం. ధర్మబద్ధంగా, భగవదర్పితంగా నిర్వహిస్తే సత్ఫలితాలు సిద్ధిస్తాయి' అన్నది గీత దివ్యోపదేశం. 'ధర్మంగా కర్తవ్యాన్ని నిర్వర్తించు' అన్న భగవానుడిసందేశం పార్థుడికే కాదు... సర్వమానవాళికి వర్తిస్తుంది. ఆ స్ఫూర్తితోనే విద్యార్థులకు సులువుగా బోధించేందుకు, ఉద్యోగులను చైతన్య పరిచేందుకు విద్యాసంస్థలు, బహుళ జాతి సంస్థలు 'గీత'ను సరికొత్త కోణంలో అధ్యయనం చేస్తున్నాయి. అందులో అంతర్లీనంగా ఉండే అంశాలను ఉద్దీపనగా చేసుకుంటే సంస్థల మనుగడను తీర్చిదిద్దవచ్చని భావిస్తూ, ఆచరిస్తున్నారు కూడా. కార్యాలయాలలో పని వాతావరణం మెరుగు పడేందుకు, సిబ్బందిలో ఒత్తిడిని తగ్గించేందుకు, వృత్తిపరమైన కారణాల వల్ల ఉత్పన్నమయ్యే మానసిక సమస్యలను దూరం చేసేందుకు 'గీత' లోని కర్మయోగమే మార్గమని కోజికోడ్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ రూపొందించిన అధ్యయన నివేదిక చెబుతోంది. మనిషిని సన్మార్గంలో నడిపే వాడు గురువైతే, అంతకు మించి లక్షణాలు గల భగవద్గీతను 'గురు' గ్రంథంగా అభివర్ణిస్తారు పెద్దలు.



**డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి**
**సీనియర్ జర్నలిస్ట్**



# పారిస్ వేదికపై నారీ

తిరుమతి రుక్మిణీ లక్ష్మీపతి. భారత స్వాతంత్ర్య సమర యోధురాలు. సత్యాగ్రహ ఉద్యమ రంగాన ముందు నిలచి, నారీ భేరి మోగించిన ధీరురాలు. చెరసాల పాలైనా ఎటువంటి అదురూ బెదురూ లేకుండా 'జయజయహో భారత్' అని నినదించిన సాహసికురాలు.సామాజిక సేవ అంటే ఏమిటో, ఎలా ఉండాలో, అది ఎలా సార్థకమవుతుందో నిరూపించారామె.అన్నింటినీ మించి, 'భారత స్త్రీ మహామండల్' అధినేత్రి! వనితల అభ్యున్నతికి ఆమె సాగించిన సేవకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక తపాలా బిళ్లను విడుదల చేసింది. తమిళనాట చెన్నైలోని ఒక వీధికి రుక్మిణి పేరు పెట్టింది. ఆ దీక్షాదక్షురాలి జీవిత విశేషాలు పాఠ్యాంశంగా రావాలని నాటి ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అభిలషించారు.ఇండియన్ విమెన్ అసోసియేషన్‌కు వ్యక్తి / శక్తి రూపం ఆమె. డిసెంబర్ 6న జయంతిని పురస్కరించుకొని కేంద్రం వారం రోజుల పాటు వేడుకలు నిర్వహిస్తోంది.

*'పాత క్రొత్తల భావ సంపదలు గలిపి*
*ఒక ప్రశాంత మహా విప్లవోజ్వలమగు*
*వీరభారతజాతి నావిష్కరించి*
*దేశ సౌభాగ్యములు తీర్చిదిద్దవమ్మ!...*

పద్యమే రుక్మిణీ లక్ష్మీపతి నేపథ్యం. ఇంతటి అభిభాషణా ఆమె జీవన మూర్తిమత్వానికి సర్వవిధాలా సరిపోతుంది.ప్రాచీన, అర్వాచీన సంప్రదాయ విధానాలు ఆమెవి. ఎంత ప్రాచీనతో అంతకు సమానమైన అత్యాధునికత. మార్పును కోరుకునే తత్వచింతనురాలు.

మదురై ప్రాంతంలో జన్మించిన ఆమె మద్రాసు కళాశాల నుంచి పట్టభద్రురాలు. జాతీయోద్యమంలోకి ప్రవేశించి పలుమార్లు కారాగారాల పాలయ్యారు. అంతర్జాతీయ స్థాయిన పారిస్ వేదికగా మహిళాసభకు భారత ప్రతినిధి ఆమె. అప్పటికి ఆమెకు 35 ఏళ్లు.

'ప్రగతి, పదతి సమానార్థకాలు. అవినాభావ సంబంధం అది. అందరికీ తెలుసు ఇదంతా. తెలిసినా తెలియనట్లు నటించడమే కొందరి అలవాటు. మా దేశంలో మేం కోరుతోంది స్త్రీ స్వాతంత్ర్యాన్నే! ఈ స్వతంత్రత ఎందుకంటే– గళం విప్పి మాట్లాడటానికి, కలం తెరిచి రాయడానికి. ఇవిగో ఈ రెండే కుదరదంటోంది ఇప్పటి పాలనాధికారం. నోరు తెరవకుండా ఎన్నాళ్లు ఆపుతారు? నిజాలు బయటికి రాకుండా ఇంకెంతకాలం దాస్తారు? ఉన్నది చెప్పడానికే అక్కడి నుంచి ఇక్కడికి వచ్చాను. మహిళలకే కాదు, అందరికీ కావాలి స్వతంత్రం. లభించే దాకా ఊరుకోం. ఆశయం నెరవేరే వరకూ విశ్రమించం.'అని ఆ సదస్సులో నినదించారు. పారిస్ సదస్సు కలిగించిన ఉత్తేజం రుక్మిణమ్మలో చాలాకాలం కొనసాగింది. కటకటాలను లెక్కచేయలేదు. బెదిరింపులకు ఎంత మాత్రమూ తలొగ్గలేదు. పైగా కొండంత ఆత్మవిశ్వాసాన్ని సొంతం చేసుకున్నారు.

1930 ప్రాంతంలో దండియాత్ర. కవి స్వరం పలికినట్లు–గుప్పెడు ఉప్పును పోగేసి, నిప్పుల ఉప్పెనగా చేసి దండియాత్రనే దండయాత్ర చేసిన సందర్భం. కోట్లమందిని కదిలించిన తరుణం. కోట్లమందిని కదిలించిన తరుణం. తమిళనాట వేదారణ్యం ప్రాంతమంతటా భారీగా జనవాహిని, ఉద్యమ సమ్మేళనం. ఆ సత్యాగ్రహంలో ముందు వరసన నిలిచారు రుక్మిణి. నిరంకుశ పాలకులు ఎన్నిసార్లు నిర్బంధించినా, చెక్కు చెదరలేదు. తన భావనలను డైరీలో రాసుకున్నారు.(అవి తదుపరి కాలక్రమంలో వెలుగు చూశాయి).

*'భారత వనితను నేను*
*సమరసతనే కోరుకుంటాను*
*ఆలోచన నాకూ ఉంది, ఆచరించగల సత్తువుంది*
*పరిస్థితి ఎదురు తిరిగితే నిలువరించే నేర్పుఉండదా?*
*మాకూ ఆశలున్నాయి, అవకాశాలూ ముందే ఉన్నాయి.*
*వాటికి ఎందుకు అడ్డొస్తారు? వచ్చి ఏం సాధిస్తారు?*
*స్వేచ్ఛనివ్వండి మాకు. మా మాటలకీ విలువుందని తెలుసుకోండి.*
*ఇప్పుడు కాకుంటే ఎప్పటికీ తెలియదు మీకు*
*విమోచన పిపాస దివ్వెను ఆర్పడం మీ తరం కాదు*
*స్త్రీ గొంతు పెగిలే వరకే ఎవరి*
*అధికార దర్పమైనా!*
*నారీలోకాన్ని ఆపలేరు ఇప్పుడైనా,*
*ఎప్పుడైనా!'*

మరి కొన్నాళ్లకు జపాన్ సందర్శన. అక్కడి మహిళామణుల స్థితి గతులను ప్రత్యక్షంగా పరిశీలించారు. నానారకాల సమస్యల తీవ్రతను అధ్యయనం చేశారు. బాధితులతో సవివరంగా మాట్లాడారు. సమస్తాన్నీ అవగతం చేసుకున్నవేళ, రచన



**జంధ్యాల శరత్‌బాబు**
సీనియర్ జర్నలిస్ట్

రూపంలో అన్నారిలా...

*'పదవి అంటే ఏం తెలుసు పాలకులకు?*
*బాధ్యతల అర్థం తెలుసా అధికారులకు?*
*ఒక దారి మూస్తే పది దారులు తెరుచుకుంటాయి*
*ఒక నోరును నొక్కాలని చూస్తే వంద గొంతులు విక్రమిస్తాయి*
*బాధలు, వ్యథలు, పీడలు, దాడులు, దురాగతాలు*
*ఎన్నెన్ని చుట్టుముట్టినా ముదితల ముందడుగును ఆపలేవు.*
*ఏమనుకుంటున్నారో భారత వనిత గురించి?*
*ఏం చేయాలనుకుంటున్నారో ఉద్యమానికి సంబంధించి?*
*నా దేశమైనా, ఏ దేశంలో అయినా*
*ఖండ ఖండాంతర ప్రాంతాల్లో ఎక్కడైనా*
*నిలిచేదీ గెలిచేదీ జనోద్యమమే!*
*నారీ జన ఉద్యమ నాదమే ఊరూవాడా మారుమోగుతుంది*
*స్వతంత్రతను కబళించే శక్తుల అంతు తేలుస్తుంది*
*ఫ్రాన్స్, జపాన్, ఇండియా*
*ఎక్కడైనా, ఎప్పుడైనా, ఏ దశలోనైనా, స్థితులు ఎన్నెన్ని మారినా*
*ఆడదారి మాటలూ చేతలకు అర్థం ఒక్కటే*
*స్వతంత్రతా గీతికకు ముగింపు ఉండదని మాత్రమే!'*

అదే కాలంలో భారత్‌లో వ్యక్తిగత సత్యాగ్రహమూ దశలవారీగా విస్తరించింది.

# నగారా రుక్మిణమ్మ

> వ్యక్తులు శక్తులవాలి. స్త్రీ ఐక్యతను రుజువుపరచాలి. మనలో ఎన్నెన్నో కుటుంబ నేపథ్యలుంటాయి. ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక ప్రభావాలు సైతం ఉంటుంటాయి. వీటన్నింటిలో అంతర్లీనంగా ఉండాల్సింది ఏకీకృత భావనా బలం. ఇదంటూ ఉంటే, మనల్ని ఎవరూ బాధించలేరు, వేధించలేరు, భయపెట్టలేరు, నిర్బంధించనూ లేరు. చుట్టూ ఉన్న సంఘాన్ని మనమంతా చదువుకుంటే భవిష్యత్తు ఉంటుందని క్రియాశీలంగా తెలుసుకుంటే... మనకు, దేశానికి స్వతంత్రం వచ్చేసినట్లే!

**ఒకటి:** సత్యాగ్రహుల్లో ఒకరు ముందుకు రావడం.
**రెండు:** ఆ ఊళ్లోని ఒక కూడలి స్థలంలో నిలబడటం.
**మూడు:** దుష్టపాలనను ఖండిస్తూ చదవడం లేదా ఎలుగెత్తి అనడం.

ఇందుకోసం మద్రాసులో కొద్దిమంది సంసిద్ధులయ్యారు. వారిలో ప్రథమురాలు రుక్మిణమ్మ. ప్రథమంగా అరెస్టు అయిందీ ఆ నాయకురాలే!

ఇంతటి ధీరత్వానికి జాతీయ స్థాయిలో పేరున్న తొలి వనితా సంస్థ 'స్త్రీ మహామండల్' అని సహచరులప్రశ్నలకు బదులిచ్చేవారు.

ఆ సంస్థకి దశాబ్దాల చరిత్ర. వ్యవస్థాపక కీలక బాధ్యురాలు సరళాదేవి.




కాలక్రమంలో బాధ్యతలన్నీ రుక్మిణమ్మవే అయ్యాయి. సరళాదేవి విద్య, విజ్ఞాన, వికాస, పాలనారంగాల్లో నిపుణురాలు. మండల్ శాఖలను పలు ప్రధాన నగరాల్లో నెలకొల్పారు. విద్యలో, వృత్తి శిక్షణలో మహిళలకు ఎంతో ప్రోత్సాహమిచ్చారు. ఎటువంటి నిబంధనలు, అంతరాలు లేకుండా వనితలందరినీ బోధనలు సాగించారు. ఆ స్ఫూర్తితోనే రుక్మిణమ్మ దేశంలోని విభిన్న ప్రదేశాల్లో నారీమణులను సంఘటిత పరచి శక్తిని చాటారు.

మద్రాసులోనే యువజన విభాగాన్ని బలోపేతం చేశారు. జన్మస్థలం మదురైలోనే విస్తృతరీతిన సదస్సు నిర్వహణ చేపట్టారు. ఆ సమావేశంలో ఆమె ప్రసంగ సారాంశం:

వ్యక్తులు శక్తులవాలి. స్త్రీ ఐక్యతను రుజువుపరచాలి. మనలో ఎన్నెన్నో కుటుంబ నేపథ్యలుంటాయి. ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక ప్రభావాలు సైతం ఉంటుంటాయి. వీటన్నింటిలో అంతర్లీనంగా ఉండాల్సింది ఏకీకృత భావనా బలం. ఇదంటూ ఉంటే, మనల్ని ఎవరూ బాధించలేరు, వేధించలేరు, భయపెట్టలేరు, నిర్బంధించనూ లేరు. చుట్టూ ఉన్న సంఘాన్ని మనమంతా చదువుకుంటే భవిష్యత్తు ఉంటుందని క్రియాశీలంగా తెలుసుకుంటే... మనకు, దేశానికి స్వతంత్రం వచ్చేసినట్లే!

స్వాతంత్ర్య సాధన దరిమిలా, ఎన్నెన్నో పదవులను స్వీకరించి ఆశయాల ఫలప్రదంలో తనవంతు తోడ్పాటు అందించారు. ఎప్పుడూ ప్రజల భాగస్వామ్యం, సుపరిపాలన గురించే మాట్లాడేవారు. ప్రధానంగా ఉచిత విద్య, సత్వర వైద్యం, స్త్రీల శక్తి సంపన్నతను పెంపొందించే విధానాలు, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు అవకాశం అనే నాలుగు అంశాల మీద దృష్టి సారిస్తుండేవారు. అప్పుడే కాదు, ఈనాటి పాలకులకైనా ఇవే శిరోధార్యాలు. ఆ నాలుగు లక్షణాలు గల సమాజంలో ఇక లోటు అంటూ ఏముంటుంది?

చదువుకు సంబంధించి ఇదీ ఆమె అభిప్రాయ సారం:

అమ్మాయి చదువు ఆ ఇంటికి, ఊరికి, మొత్తం సమాజానికే వెలుగు. ఆడపిల్ల చదువు అంటే ఆత్మవిశ్వాసానికి నెలవు. పుట్టింట, మెట్టినింట సైతం విద్యాధిక సృజన వెల్లివిరిసినపుడు వర్తమానం, భవిష్యత్తు కూడా బంగారమే అవుతుంది. అలా అని మొత్తమంతా పుస్తకాల చదువే ఉండాలని కాదు. సమాజాన్ని చదవగలిగిన స్థితిలో అతివ ఉంటేనే, ఆ అవకాశాన్ని కుటుంబికులు కలిగిస్తేనే భవ్య భారతం ఆవిష్కృతమవుతుంది.

తల్లీ బిడ్డలకు వైద్య పరికల్పన ప్రభుత్వాల మొదటి విధి. ఈ బాధ్యతను విస్మరిస్తే, అంతకుమించిన దోషం, నేరం, పాపం మరోటి ఉండదంతే. తన ఆదర్శాలను ఆచరణకు తేగలిగిన సావకాశాన్ని ఆసాంతం వినియోగించుకున్న వనితారత్నంగా చరిత్రలో నిలిచి ఉంటారామె..

*తరుణ భారత భావచైతన్యశక్తి*
*భరతనారీ ప్రభావ వైభవబలమ్ము*
*తీర్చిదిద్దిన రూపమ్ము రుక్మిణమ్మ*
*కార్యశీల లలనా! మీకు సుమనస్సులమ్మ!*

★


# మూడో ప్రపంచ యుద్ధం కోసం డీప్‌స్టేట్ తహతహ

**డీప్‌స్టేట్ కనుసన్నల్లో పనిచేసే జో బైడెన్ చేసిన పనికి ఇప్పుడు దేశాలన్నీ ప్రపంచయుద్ధం అంచున నిలిచాయి. దీర్ఘశ్రేణి క్షిపణులను రష్యాపై ప్రయోగించడానికి అనుమతించే ఫైలుపై జో బైడెన్ సంతకం చేయడంతో ఒక్కసారిగా రష్యా-ఉక్రెయిన్ యుద్ధం రూపు పూర్తిగా మారిపోయింది. తన పదవీకాలం 62 రోజులు మాత్రమే ఉండగా పుతిన్ గీసిన 'లక్ష్మణ రేఖను' జో బైడెన్ ఎందుకు దాటినట్టు? ఇది కేవలం అమెరికాను యుద్ధరంగంలోకి లాగడం తప్ప మరోటి కాదని యు.ఎస్.లోని కొందరి అభిప్రాయం. జో బైడెన్ పదవి నుంచి దిగిపోతూ విపరీత గందరగోళ పరిస్థితులు సృష్టించినట్లయితే, వాటిని పరిష్కరించడానికే ట్రంప్‌కు తన పదవీకాలం నాలుగేళ్లు సరిపోతుందనేది డీప్‌స్టేట్ అంచనా. అనుమతి లభించడమే ఆలస్యం, నవంబర్ 19న ఉక్రెయిన్ తనకు యుఎస్ సరఫరా చేసిన ఆరు టాక్టికల్ మిస్సైల్స్‌ను సరిహద్దులోని రష్యా భూభాగమైన బ్రయాన్స్క్‌పై ప్రయోగించింది. దీంతో ఇప్పటివరకు 'సైనిక చర్యగా' పరిగణిస్తూ, సంప్రదాయ పోరు స్థాయిని దాటకూడదని పుతిన్ విధించిన లక్ష్మణ రేఖను జెలన్‌స్కీ అతిక్రమించినట్లయింది.**



జెలన్‌స్కీ

ఈ క్షిపణుల్లో ఐదింటిని మార్గమధ్యంలోనే విజయవంతంగా అడ్డుకున్నామని, ఆరవది మాత్రం ధ్వంసం కావడంతో దాని శిథిలాలు సైనిక స్థావరంపై పడినట్టు రష్యా ధ్రువీకరించి ఆస్తి, ప్రాణనష్టం జరగలేదని స్పష్టం చేసింది. ఈ దాడి ఇప్పటివరకు రెండు దేశాల మధ్య జరుగుతున్న సంప్రదాయ యుద్ధంలో కీలకమార్పునకు దోహదం చేయడంతో పుతిన్ ఆగ్రహానికి అడ్డుకట్ట వేయడం ఎవరివల్లా కాని పరిస్థితి నెలకొంది. జో బైడెన్ చేసిన పనికి ప్రతిగా రష్యా అధ్యక్షులు పుతిన్, అణ్వస్త్ర వినియోగానికి సంబంధించిన నిబంధనలను మరింత సరళతరం చేసే ఫైల్‌పై సంతకం చేయడంతో ఇప్పటి వరకు జరుగుతున్న సంప్రదాయ యుద్ధం, అణుయుద్ధంగా మారే ప్రమాదం ఏర్పడింది. ఒకవేళ అటువంటి పరిస్థితి దాపురిస్తే, ఆ పాపం జో బైడెన్‌దే అవుతుంది. ఉక్రెయిన్ అమెరికా తయారీ ఏటీఏసీఎమ్స్ దీర్ఘశ్రేణి క్షిపణులను ప్రయోగించిన నేపథ్యంలో, రష్యా మొదటిసారి నూతనంగా అభివృద్ధి చేసిన మధ్యంతర శ్రేణికి చెందిన హైపర్ సోనిక్ బాలిస్టిక్ క్షిపణి 'ఒరెష్నిక్'ను ప్రయోగించింది. ఇది ఉక్రెయిన్‌లోని నిప్రొ సైనిక స్థావరంపై పడింది. అస్త్రాకాన్ నుంచి ప్రయోగించిన ఈ క్షిపణిలో థర్మో న్యూక్లియర్ ఆయుధాన్ని వాడారు. అవిధంగా యూరప్ దేశాలకు పుతిన్ హెచ్చరించినట్లయింది. పదవినుంచి దిగిపోతూ జోబైడెన్ పెట్టిన చిచ్చుకు ఇప్పుడు ప్రపంచం యావత్తు శిక్ష అనుభవించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అమెరికా అనుమతించిన నేపథ్యంలో ఉక్రెయిన్ ప్రస్తుతం ఆర్మీ టాక్టికల్ మిస్సైల్ వ్యవస్థలను కుర్స్క్ ప్రాంతంలో మోహరించనున్నది. ఈ క్షిపణుల పరిధి 190 మైళ్లు. ఇది రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య ఈశాన్య సరిహద్దు ప్రాంతం.




**జమలాపురపు విఠల్‌రావు**

సీనియర్ జర్నలిస్ట్


**జో బైడెన్ కారణం**

డోనాల్డ్ ట్రంప్ కుమారుడు జూనియర్ ట్రంప్ ఇటీవల చేసిన ఒక ట్వీట్‌లో తన తండ్రి వచ్చే జనవరిలో పదవీ బాధ్యతలు స్వీకరించేలోపు జో బైడెన్, మూడో ప్రపంచ యుద్ధానికి తెరతీస్తున్న వైనాన్ని బహిర్గతం చేశారు. దేశంలోని మిలిటరీ-ఇండస్ట్రియల్ కాంప్లెక్స్‌కు (డీప్‌స్టేట్) మూడో ప్రపంచ యుద్ధం కావాలి. యుద్ధాలకు చరమగీతం పాడి, శాంతి సుస్థిరతలకు కృషి చేస్తానని తన తండ్రి హామీ ఇచ్చిన నేపథ్యంలో, ఆయన పదవిలోకి రాకముందే మూడో ప్రపంచ యుద్ధాన్ని ఏదోవిధంగా మొదలుపెట్టి ట్రంప్ నిస్సహాయంగా ఉండిపోవడం తప్ప మరోటి చేయలేని పరిస్థితి కల్పించాలన్నది డీప్‌స్టేట్ కుతంత్రమని జూనియర్ ట్రంప్ పేర్కొన్నారు. ఇందులో భాగంగానే డీప్‌స్టేట్‌కు కీలుబొమ్మలాగా వ్యవహరిస్తున్న బైడెన్ దీర్ఘదూరాల క్షిపణుల ప్రయోగానికి ఉక్రెయిన్‌కు అనుమతించే ఫైలుపై సంతకం చేశారని ఆరోపించారు. ట్రంప్ ఐదుగురు సంతానంలో ట్రంప్ జూనియర్ మాత్రమే తండ్రి రాజకీయ వ్యవహారాల్లో సన్నిహితంగా మెలుగుతున్నారు. పదవీ మార్పిడి టీమ్‌లో ఆయనదే కీలకపాత్ర అని చెబుతున్నారు.

**చేయిదాటుతున్న పరిస్థితులు**

బైడెన్ నిర్ణయం నేపథ్యంలో రష్యా-అమెరికాల మధ్య కీలకంగా ఉండే హాట్‌లైన్ కమ్యూనికేషన్ వ్యవస్థ ఇప్పుడు అందుబాటులో లేదని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ చెప్పడం చేయి దాటిపోతున్న పరిస్థితి అద్దం పడుతోంది. ఇదిలావుండగా కీవ్‌పై రష్యా దాడిచేస్తుందన్న కచ్చితమైన అంచనాతో అమెరికాతో పాటు స్పెయిన్, ఇటలీ, గ్రీస్ దేశాలు తమ రాయబార కార్యాలయాలను తాత్కాలికంగా మూసివేసాయి. ఉక్రెయిన్‌ను మరింత బలోపేతం చేసేందుకు యాంటీ పర్సనల్ మైన్స్‌ను ఉపయోగించేందుకు అనుమతించాలని అమెరికా ఆలోచిస్తోంది. ఇప్పటివరకు వీటి వినియోగానికి ఉక్రెయిన్‌కు అనుమతి ఇవ్వలేదు. ఇదే సమయంలో ఉత్తర కొరియా రష్యాకు పెద్దమొత్తంలో ఆయుధ సామగ్రిని పంపింది. ఇప్పటికే ఆ దేశం, రష్యాకు సైనికపరంగా సహాయం అందిస్తోంది.

**రష్యా మీడియా అభిప్రాయం**

ప్రస్తుత రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని నిలుపుచేసే శక్తి కేవలం భారత్‌కే ఉన్నదని రష్యాకు చెందిన ప్రముఖ టెలివిజన్ వ్యాఖ్యాత దిమిత్రి కిసెల్‌యోవ్ పేర్కొనడం తాజా పరిణామం. ప్రపంచ వ్యాప్తంగా

దౌత్యపరంగా భారత్ వహిస్తున్న కీలక పాత్ర నేపథ్యంలో ఈ సమస్యకు పరిష్కారం కనుగొనే సామర్థ్యం భారత్‌కు ఉన్నదన్న అభిప్రాయం రష్యా మీడియాలో వ్యక్తమవుతోంది. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ రష్యా అధ్యక్షులు పుతిన్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీలను కలిసిన నేపథ్యం ఆయన ఈ సూచన చేయడానికి కారణం. ఈ రెండు దేశాలు తమ సమస్యను చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని ప్రధాని మోదీ గట్టిగా చెబుతూ వస్తున్నారు. గతంలో


పుతిన్

ఉక్రెయిన్ అధ్యక్షుడు కూడా అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ ఈ సంఘర్షణను నివారించడంలో కీలక పాత్ర పోషించగలదన్న ఆశాభావం వ్యక్తం చేశారు. పుతిన్ కూడా చర్చలకు సుముఖంగానే ఉన్నారు కానీ అమెరికా అధ్యక్షుడు బైడెన్ సమస్యను మరింత జటిలం చేశారు. యుద్ధంలో రష్యాది పైచేయిగా ఉన్నప్పటికీ రెండులక్షల మంది సైనికులను కోల్పోయింది. మరో ఐదులక్షల మంది తీవ్రంగా గాయపడ్డట్టు వార్తలు వస్తున్నాయి. ఇక ఉక్రెయిన్ పరిస్థితి మరీ దారుణం. ప్రాణ, ఆస్తినష్టం విపరీతంగా ఉండి పశ్చిమ దేశాలు సహాయం చేయకపోతే చేతులెత్తే పరిస్థితి! అన్నివిధాలుగా తీవ్రంగా నష్టపోయిన ఉక్రెయిన్, జెలన్‌స్కీ వైఖరితో ఎప్పటికీ కోలుకోలేని దుస్థితికి చేరుకున్నా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. జెలన్‌స్కీపై డీప్‌స్టేట్ ఒత్తిడి ఆ స్థాయిలో ఉంది మరి! నిజం చెప్పాలంటే సోవియట్ యూనియన్ పతనం తర్వాత ఉక్రెయిన్ తన వద్ద ఉన్న అణ్వాయుధాలన్నింటిని 1994లో రష్యాకు ఇచ్చివేసింది. లేకపోతే ప్రపంచంలోనే మూడో అతిపెద్ద అణ్వస్త్ర దేశంగా ఉండేది. ఇప్పుడు అదే ఉక్రెయిన్‌కు యు.ఎస్. సహా అనేక అణ్వస్త్రదేశాలు మద్దతునిస్తున్నాయి.

**నాటో దేశాల్లో యుద్ధభయం**

నాటో దేశాలైన స్వీడన్, నార్వే దేశాలు తమ దేశ ప్రజలకు రాబోయే యుద్ధంపై ముందస్తు హెచ్చరికలు జారీచేశాయి. ఇవి కొన్ని లక్షల కరప్రతాలను ముద్రించి తమ దేశ ప్రజలకు పంచిపెట్టాయి. యుద్ధం వస్తే ఏవిధంగా రక్షించుకోవాలి, ఆహార పదార్థాలను ఏవిధంగా నిల్వచేసుకోవాలి తదితర జాగ్రత్తలతో కూడిన వివరాలిందులో ఉన్నాయి. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఈ దేశాలు ఈవిధంగా యుద్ధ జాగ్రత్తలపై కరపత్రాలు పంచడం ఇది ఐదోసారి! ఈ రెండూ నాటోలో చేరిన కొత్త దేశాలు. నిజం చెప్పాలంటే అత్యంత ప్రశాంతంగా ఏ విధమైన ఇబ్బందులు లేకుండా సజావుగా కొనసాగుతున్న ఈ చిన్న దేశాలు ఇప్పుడు యుద్ధం ఉచ్చులో చిక్కుకున్నాయి. డెన్మార్క్ తమ దేశ ప్రజలకు అవసరమైన నిత్యావసరాలు భద్రపరచుకోవాలని ఈమెయిల్ సందేశాలు పంపింది. ఫిన్లాండ్ కూడా 'సంక్షోభ పరిస్థితులు తట్టుకునేందుకు' సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చింది. గత ఏడాది నాటోలో చేరిన పాపం ఇప్పుడు ఈ దేశాన్ని యుద్ధం ముంగిట నిలిపింది. ముఖ్యంగా ఈ దేశానికి రష్యాతో అతిపొడవైన సరిహద్దు ఉంది. రెండో ప్రపంచ యుద్ధంలో నాటి యు.ఎస్.ఎస్.ఆర్‌తో జరిగిన యుద్ధానుభవంతో తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటోంది. మైనస్ 20 డిగ్రీల ఉష్ణోగ్రతల నేపథ్యంలో తమను తాము ఏవిధంగా రక్షించుకోవాలని ఫిన్లాండ్ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. యుద్ధం మొదలైతే మొట్టమొదట దాని ప్రభావానికి లోనయ్యేది స్వీడన్, నార్వే, ఫిన్లాండ్ దేశాలే!

**ఎవరిపై ఎంత ప్రభావం?**

మూడో ప్రపంచ యుద్ధమంటూ వస్తే తూర్పు యూరప్, మధ్యప్రాచ్యం, తూర్పు ఆసియా దేశాలపై దీని ప్రభావం తీవ్రంగా ఉండనుంది. సూడాన్, మయన్మార్, ఇథియోపియాల్లో అంతర్యుద్ధాలు, హైతీలో హింస, మెక్సికోలో డ్రగ్ వార్‌లు కొనసాగుతున్నా ఇవి వేటికవే స్వతంత్రమైనవి. ప్రపంచ యుద్ధానికి దారి తీసే అవకాశాలు లేవు. అయితే యు.ఎస్., చైనా, రష్యా దేశాల ప్రమేయం వున్న సంఘర్షణలు తప్పకుండా ప్రపంచయుద్ధానికి దారితీయగలవు. ప్రస్తుతం రష్యాతో జరుగుతున్న యుద్ధంలో ఉక్రెయిన్ తీవ్రంగా నష్టపోయినా, కేవలం పశ్చిమ దేశాలు ముఖ్యంగా అమెరికా మద్దతుతో తీవ్రమైన ఒత్తిడిలో యుద్ధం కొనసాగిస్తోంది. ఇక పాలస్తీనా–ఇజ్రాయెల్ యుద్ధం అతి కీలకమైనది కాగా, హమాస్ దాడుల తర్వాత ఇజ్రాయెల్ జరుపుతున్న దాడులు మధ్య ప్రాచ్యాన్ని ప్రమాదఘంటికలతో ముంచెత్తుతున్నాయి. విచిత్రమేమంటే అక్టోబర్ 7, 2023 నుంచి ఇప్పటివరకు ఇజ్రాయెల్ గాజాపై వేసిన బాంబుల పరిమాణం మొత్తం 70వేల టన్నులు! ఇది రెండో ప్రపంచ యుద్ధంలో వాడిన బాంబుల పరిమాణం కంటే ఎక్కువ. ప్రస్తుతం ఇది విస్తరించి ఇరాన్–ఇజ్రాయెల్ ఘర్షణలకు దారితీసింది. ఇజ్రాయెల్–లెబనాన్‌ల మధ్య సరిహద్దు ప్రాంతాన్ని ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైనదిగా పరిగణిస్తారు. ఇక్కడ హిజ్‌బుల్లా–ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న ఘర్షణ మధ్యప్రాచ్య ప్రాంతాన్ని అతలాకుతలం చేస్తోంది. అమెరికా, ఇజ్రాయెల్‌కు వెన్నుదన్నుగా ఉంది. ఇక ఉక్రెయిన్ యుద్ధం ద్వారా తూర్పు యూరప్‌లో తన ఆధిపత్యాన్ని రష్యా ప్రదర్శిస్తోంది. అదేవిధంగా ఇప్పటివరకు తైవాన్‌ను అక్రమించుకోవాలని చైనా చేస్తున్న ప్రయత్నాలను యు.ఎస్. అడ్డుకుంటోంది. ఒకవేళ తైవాన్‌పై చైనా దాడికి దిగితే యు.ఎస్. దాని మిత్రదేశాలు ఎదురు దాడికి దిగక తప్పదు. ఇది ఆసియా పసిఫిక్ ప్రాంతంలో ఘర్షణలకు దారి తీస్తుంది. డోనాల్డ్ ట్రంప్ తాను ఇచ్చిన ఎన్నికల హామీ ప్రకారం రష్యా–ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలకడానికే సిద్ధంగా ఉన్నారు. ఎన్నికల తర్వాత ఈ విషయాన్ని పుతిన్, జెలన్‌స్కీలకు తెలియపరిచారు కూడా. అయితే ఈ యుద్ధం ముగింపునకు అనుసరించాల్సిన విధానాలకు ఆయన ఇంకా తుదిరూపం ఇవ్వలేదు. ట్రంప్ 'అమెరికా ఫస్ట్' విధానాన్ని ప్రకటించడంవల్ల, ఆయన దృష్టి జాతీయాభివృద్ధిపైనే అధికంగా


జో బైడెన్


ట్రంప్

ఉండనుంది. ఫలితంగా ఉక్రెయిన్, తైవాన్, మధ్యప్రాచ్య సంఘర్షణల్లో కీలకమైన భౌగోళిక రాజకీయ పరిణామాలు చోటుచేసుకోవచ్చు.

**సంక్లిష్ట ప్రణాళిక**

రష్యా–ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న యుద్ధాన్ని ఒక కోణంలో ఆలోచిస్తే రష్యా, యుఎస్, యూరప్ దేశాల మధ్య నడిచే సంక్లిష్ట గేమ్‌ప్లాన్‌గా అర్థం చేసుకోవాలి. ముఖ్యంగా ఈ యుద్ధం ద్వారా యు.ఎస్. సహచర దేశాల్లో తన ఆధిపత్యాన్ని నిలుపుకోవడానికి తీవ్రంగా కృషిచేస్తోంది. ఇదే సమయంలో అమెరికా ఆధిపత్యాన్ని దెబ్బతీయడానికి రష్యా చేస్తున్న యత్నంగా కూడా దీన్ని పరిగణించవచ్చు. విచిత్రమేమంటే మధ్యప్రాచ్యం, మధ్య ఆసియా, దక్షిణాసియా ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలు ఈ యుద్ధం విషయంలో అమెరికాను పెద్దగా




పట్టించుకున్న దాఖలాలు లేవు. అంతేకాదు అమెరికాకు లేదా రష్యాకు కొమ్ము కాయడానికి ఇవి ముందుకు రాలేదు. ఈ మొత్తం పరిణామాన్ని గమనిస్తే అమెరికా, పశ్చిమ దేశాల రాజకీయాలు క్రమంగా బలహీన పడ్డాయన్నది మాత్రం సుస్పష్టం.

తాను అధికారంలోకి వచ్చిన తర్వాత రష్యా–ఉక్రెయిన్ యుద్ధాన్ని కేవలం 24 గంటల్లో ఆపేస్తానని ట్రంప్ హామీ ఇచ్చివున్నాడు. ఆయన చూపే పరిష్కారం పుతిన్‌కే అనుకూలంగా ఉంటుందనేది సర్వత్రా వ్యక్తమయ్యే అభిప్రాయం. అంటే ఇప్పటికే రష్యా తన ఆధీనంలోకి తెచ్చుకున్న ఖర్కివ్, లూహాన్స్క్, డొనెస్కలను రష్యాకే దక్కడం ఖాయమని జెలన్‌స్కీ భయపడుతున్నాడు. ఈ నేపథ్యంలో జనవరి 20 లోపుగా ఈ ప్రాంతాలనుంచి సాధ్యమైనంతవరకు రష్యా సైన్యాలను వెనక్కి వెళ్లేలా చేయాలన్నది అమెరికా ప్రణాళిక. ఇందుకోసం 300 మిలియన్ డాలర్లు విలువైన ఆయుధాలను ఉక్రెయిన్ సైన్యాలకు అందిస్తోంది. ఒకవేళ రష్యా ఆక్రమించిన భూభాగాలను ఉక్రెయిన్ వదులుకోవాల్సి వస్తే, అమెరికాకు ఆర్థిక నష్టం మాత్రమే కాకుండా ఉక్రెయిన్‌కు భూభాగం పరంగా తీవ్ర అన్యాయం చేసిన అపప్రథను డెమోక్రట్ పార్టీ మూటకట్టుకోవాల్సి వస్తుంది. ఇదంతా ఆ పార్టీ విధాన వైఫల్యంగా చరిత్రలో మరో మచ్చగా మిగిలిపోతుంది. గతంలో బరాక్ ఒబామా (డెమోక్రట్ పార్టీ) అధ్యక్షుడిగా ఉన్న కాలంలో రష్యా, క్రిమియాను ఆక్రమించింది. దీన్నుంచి పుతిన్‌ను ఒబామా ఆపలేకపోయాడన్న అంశాన్ని డోనాల్డ్ ట్రంప్ తన ఎన్నికల ప్రచారంలో వేలెత్తి చూపారు. మొత్తంమీద ఉక్రెయిన్ ఉదంతం డెమోక్రట్ పార్టీ ప్రతిష్టను బాగా దెబ్బతీసేదిగా మారిందని చెప్పాలి. అదీకాకుండా డెమోక్రట్ పార్టీ డీప్‌స్టేట్‌కు అనుకూలంగా పని చేస్తుంది. డోనాల్డ్ ట్రంప్, ఎన్నికల ప్రచార సమయం నుంచి తాను అధికారంలోకి వస్తే డీప్‌స్టేట్ పని పడతానంటూ చెబుతూవస్తున్నారు. ఇదే సమయంలో ఆయనకు ఇలాన్‌మస్క్ మద్దతుగా నిలవడం ఇద్దరూ డీప్‌స్టేట్‌కు వ్యతిరేకులే కావడం అమెరికా రాజకీయాల్లో పోలరైజేషన్‌కు దారితీసింది. అంటే డీప్‌స్టేట్ అనుకూలం, దానికి వ్యతిరేకంగా వ్యవహరించే రాజకీయాలు మొదలయ్యాయి. ప్రాథమికంగా డోనాల్డ్ ట్రంప్ వ్యాపారి కనుక యుద్ధాలకు ఆయన వ్యతిరేకం. అందువల్లనే 'డీప్‌స్టేట్ అమెరికాను నాశనం చేస్తుందా లేక మనం డీప్‌స్టేట్‌ను నాశనం చేద్దామా' అంటూ ఆయన గత ఎన్నికల ప్రచారంలో గట్టిగా ప్రశ్నిస్తూ వచ్చారు. ముఖ్యంగా ఈ డీప్‌స్టేట్ తనకు, తన ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నదని ట్రంప్ ఆరోపిస్తున్నారు. అంతకుముందు ఎన్నడూలేని విధంగా తనను ప్రశ్నించే ఇద్దరు బలమైన బిలియనీర్ల చేతులు కలపడమే కాకుండా అధికారం కూడా వారి హస్తగతం కావడం ఇప్పుడు డీప్‌స్టేట్‌కు పెద్ద సమస్యగా మారింది. జనవరి 20న డోనాల్డ్ ట్రంప్ పదవీ బాధ్యతలు స్వీకరించనున్నందు వల్ల, ఈలోగానే ఆయన సరిదిద్దలేని రీతిలో యుద్ధాన్ని మరింత తీవ్రతరం చేయాలన్నది డీప్‌స్టేట్ పన్నాగం. జో బైడెన్ దీర్ఘశ్రేణి క్షిపణుల ప్రయోగానికి ఉక్రెయిన్‌కు అనుమతినివ్వడానికి పై రెండు కారణాలు ప్రధాన పాత్రపోషించాయి. ఇదే సమయంలో రష్యా కూడా తాను ఆక్రమించిన భూభాగాలపై పూర్తిస్థాయి నియంత్రణ సాధించి, అవసరమైతే మరిన్ని భూభాగాలను కలుపుకోవాలని చూస్తోంది.

**డీప్‌స్టేట్ అంటే**

డీప్‌స్టేట్ అంటే రహస్యంగా పనిచేసే అనధికార ప్రభుత్వం. దీనికి రాజ్యం రాజకీయ నాయకత్వంతో పనిలేదు. ఇది తనదైన ఒక ప్రత్యేక అజెండాతో పనిచేస్తుంది. దీని పనితీరు కుట్ర సిద్ధాంతాల ఆధారంగా ఉంటుంది కనుక ప్రపంచ వ్యాప్తంగా ఈ డీప్‌స్టేట్‌ను ఒక 'విలన్'గానే పరిగణిస్తుంటారు. ఆధునిక డీప్‌స్టేట్ సిద్ధాంతం టర్కీతో ముడిపడి వుండటం గమనార్హం. 1923 నుంచి ముస్తాఫా కమల్ అటటుర్క్ భావజాలానికి అనుగుణంగా టర్కీలో సెక్యులర్ క్రమం దెబ్బతినకుండా కొనసాగడానికి వీలుగా మిలిటరీ, పౌర అధికార్లు కలిసి పనిచేసే ఒక రహస్య యంత్రాంగం ఇది. అయితే టర్కీలోని డీప్‌స్టేట్, ప్రచ్ఛన్నయుద్ధ కాలంలో అమెరికా రహస్య మద్దతుతో ఏర్పాటైన గ్లాడియో సంస్థకు అనుబంధంగా టర్కీలో పనిచేసిన 'కౌంటర్ గెరిల్లా' శాఖను కలిపి డీప్‌స్టేట్‌గా కొందరు పేర్కొంటారు. ఈ కౌంటర్ గెరిల్లా శాఖ ప్రధానంగా నాటి యు.ఎస్.ఎస్.ఆర్. నేతృత్వంలో కమ్యూనిజం విస్తరణను అడ్డుకోవడానికి ఉద్దేశించింది. ఇది 'ట్రూమన్ సిద్ధాంతానికి' అనుగుణంగా తన కార్యకలాపాలను కొనసాగించేది. సోవియట్ కమ్యూనిజం విస్తరణను అడ్డుకోవడానికి ఆవిధంగా టర్కీని నాటోకు అనుకూలంగా అమెరికా మలచింది. అయితే డీప్‌స్టేట్ ఎక్కువగా ప్రాచుర్యం లోకి వచ్చింది మాత్రం 2016 అమెరికా ఎన్నికల సమయంలో! తర్వాతికాలంలో డోనాల్డ్ ట్రంప్ యంత్రాంగం డీప్‌స్టేట్ పదాన్ని మరింత విస్తృతంగా వాడుకలోకి తెచ్చింది.

**1963 నుంచే...**

నిజానికి అమెరికాలో 1963 నుంచే ఈ పదం వాడుకలో వుంది. ముఖ్యంగా ప్రభుత్వ యంత్రాంగం లోని (ఎఫ్‌బిఐ, సీఐఏ) వారి సహకారంతో, దేశంలోని అతిపెద్ద పారిశ్రామికవేత్తలు, ఆర్థిక దిగ్గజాలు కలిసి ప్రజాస్వామ్య బద్ధంగా రాజకీయ విధానంలో ఎన్నికైన ప్రభుత్వంతో పనిలేకుండా స్వతంత్రంగా తెరవెనుక తమ అజెండాను అమలు చేస్తూ వచ్చారు. వీరినే డీప్‌స్టేట్‌గా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా మిలిటరీ–పారిశ్రామిక దిగ్గజాలదే ఇందులో ప్రధాన పాత్ర. వీరి ఆయుధ వ్యాపారాలు సజావుగా లాభసాటిగా సాగాలంటే ప్రపంచంలో నిరంతరం యుద్ధాలు జరుగుతుండాల్సిందే. అమెరికాలో

డీప్‌స్టేట్‌కు బీజం పడింది 1871 సంవత్సరంలో. జార్జ్ ఫ్రైడ్‌మాన్ అనే అమెరికా రాజకీయ పండితుడి అభిప్రాయం ప్రకారం, ఫెడరల్ ఉద్యోగులపై దేశాధ్యక్షుడి అధికారాలను తగ్గించిన ఈ సంవత్సరం నుంచే డీప్ స్టేట్ ప్రభావం బలీయం కావడం మొదలైంది. ప్రముఖ చరిత్రకారుడు ఆల్‌ఫ్రెడ్ డబ్ల్యు.మెక్‌కోయ్ ఉద్దేశంలో సెప్టెంబర్ 11 దాడుల తర్వాత అమెరికాలో ఇంటెలిజెన్స్ కమ్యూనిటీ ప్రాబల్యం బాగా పెరిగి యు.ఎస్. ప్రభుత్వంలో నాలుగో శాఖగా మారిపోయింది. చాలా సందర్భాల్లో ఇది కార్యనిర్వాహక శాఖతో పనిలేకుండా స్వతంత్రంగా వ్యవహరిస్తూ వచ్చింది కూడా. ఇప్పటికీ అమెరికన్లలో 48% మంది డీప్‌స్టేట్ ఉన్నదనే విశ్వసిస్తుండటం గమనార్హం.

**లాభం ఎవరికి?**


రష్యా బూచిని చూపి అమెరికాకు చెందిన 'డీప్‌స్టేట్'లో భాగమైన లాక్‌హీడ్ మార్టిన్ సంస్థ వ్యాపారపరంగా గణనీయమైన లాభాలను ఆర్జించింది. 2021లో అమెరికా ఫిన్లాండ్‌కు 64 ఎఫ్–35 విమానాలు అమ్మింది. ఈ ఒప్పందం ఖరీదు 9.4 బిలియన్ అమెరికన్ డాలర్లు. ఈ నిధులు లాక్‌హీడ్ మార్టిన్ సంస్థ ఖాతాలోకి వెళతాయి. ఇందులో అధిక పెట్టుబడులు పెట్టిన మరో సంస్థ బ్లాక్ రాక్. నార్వేకు 52 ఎఫ్–35 విమానాలను అమెరికా అమ్మింది. వీటి ఖరీదు 769 మిలియన్ డాలర్లు. రొమేనియా కూడా తాజాగా 32 ఎఫ్–35 యుద్ధ విమానాలు కొనుగోలు చేసేందుకు లాక్‌హీడ్ మార్టిన్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. రొమేనియా చరిత్రలోనే ఇది అత్యంత ఖరీదైన రక్షణ పరమైన కొనుగోలుగా చెబుతున్నారు. నిజానికి ప్రశాంతంగా మనుగడ సాగించే ఈ దేశాలకు ఇంతటి ఖర్చుతో కూడిన యుద్ధవిమానాల అవసరం లేదు. కానీ నాటోలో చేరిన దగ్గరి నుంచి, రష్యాను చూపి విపరీతంగా భయపెట్టిన అమెరికా, తన యుద్ధవిమానాలను అమ్ముకొని లాభపడింది. ఈ పరిణామాలు గమనిస్తుంటే, నాటోలో కొత్త దేశాలను చేర్చుకోవడం ద్వారా, రష్యాను చూపి వాటిచేత ఆయుధాల కొనుగోలు చేయించి, తాను ప్రయోజనం పొందడం అమెరికా విధానంగా ఉంది. ఇదంతా డీప్‌స్టేట్ ప్రణాళికలో భాగమేననుకోవాలి. యు.కె., ఆస్ట్రేలియా, ఇటలీ, నెదర్లాండ్స్, డెన్మార్క్ కెనడా, నార్వే, ఇజ్రాయెల్, జపాన్, దక్షిణ కొరియా, బెల్జియం, పోలెండ్, సింగపూర్, జర్మనీ, సిట్జర్లాండ్ దేశాలు కూడా ఈ విమానాల కొనుగోళ్లకు ముందుకు వస్తున్నాయి. ఆవిధంగా రష్యా సాకుతో అధికంగా లాభపడింది లాక్‌హీడ్ మార్టిన్ సంస్థ! రష్యాపై ఆంక్షలు విధించి చమురు, సహజ వాయువు కొనవద్దని అమెరికా చెప్పడంతో యూరప్ దేశాలు పూర్తిగా కొనుగోళ్లను నిలిపేశాయి.

కొంతకాలం అమెరికావద్దే చమురు, సహజవాయు వును అధిక ధరలకు కొన్నాయి. కానీ ఇది వాటికి తలకుమించిన భారమైంది. ఇదే సమయంలో రష్యానుంచి రాయితీ ధరలకు క్రూడాయిల్‌ను భారత్ దిగుమతి చేసుకుంది. రష్యానుంచి క్రూడాయిల్ దిగుమతులపైనే ఆంక్షలు కనుక, భారత్ నుంచి శుద్ధి చేసిన చమురును తక్కువధరకు యూరప్ దేశాలు కొనుగోలు చేయడం మొదలు పెట్టాయి. ఫలితంగా శుద్ధి చేసిన చమురు, ఎగుమతులతో భారత్ లాభపడింది. మరోవిధంగా చెప్పాలంటే మోయలేని ధరలను అమెరికాకు చెల్లించి దివాలా తీయకుండా యూరప్ దేశాలను భారత్ కాపాడిందనే చెప్పాలి. లేకపోతే నేడు వాటి పరిస్థితి మరింత దయనీయంగా మారేది. ఇక రష్యా విషయానికి వస్తే, ఉక్రెయిన్‌లోని ముఖ్యమైన భాగాలను ఆక్రమించకోవడమే కాదు, ఉక్రెయిన్ దాకా నాటో విస్తరణను అడ్డుకోగలిగింది. చమురు వ్యాపారంలో బాగా లాభపడింది. ఇక తీవ్రంగా నష్టపోయింది ఉక్రెయిన్, ఐరోపా దేశాలు మాత్రమే! ★

# 'ఇస్లాం దృష్టికోణం నుంచి చూడకపోతే అది చరిత్రే కాదు'

తమ దేశ చరిత్రను వలసవాదుల కళ్లజోడు నుంచి కాక దేశీయులమైన తమ దృష్టికోణంతో చూసి, రాసుకోవాలన్న తపన ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలలో పెరుగుతోంది. ముఖ్యంగా, గతంలో సామ్రాజ్యవాదుల ఆక్రమణకు గురై, పోరాడి స్వాతంత్ర్యాన్ని సాధించుకున్న దేశాలు ఆ భావదాస్యం నుంచి బయటపడాలని ఎంతగా ప్రయత్నిస్తున్నాయో, అంతగా ప్రతిఘటనను ఎదుర్కోవడం విచిత్రం. ఈ క్రమంలోనే అమెరికాలోని షానీ స్టేట్ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్న ప్రొఫెసర్ లావణ్యా వేమసాని ఇటీవలే కొన్ని అధ్యాయాలను రచించి, మొత్తం పుస్తకాన్ని ఎడిట్ చేసి ప్రచురించిన 'హ్యాండ్‌బుక్ ఆఫ్ ఇండియన్ హిస్టరీ'లో భారతీయ చరిత్రకు సంబంధించిన నూతన సంచలనా త్మక పరిశోధనలతో కూడిన 21 అధ్యాయాలు ఉన్నాయి.

ఈ పుస్తకం విడుదలైనప్పటి నుంచి, ముస్లిం దృక్కోణం నుంచి భారతీయ చరిత్రను తిరిగి చెప్పనందుకు ప్రొఫెసర్ లావణ్య వేమసానిపై ఉదారవాదులమని చెప్పుకునే అసహనవాద విద్యావేత్తలు, యాక్టివిస్టులు విరుచుకుపడ్డారు. ముఖ్యంగా లావణ్య ఈ పుస్తకం గురించి సోషల్ మీడియాలో ప్రకటించడమేమిటి, ఇస్లామిక్ స్టడీస్‌లో విశిష్ట అధ్యయనాలు చేసిన విదేశీ విద్యావేత్తలు, శ్వేతజాతీయులైన విదేశీయులు ఆమెపై దాడి చేశారు. ఇప్పటికే ప్రధాన స్రవంతి చరిత్ర పుస్తకాలన్నింటిలోనూ పుష్కలంగా వక్రీకరించిన ఉదంతాలు, ఏరివేరి పెట్టుకున్న అధ్యాయాలు, జరిగిన అత్యాచారాలపై ముసుగువేసిన మరీ రచించి ఉన్నప్పటికీ వారికి ఇది నచ్చలేదు.




ముష్కర ఇస్లామిక్ దాడులు, అవి చేసిన క్రూర చక్రవర్తుల దృక్కోణం నుంచి భారత చరిత్రను తిరిగి చెప్పనందుకు, దేశీయులనే అంటే హిందువులనే ఆ పుస్తకంలో ప్రధాన విషయాంశంగా చేసినందుకు భారత సంతతికి చెందిన ప్రొఫెసర్ సమగ్రతపైనే వారు దాడి చేశారు. వలసవాద 'దక్షిణాసియాలో ఇస్లాం'పై అధ్యయనం చేసి, బోధన చేస్తున్న బ్రానన్ ఇన్‌గ్రామ్ అనే మేధావి, భారతదేశ వాస్తవ చరిత్రలో ఆక్రమణదారుల గురించి తక్కువగా ఉండటం గురించి ఆవేదన వ్యక్తం చేశాడు. అందులో ఇస్లాం లేదా ముస్లింలపై ఒక్క అధ్యాయం కూడా లేదని, మొత్తం 507 పేజీలున్న ఈ పుస్తకంలో ఇస్లాం అనే పదం కేవలం ఐదు సార్లు, ముస్లింలు అనే పదం 9సార్లు వచ్చిందని ఆరోపించడమే కాదు, ఇది నిర్లక్ష్యమా లేక దక్షిణ ఆసియా అధ్యయనపు హిందుత్వీకరణా? అంటూ ప్రశ్నించాడు.

మరొక శ్వేతజాతీయ ప్రొఫెసర్, ఇస్లామిక్ స్టడీస్ బోధించే ఎపి బ్రౌన్ అయితే యూనివర్సిటీలో తన క్లాసుల్లో ఆ పుస్తకాన్ని ఉపయోగించనని ప్రకటించేశాడు. ఇది 1100–1800 సం॥ వరకు లేదా 1/4 జనాభా గురించి విస్మరిస్తే ఇది చాలా మంచిపుస్తకం... ముఖ్యంగా మీరు హిందూ జాతీయవాది అయితే ఇంకా అంటూ వ్యంగ్యోక్తులు పోయాడు.

'హ్యాండ్ బుక్ ఇఫ్ ఇండియన్ హిస్టరీ' పుస్తకం, ముస్లిం కథనాన్ని గణనీయంగా విస్మరించిందని ఇస్లామిక్ స్టడీస్‌పై ఆసక్తి కలిగిన మరొక పరిశోధకుడు ముఫీద్ యుక్సెల్ బాధపడ్డాడు.

కాగా, ఈ ఇదంతా దేశీయ చరిత్రలో పరిశోధన చేయాలనుకునే వారిని బెదిరించే కార్యాచరణ పద్ధతిలో భాగమేనని, అందుకే మ్లేచ్ఛుల ప్రభావంలేని ప్రొఫెసర్ లావణ్య వేమసానిని లక్ష్యంగా చేసుకున్నారు అని విశ్లేషకులు భావిస్తున్నారు. ★

దైవదూషణకు యావజ్జీవ కారాగార శిక్ష లేదా మరణ శిక్ష విధించవచ్చంటూ బాంగ్లాదేశ్‌లోని ఒక హైకోర్టు తీర్పు ఇచ్చి నాలుగు రోజులు తిరగకుండానే హిందూ నాయకుడు, ఇస్కాన్ సన్యాసి చిన్మొయ్ కృష్ణదాస్‌ను అరెస్టు చేయడంతో ఆ దేశంలోని మైనార్టీలు (హిందువులు, బౌద్ధులు, క్రైస్తవులు) స్తంభించిపోయారు. నిజానికి కోర్టు ఆ తీర్పు ఇవ్వకముందు నుంచే దైవదూషణ సాకుతో హిందువులపై నిరాటంకమైన హింస కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఇతర మత విశ్వాసాలను అనుసరించే వారికి వ్యతిరేకంగా పోరాడటం అనేది ఇస్లామిస్టుల పవిత్ర గ్రంథం ప్రకారం ఒక కర్తవ్యం. అందుకు అనుగుణంగానే బాంగ్లాదేశ్‌లోని ముస్లింలు పోరాడుతున్నారు. మైనార్టీలను శత్రువులుగా భావించి, వారి మనస్సుల్లో భయం నింపాలని వారు చేస్తున్న ప్రయత్నాలను నిర్వీర్యం చేస్తూ హిందువులు ముందుకు సాగగలిగేలా చేసేందుకు ఇస్కాన్‌కు చెందిన చిన్మొయ్ కృష్ణదాస్ వంటి హిందూ నాయకులు ప్రయత్నిస్తున్నారు.



# అక్కడ హిందువు కావ

**బాం**గ్లాదేశ్ జాతీయ జెండాను అగౌరవ పరచడమే కాదు, దేశానికి వ్యతిరేకంగా కుట్రపన్నాడన్న ఆరోపణతో కృష్ణదాస్‌ను ఢాకా మెట్రోపాలిటన్ పోలీసులు (డిఎంపి) ఢాకా విమానాశ్రయం వద్ద అదుపులో తీసుకున్నారు. ఆయనను అదుపులోకి తీసుకున్న పద్ధతి కిడ్నాప్ చేసినట్టుగా ఉండటంతో బాంగ్లాదేశ్‌లోని హిందువులు మరొక్కసారి సంక్షోభంలో చిక్కుకున్నారు. ఈ ఆరోపణలు అసాధ్యమైనవి కావడంతో, ఆయనను అరెస్టు చేయడం వెనుక కుట్రపూరితమైన ఉద్దేశాలు ఉన్నాయనే ఊహాగానాలు సాగుతున్నాయి. అక్కడ బలవంతపు అధికార మార్పిడి జరిగినప్పటి నుంచీ హిందూ మైనార్టీలు ఆ దేశంలో తమ మనుగడ కోసం పోరాటం చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఆయనను హఠాత్తుగా అదుపులోకి తీసుకోవడం అన్నది హిందువులపై దాడులను మరింత పెంచేందుకే అనిపించక మానదు. దీనితో, స్థానిక ఇస్కాన్ సహా ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులు అక్కడ పెరుగుతున్న మానవహక్కుల ఉల్లంఘనలను నిలిపి వేసేందుకు జోక్యం చేసుకోవలసిందిగా ప్రధాని మోదీని అర్థిస్తున్నారు.

**ఆధారంలేని ఆరోపణలతో అరెస్టు**

చిన్మొయ్ కృష్ణదాస్ సాధారణ వ్యక్తేమీ కాదు. ఆయన బాంగ్లాదేశ్ ఇస్కాన్‌కు అధికార ప్రతినిధి మాత్రమే కాదు, చిట్టగాంగ్‌లోని చారిత్రిక పుండరీక్ ధామ్ విహారం కస్టోడియన్. అధికార మార్పిడి జరిగినప్పటి నుంచి అత్యాచారాలకు లోనవుతున్న హిందూ మైనార్టీకి న్యాయాన్ని డిమాండ్ చేసేందుకు అవిశ్రాంతంగా పని చేస్తున్నారు. శాంతిని, మతసామరస్యాన్ని ప్రోత్సహించేందుకు హిందువులను ఐక్యం చేసి, మహమ్మద్ యూనస్ పాలనలో జరుగుతున్న హిందూ హననాన్ని నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు.

తన శాంతియత్నాలలో భాగంగా, చిన్మొయ్ దాస్ బీఎన్పీ, జమాత్-ఎ -ఇస్లామీ పార్టీలు సహా అన్ని రాజకీయ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులతో ఇటీవలే చర్చలు నిర్వహించారు. హిందూ మైనార్టీ హక్కులు, రక్షణను ప్రతిపాదించడం అతడి లక్ష్యం. ఆగస్టు నుంచి హిందువులపై దాదాపు 3వేల దాడులు జరిగినట్టు నమోదైన గణాంకాలను పట్టి చూపుతూ, మైనార్టీలను పరిరక్షించడంలో యూనస్ తాత్కాలిక ప్రభుత్వం విఫలమైందంటూ బహిరంగంగా విమర్శించారు.

పాలకులు చిన్మొయ్ దాస్‌పై తీసుకున్న ఈ హఠాత్ చర్యను-అదుపులోకి తీసుకోవడం లేదా అరెస్టు చేయడంగా అభివర్ణిస్తున్నప్పటికీ, పోలీసులు ఆయనను కిడ్నాప్ చేశారని పలువురు అంటున్నారు. ఆయనపై దాఖలు చేసిన అభియోగాలు కూడా నమ్మశక్యం కాని విధంగా ఉన్నాయి, ముఖ్యంగా దేశానికి వ్యతిరేకంగా ఆయన కుట్ర పన్నుతున్నాడన్న అభియోగం. గత నెల 25న జరిగిన ఒక ర్యాలీలో, ఒక కాషాయ జెండాను బాంగ్లాదేశ్ జెండాకన్నా పైన పెట్టారని, అది జాతీయ జెండాను అవమానించడమేనంటూ కృష్ణదాస్‌తో పాటు తొమ్మిది మందిపై కేసు నమోదైంది. ఈ ఆరోపణలు చేసింది చిట్టగాంగ్‌కు చెందిన నాటి బీఎన్పీ నాయకుడు ఫిరోజ్ ఖాన్. దీనితో ఆయనను పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాడంటూ బీఎన్పీ పార్టీ డిస్మిస్ చేసింది. ఈ క్రమంలో పోలీసులు మోపిన అభియోగాలు, అరెస్టు రెండూ ఆధారరహితమైనవంటే అతిశయోక్తి కాదేమో. అయితే, చిన్మొయ్ కృష్ణ దాస్‌ను, ఐక్యమైన హిందూ సమాజం నోరు మూయించేందుకు వ్యూహాత్మకంగా సమయాన్ని ప్రభుత్వం ఎంచుకున్నట్టు కనిపిస్తోంది. సాదా దుస్తులలో వచ్చిన అధికారులు ఢాకా నుంచి చిట్టగాంగ్ విమానం ఎక్కబోతున్న కృష్ణదాస్‌ను అదుపులోకి తీసుకుని, గుర్తుతెలియని ప్రాంతానికి తీసుకువెళ్లారు.

**హిందువుల నిరసనలు**

నిత్య హననాలు, ఒక పద్ధతి ప్రకారం నిర్లక్ష్యానికి గురవ్వడానికి అలవాటు పడిన సమాజం బాంగ్లాదేశ్‌లోని హిందూ సమాజం. అయితే, ఈ అరెస్టుకు వ్యతిరేకంగా హిందువులు ఉవ్వెత్తున ఎగిసిపడ్డారు. అరెస్టు వార్త బయటకు వచ్చిన వెంటనే ఢాకాలోని షాబాగ్ పక్కన నిరసనలు ప్రారంభ మయ్యాయి. వేలాదిమంది హిందువులు నిరసన ప్రదర్శన చేస్తూ చిన్మొయ్ కృష్ణదాస్‌ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నిరసన ప్రదర్శనలు యూనస్ పాలనలో ఎంత హింసను ఎదుర్కొంటాయో తెలిసిన విషయమే అయినప్పటికీ, ఒక పద్ధతి ప్రకారం హిందువులను అణచివేస్తున్న తీరును వ్యతిరేకించడం నుంచి వెనక్కి తగ్గేందుకు వారు నిరాకరిస్తున్నారు.

**తమ అస్తిత్వం కోసమే నిరసనలు**

ఒకవైపు పోలీసులు, మరొకవైపు మతోన్మాద



# డమే నేరమా!

మూకలు హిందువులపై చేస్తున్న అత్యాచారాలు అన్నీ ఇన్నీ కాదు. శాంతియుతంగా హిందువులు నిరసన ప్రదర్శన చేస్తుంటూ, మతోన్మాదులు వారిపై దాడి చేయడంతో పలువురు హిందువులు గాయపడ్డారు. అలాగే, విహారం ఉన్న చిట్టగాంగ్‌లో వీధులలో ముందెన్నడూ లేని విధంగా భారీ ప్రదర్శనలు జరిగాయి. ఒకవైపు మతోన్మాద తీవ్రవాదులను విడుదల చేస్తూ, దైవదూషణ పేరుతో హిందువులను అరెస్టు చేస్తున్నారంటూ హిందువులు ఆరోపిస్తున్నారు, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిజానికి ఈ ప్రదర్శనలు కేవలం కృష్ణదాస్ గురించే కాదు. ప్రభుత్వం తమను ఉపేక్షించిస్తోందనే భావనకు తీవ్రంగా లోనవుతున్న సమాజం తమకు న్యాయం చేయమంటూ వేస్తున్న కేకలు అవి. హిందూ నాయకులను భయపెట్టి, వారి గొంతుకలను అణచివేయడానికే చిన్మొయ్ దాస్‌పై అటువంటి అభియోగాలు మోపారని నిరసనకారులు ఆరోపిస్తున్నారు. ఈ వార్త బయటకు వచ్చినప్పటి నుంచీ సోషల్ మీడియా వేదికలలో హిందువులకు న్యాయం కోసం డిమాండ్ పెరుగుతోంది. తమ నాయకుడిని తక్షణం విడుదల చేయాలని ఇస్కాన్ అంతర్జాతీయ నాయకత్వం డిమాండ్ చేయడమే కాక, ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది.

**భారత్ జోక్యం చేసుకోవాలని డిమాండ్**

చిన్మొయ్ దాస్ కిడ్నాప్ వంటి అరెస్టు బాంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న అత్యాచారాల వాస్తవికతను వెలుగులోకి తెచ్చింది. ఇస్కాన్ సన్యాసి నోరు మూయించేందుకే అంతటి కటువైన అభియోగాలు మోపారు. అంతేకాదు, ఇస్లామిక్ అణచివేతను వ్యతిరేకించేందుకు ఐక్యం అవ్వాలని ప్రయత్నిస్తున్న హిందూ మైనార్టీలకు అది ఒక హెచ్చరిక కూడా. తమ పురోహితులు, సన్యాసులపై మాత్రమే కాకుండా హిందువులపై పెరుగుతున్న దాడుల వెలుగులో తమకు తోడ్పడవలసిందిగా ఇస్కాన్ ప్రధాని మోదీకి అత్యవసర సందేశాన్ని పంపినట్టు వార్తలు వచ్చాయి. దీనితోపాటుగా, సోషల్ మీడియా వేదిక ఎక్స్‌పై 'బాంగ్లాదేశ్‌లో ప్రముఖ నాయకులలో ఒకరైన శ్రీ చిన్మొయ్ కృష్ణదాస్‌ను ఢాకా పోలీసులు అదుపులోకి తీసుకోవడం గురించి కలవరపరిచే వార్తలను చూశాం, విన్నాం.

ప్రపంచంలో ఎక్కడా ఇస్కాన్‌కు తీవ్రవాదంతో సంబంధం లేని నేపథ్యంలో ఇటువంటి నిరాధారమైన ఆరోపణలు చేయడం అవమానకరం. భారత ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని, తాము శాంతిని ప్రేమించే భక్తి ఉద్యమకారులమనే విషయాన్ని బాంగ్లాదేశ్ ప్రభుత్వానికి తెలియచేయాలని ఇస్కాన్, ఐఎన్‌సి విజ్ఞప్తి చేస్తోంది. తక్షణమే చిన్మొయ్ కృష్ణదాస్‌ను విడుదల చేయాలని కోరుతున్నాం. తన భక్తుల సంరక్షణకు ఆ కృష్ణభగవానుడికి ప్రార్థనలు చేస్తున్నాం,' అంటూ ప్రధాని మోదీ, విదేశాంగమంత్రి జైశంకర్ సహా పలువురిని ట్యాగ్ చేస్తూ ఇస్కాన్ ఇంటర్నేషనల్ ట్వీట్ చేసింది.

కృష్ణదాస్‌పై మోపిన అభియోగాలు అవమానకరమైనవని, ఆధారరహితమైన వంటూ ఇస్కాన్, బాంగ్లాదేశీ హిందువులు బలంగా తిరస్కరించారు. ఇస్కాన్ నాయకుడి భద్రత, జీవితం పట్ల భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులు ఆందోళనతో ఉన్నారు. ఒక ప్రాంతీయ శక్తిగా, హిందువులకున్న ఏకైక ఆశ్రయంగా వారి హక్కులను కాపాడవలసిన నైతిక బాధ్యత ఉందని కొందరు విశ్లేషకులు డిమాండ్ చేస్తున్నారు. ఒకవేళ చర్య తీసుకోకపోతే, హిందూ వ్యతిరేక శక్తులకు ధైర్యమిచ్చినవ్వడమే కాదు, ఒక ప్రమాదకరమైన సంప్రదాయాన్ని స్థాపించినట్టు అవుతుందని అంటున్నారు.

న్యాయం కోరుతూ బాంగ్లాదేశ్‌లోనే కాదు భారత్‌లో కూడా కొన్ని ప్రాంతాల్లో వీధుల్లోకి వచ్చారు. చిన్మొయ్‌ను తక్షణమే విడుదల చేయాలన్న పిలుపుతో ప్రధాన నగరాలలో నిరసన ప్రదర్శనలు, ర్యాలీలు జరిగాయి. వివిధ దేశాలలోని హిందూ సంతతికి చెందిన ప్రముఖులు కూడా విషయాన్ని పట్టి చూపుతూ, బాంగ్లాదేశ్‌ను జవాబుదారి చేయాలని అంతర్జాతీయ సమాజాన్ని కోరుతున్నారు.

ఈ క్రమంలోనే బాంగ్లాదేశ్ రచయిత్రి ఇటువంటి విషయాలనే తన రచనల ద్వారా వెలుగులోకి తెచ్చి, అంతిమంగా అక్కడ ఇస్లామిక్ నాయకుల ఆగ్రహానికి గురై భారత్‌లో తలదాచుకుంటున్న తస్లీమా నస్రీన్ హిందువులు ఎంత శాంతియుతమైనవారో తన ట్వీట్ ద్వారా ప్రపంచానికి తెలిపారు. 'యూనస్ ప్రభుత్వం ఇస్కాన్ నాయకుడు చిన్మొయ్ కృష్ణదాస్'ను ఢాకా విమానాశ్రయంలో అరెస్టు చేసింది. ఆయన నాయకత్వంలో హిందువులు చిట్టగాంగ్, రంగ్‌పూర్‌లలో రెండు ర్యాలీలు విజయవంతంగా నిర్వహించారు. వారు ఆ పని ఎంతో శాంతియుతంగా చేయడమే కాదు, ఎటువంటి హింసాత్మక చర్యలకూ పాల్పడలేదు. అటువంటప్పుడు ఆయనను ఎందుకు అరెస్టు చేశారు. హిందువులు జాగృతం కావడాన్ని చూడడం సంతోషంగా అనిపించడం లేదా? యూనస్ ప్రభుత్వం హిందువుల 8 పాయింట్ డిమాండ్లను విస్మరించడమే కాదు, వారిని అణచివేసేందుకు నిరంతరంగా జిహాదీలను, సైన్యాన్ని, పోలీసులను ఉపయోగిస్తోంది' అంటూ ఆమె ప్రపంచానికి వాస్తవాన్ని విప్పి చెప్పారు.

కృష్ణదాస్ అరెస్టు ఒక ఆధ్యాత్మిక నాయకుడిపై జరిగిన దాడి మాత్రమే కాదు, బాంగ్లాదేశ్‌లోని బాహుళ్యవాదపు అల్లికపై కూడా దాడే. ఈ క్రమంలోనే ఇస్లామిస్టులు పాల్పడుతున్న అకృత్యాలకు సంబంధించిన వీడియోలు, విమర్శలతో సోషల్ మీడియా నిండిపోతోంది. ఈ ఘటన జరిగిన అనంతరం, భారత అనుకూల వైఖరి తీసుకుని, హిందువులపై జరుగుతున్న దాడుల గురించి వార్తలను అందిస్తున్న ప్రథొమ అలో అనే దినపత్రిక ఎదుట ఇస్లామిస్టులు ఒక గోమాతను బలి ఇచ్చారు. ఇటువంటి వీడియోలను చూసిన తర్వాత కూడా బాంగ్లాదేశ్‌లోని వాస్తవ పరిస్థితిని ప్రపంచం విస్మరించలేదు. బాంగ్లాదేశ్‌లో నిర్లక్ష్యానికి, దాడులకే కాదు, నోరుమూయించిన హిందువుల పరిస్థితిని కృష్ణదాస్ అరెస్టు అద్దం పడుతోంది.

ఈ నేపథ్యంలో భారత్ మౌనంగా ఉండటం ఎంత వరకూ సమంజసం? అలా అని ప్రత్యక్షంగా చర్యలుచేపడితే, ఆ సాకుతో భారత్‌పై ఆంక్షలు విధించేందుకు పాశ్చాత్య దేశంలోని ప్రతికూలురు సిద్ధంగా ఉన్నారు. అలా అని మౌనంగా ఉంటే, భారత్ ఒక బలహీనమైన, స్వార్థపూరిత దేశంగా కనిపించే అవకాశం ఉంది. కనుక, ప్రధాని కేవలం చిన్మొయ్ కోసమే కాక, భారతే తమ చివరి ఆశ అన్నట్టుగా ఎదురు చూస్తున్న లక్షలాది బాంగ్లా హిందువుల కోసం కలుగచేసుకోవాలి. ప్రపంచం ఉత్కంఠతో భారత్‌వైపు చూస్తున్నది. పక్కలో బల్లెంలా మరొక ముస్లిం మెజారిటీ దేశం అవతరించేందుకు వీలుగా మరొక అకృత్యాల పర్వాన్ని అనుమతిస్తుందా, కలుగజేసుకుంటుందా? అన్నవి వారి మనసుల్లో మెదులుతున్న ప్రశ్నలు.

– జాగృతి డెస్క్

## కథ

అది పచ్చదనం కోల్పోయిన అడవి ప్రదేశం. ఒక మోడువారిన చెట్టువెనుక, పొదలమాటున, జుట్టు విరబోసుకున్న ఒక స్త్రీ ఆకారం గోచరిస్తుంది. నిరాశా నిస్పృహలు ఆవరించి ఉన్న ఆమె ముఖం, మేఘావృత చంద్రబింబంలా దర్శనమిస్తుంది.

"కాలపురుషుని కమనీయ కావ్యగానంలా సాగిన నా గతవైభవమంతా ఏమైపోయిందో!! నేటి కాలానికి కలిపురుషుని వికృతగానంలా, ఈ స్థితికి దిగజారింది. ఆ వైభవాన్ని తిరిగి పొందగలనో, లేదో" అనుకుంటూ, తనలో తనే కుమిలిపోతూ ఉంది.

అదేసమయానికి ఒక యువకుడు ఆ దారినే వస్తున్నాడు. అతని మనసులో ఒకటే ఆందోళన, 'రేపటిలోగా తను ఉద్యోగం సంపాదించుకోలేకపోతే, ఇక తను ఉద్యోగానికి దరఖాస్తు పెట్టుకునే అర్హతను కోల్పోతాడు. తరువాత తన పరిస్థితి ఏమిటి? ఎలా బతకాలి?

వ్యవసాయం చేసుకుందామంటే... అడుగు భూమి లేదు. వ్యాపారం చేసుకుందామంటే...చేతిలో చిల్లిగవ్వ లేదు. ఏదైనా బరువు పనులు చేసుకు బతుకుదామనుకుంట.. శారీరక బలం లేదు. ఏ కలవారినో స్తుతిస్తూ బతికేద్దామనుకుంటే మనస్సాక్షికి విరుద్ధంగా నడవలేను. "అమ్మా! సరస్వతీదేవీ! నీ చల్లని చూపుతో విద్యను ప్రసాదించావు. అలాగే కాస్తంత ధనాన్ని ప్రసాదించమని, మీ అత్తగారికి చెప్పవమ్మా!'' అని మదిలో వేడుకుంటూ, యాదృచ్ఛికంగా ఆ స్త్రీమూర్తిని గమనించాడు.

అతనొకింత భయపడుతూ, ''ఈ నిశీధి సమయంలో, ఈ నిర్జనారణ్యంలో, ఒక స్త్రీమూర్తి కదలికలా? ఇది శాఖినీ ఢాకినీ లాంటి ఏ పిశాచాల నివాసమో కాదు గదా !'' అనుకొంటూ, ఆ పరిసరాలన్నీ మరొకమారు పరిశీలించి, పక పక నవ్వుకుని, ''మా జనారణ్యంలో తిరిగే వింత క్రూరమృగాలకన్నా ఈ భూత ప్రేత పిశాచాలు ఏమంత భయంకరమైనవి కావులే!'' అనుకుంటూ కొంచెం దగ్గరకు వెళ్లగా, ఆ స్త్రీమూర్తి భయపడి బిత్తరచూపులు చూసింది

"ఊ! మనిషిలాగే ఉంది." అనుకుని మరి కొంత దగ్గరకు వెళ్లి, ''అవ్వా! ఓ అవ్వా!'' అంటూ పలకరించాడు. అది విని, ఆమె మరింత భయంతో చూస్తూ, "ఏమిటీ?" అంటూ ప్రశ్నించింది.

''ఈ అడవిలో ఇక్కడ ఒంటరిగా ఏం చేస్తున్నావ్?" అంటూ ప్రశ్నించాడతడు.

"దొంగలకు భయపడి దాక్కున్నా! కొంపదీసి నువ్వుకూడా దొంగవేనా?" భయంతో అడిగిందావిడ.

అది విని ఫకాలున నవ్వి, "ఏమిటవ్వా? ఏదో ముసలిదానివని జాలిపడి పలకరిస్తే, నన్నే దొంగవా? అని అడుగుతున్నావే! నేనెవరనుకుంటున్నావ్? ఎమ్.ఏ. యూనివర్శిటీ ఫస్టు, గోల్డ్ మెడలిస్టు." అని గర్వంగా చెప్పుకున్నాడు.


"ఆహా! గొప్పచదువే! నీకన్నా గొప్పగొప్ప చదువులు చదివిన వాళ్లే బందిపోటు దొంగలకన్నా, భయంకరంగా దోచుకున్నారు." వ్యంగ్యంగా అన్నదామె,

"అవునా? నిజమా? నీ రూపురేఖలకీ, నీ మాటలకీ ఏమైనా పొంతన కుదురుతుందా? దోచుకున్నారంట... దోచుకున్నారు. అంత కక్కుర్తితో నిన్ను దోచుకునేదెవరు?"

"ఇంకెవ్వరూ? నా బిడ్డలే!" అని అటూ ఇటూ భయంతో చూసింది.

అది విని ''అసలేంటవ్వా నీయెవ్వారం? దొంగలంటావ్, బిడ్డలంటావ్. దోచుకున్నారంటావ్. ఎవరైనా నమ్మే మాటలేనా ఇవి? అయినా నీ దగ్గరేముందని దోచుకోటానికి? కొంపతీసి, పొలం పుట్రా, నగా నట్రా, కొంపాగోడూ అమ్మేసి, నిధి నిక్షేపాలుగా మార్చేసి, ఇక్కడ భూమిలో పాతేసి, కాపలాకాస్తున్నావా, ఏమిటి?" వేళాకోళానికి నేనే దొరికానా నీకు?" అంటూ నవ్వాడా యువకుడు.

"అవునులే నాయనా! నా రూపు రేఖలు చూసి, నువ్వలా అనుకోవటంలో తప్పులేదు! నేనెవ్వరో తెలిస్తే, నువ్విలా మాట్లాడవ్. నిన్నుదోచేదెవ్వరు? నిన్నుదోచేదెవ్వరు? అంటూ అదేపనిగ ఎగతాళి చేస్తున్నావే! ఒక్కరూ ఇద్దరూ కాదు కొన్ని వేలమంది దోచారు. గజనీలు, ఘోరీలు, కీచులు, ఆంగ్లేయులు ఫ్రాంచీలు, దూతలు, యాత్రికులు...ఇలా ఎందరో. ఎన్నోరకాలుగా నన్ను దోచుకున్నారు. నా బిడ్డల భవిష్యత్తేమిటో, ఎలా బతుకుతారో అని ఆనాడు గుండెలు పగిలేలా ఏడ్చాను.



# భారతమాత

## గోగినేని రత్నాకరరావు

అటువంటి బిడ్డలే ఈనాడు విచ్చలవిడిగా ఎవరికి తోచినట్లు వారు నన్ను దోచుకుంటున్నారు. ఇక నేనెవరి భవిష్యత్తు కోసం బాధపడాలి నాయనా?" అంటూ విలపించిందావిడ.

అప్పటి వరకు ఆమె మాటలు వింటూ నిశ్చేష్టుడై నిలబడిన ఆ యువకుడు ఆశ్చర్యంతో ఆమెను చూస్తూ, "అమ్మా! నువ్వు, నా తల్లివా? ఏమిటమ్మా నువ్వనేది? నువ్వు నా తల్లి భరతమాతవా? నువ్వు కనిపిస్తే, ఏదేదో అడగాలనుకున్నాను. మరేదేదో చేయాలనుకున్నాను. కానీ, నువ్వేమిటమ్మా! ఇలా చిక్కి శల్యమై, హృదయ విదారకంగా దర్శనమిచ్చావ్. భూతల స్వర్గమని పేరుపొంది, అఖిల ప్రపంచానికే పూజ్యురాలవై, సకల శక్తిసంపన్నురాలవై, ప్రస్తుతించటానికి కూడ భాష దొరకని ఘనతను సంపాదించావే! అటువంటి నీకు ఈ దుస్థితి ఏమిటమ్మా? చూస్తుంటేనే గుండె బద్దలవుతుంది కదమ్మా!" అని పరిపరివిధాల బాధపడ్డాడు.

"నేనేం చేయగలను నాయనా? ఇది నీ సోదరుల స్వార్థానికి, దోపిడీకి పరాకాష్ఠ. ఎన్ని సంపదలు దోచారు? హరిత సంపదలను, ఖనిజ సంపదలను జలసంపదలను దోచారు. కక్కసుదొడ్లకు బంగారు రతనాలు తాపడం చేయించుకున్నారు. కొన్ని సహస్రాబ్దాల వరకు తరగని భావితరాలు అనుభవించ వలసిన నా వనరులన్నీ దోచుకుని, కాగితాల కట్టలుగా, బంగారు ముద్దలుగా మార్చుకుని, కోటానుకోట్లు పరదేశ బ్యాంకులలో దాచుకున్నారు. నాగోడు ఎవరికీ చెప్పుకోలేక, చెప్పుకున్నా వినేవారు లేక, బిడ్డల ఎదకుమ్ములనుకుని సరిపెట్టుకుంటూ, భయంనీడలో బాధతో ఇలా బతుకుతున్నాను. ఆనాటి విదేశీయులు గొర్రె పడుకున్న చోట రాలిన వెంట్రుకలే దోచుకున్నారు. వాళ్లే దొంగలైతే, గొర్రెనే దొంగిలించి, పుట్టినింటి వాసాలు లెక్కపెట్టే ఇటువంటి ఇంటిదొంగలను ఏమని పిలవాలి? వారినేం చేయాలి? నిర్దాక్షిణ్యంగా ఉరితీయవద్దా?" అంటూ వాపోయిందావిడ!

మరికొంత సేపటికి తనే, "చూశావా నాయనా! నా బిడ్డల దోపిడితో 'రత్నగర్భ' అనే బిరుదానికి అనర్హురాలినయ్యాను. విచక్షణాజ్ఞానం కూడ మరచి కన్నబిడ్డలనే 'ఉరితీయాలి' అనేంతటి కాఠిన్యాన్ని ప్రదర్శించి 'కరుణగర్భ' అనే బిరుదానికి కూడా అనర్హురాలనయ్యాను. ఇటువంటి బిడ్డలను కన్నపాపానికి ఇంకెన్ని అవమానాలు భరించవలసి వస్తుందో. పిపీలికాది బ్రహ్మాండ పర్యంతానికి సృష్టికర్తవైన ఓ అదృశ్యశక్తి దేవతా! నన్ను కడలిగర్భంలో కలిపెయ్. లేకుంటే ఒక అస్తోకమైన విస్ఫోటనంతో విశ్వ విశ్వాంతరాళాల్లోకి విసిరి, ఈ ప్రపంచానికి సన్ను కనుమరుగుచెయ్." అని దీనంగా విలపిస్తుండగా, ఆ యువకుడు. దగ్గరకు వెళ్లి "అమ్మా!" అంటూ ఓదార్చే ప్రయత్నం చేశాడు.

అదిచూసి, "ఆగు! అక్కడే ఆగు! నా వద్దకు రాకు." అని శాసించినంత పనిచేసింది ఆమె.

అతడు అక్కడే ఆగిపోయి, "ఏమ్మా! నిన్ను ఓదార్చే అర్హత కూడ నాకు లేదా?" అంటూ దీనంగా ఆమెను ప్రశ్నించాడు.

ఆమె విలపిస్తూ "లేదు నాయనా లేదు. నేను వివస్త్రను. ఆ దుర్మార్గులు చివరకు నావంటిపైన వస్త్రాన్ని కూడ దొంగిలించారు నాయనా" చెప్పలేక చెప్పలేక యువకుడితో చెప్పిందావిడ.



ఆ మాటలు విని నిర్ఘాంతపోయాడా యువకుడు. "అమ్మా! అమ్మా!" అంటూ విలపించి "నేను నీ తనయుడినమ్మా!" అన్నాడు. ఆమె వ్యంగ్యంగా నవ్వి, "నాకీయవస్థ కలిగించింది కూడ నీలాంటి తనయులేనయ్యా! పైగా బహిర్గత ఉపస్థముగా తనయుడి ముందుకైనా రావటం నా సంస్కృతీ సంప్రదాయాలకే విరుద్ధం." అంటూ నిష్కర్షగా చెప్పింది.

వెంటనే అతను తనపై వస్త్రాన్ని ఆమెపై విసిరివేశాడు. ఆమె అందుకుని ఒంటిపై కప్పుకుంది. "నేను దానిని కేవలం ఉవస్త్రముగానే భావించలేనమ్మా! నవరత్న ఖచితమైన బంగారు ఆభరణాలతో, శుభసూచకమైన తోరణాలతో విలసిల్లుతూ, పదునలుగురు మనువులు, షట్చక్రవర్తులు, సప్తరుషులు మొదలైన మహాపురుషులు దివి నుండి భువికి దిగివచ్చిన ద్వారరాజంలా నాకది భావన కల్గిస్తుందమ్మా! దశదిశల సాక్షిగా ఇది యథార్థం. నీ భయం, సందేహం విడచి పెట్టి, నాకు నీ దర్శనభాగ్యం కలిగించి, నిన్ను కాపాడుకునే మార్గం తెలిపి, నిన్నుద్ధరించే అదృష్టాన్ని నాకు ప్రసాదించు తల్లీ!" అంటూ మోకరిల్లి వేడుకున్నాడు.

అతని మాటలువిని, సంభ్రమాశ్చర్యానందాలతో ఉప్పొంగిపోతూ, అతనిని సమీపించి ప్రేమతో అతని

మూర్ధాన్ని చుంబించి, పరవశించిపోతూ, “ఎంత కాలానికి నా బిడ్డలలో నీలాంటి ఉత్తముణ్ణి చూడగలిగాను. నిన్ను చూస్తుంటే, కోల్పోయిన నా గతవైభవాన్ని తిరిగి పొందగలనన్న ధైర్యం కలుగుతుంది. వోడువారిన నాలో ఆశలు చిగురిస్తున్నాయి. ఆ అదృష్టాన్ని నాకు కలిగించు. నిన్నూ, నీ భావితరాలను కళ్లలో పెట్టుకుని కాపాడుకుంటాను. పదికాలాల పాటు నా వైభవాన్ని ప్రపంచానికి చాటుకుంటాను. నన్ను గేలిచేసిన ఈ ప్రపంచంచేతే అగ్రపీఠాన్ని వేయించుకుని దానిపై అధిష్టించి శాసిస్తాను. అంటూ అప్యాయంగా అతనిచేతులు తన చెక్కిళ్లకు చేర్చుకుని మురిసిపోయింది.

అదివిని, ఆ యువకుడు “అలా వేడుకుంటా వేమమ్మా! దానికి సరైన మార్గాన్ని బోధించి నన్ను అజ్ఞాపించమ్మా! శక్తివంచన లేకుండా ప్రయత్నం చేస్తానమ్మా!” అంటూ చేతులు జోడించాడు.

మరుక్షణం... ఆ ప్రదేశమంతా, మెరుపులతో ధగద్ధగాయమానంగా ప్రకాశించింది. ఆ వెలుగులో ఒక దివ్యపురుషరూపం యువకుడికి సాక్షాత్కరించింది. ఆ రూపాన్ని ఆశ్చర్యంగా చూస్తూ, “మహాత్మా! తమరెవరు? తాపసులా, లేక దేవతలా?” అంటూ, వినయంగా అడిగాడు.

ఆ దివ్యపురుషుడు, ఒక చిరునవ్వు నవ్వి, “ప్రభవించినది మొదలు ఈ అనంత విశ్వ పరిణామాలను అనుక్షణం గమనిస్తున్న కాలపురుషుణ్ణి. కోతిదశ నుండి కుజగ్రహానికి పయనించగల మేధావులుగా ఎదిగిన మీ మానవులను చూసి నవ్వాలో, ఆ క్రమంలో తమ ముప్పు తామే కొని తెచ్చుకుంటున్న వారి అమాయికత్వానికి జాలిపడాలో తెలియని అయోమయ స్థితిలో కొట్టు మిట్టాడుతున్న సందేహ జీవిని. వీటన్నిటినీ మించి పరిపూర్ణ

ప్రపంచ మేధావు మన్ననులు అందుకున్న ఆ తల్లి మానసిక సౌందర్యాన్నీ, శక్తి, జ్ఞాన, సుగుణ సంపదలను కళ్లారా చూసి తరించిన ధన్యుణ్ణి. అంతటి మహర్దశ నుండి నేటి ఈ దుర్దశకు దిగజారిపోతున్నా, చూస్తూ. ఏమీ చేయలేని దురదృష్టవంతుణ్ణి.” అంటూ వాపోయాడు.



నాగరికతతో, దినదిన ప్రవర్ధమానమై సరికొత్త అందాలను సంతరించుకుని, ప్రపంచ సుందరిగా వెలుగొందిన నీ తల్లి భారతిని చూచి పుత్రికావాత్సల్యంతో మేను పులకరించిన అదృష్టవంతుణ్ణి. ప్రపంచ మేధావు మన్ననులు అందుకున్న ఆ తల్లి మానసిక సౌందర్యాన్నీ, శక్తి, జ్ఞాన, సుగుణ సంపదలను కళ్లారా చూసి తరించిన ధన్యుణ్ణి. అంతటి మహర్దశ నుండి నేటి ఈ దుర్దశకు దిగజారి పోతున్నా, చూస్తూ. ఏమీ చేయలేని దురదృష్టవంతుణ్ణి.” అంటూ వాపోయాడు.

అదివిని, “అంతటి మహర్దశ నుండి ఇంత దుర్దశకు ఎలా దిగజారింది స్వామీ? అని దీనంగా అడిగాడా యువకుడు.

“అదంతా మీ స్వయంకృతాపరాధమే! ఆ పరిస్థితి ఒక్కసారిగా వచ్చింది కాదు. కొన్ని శతాబ్దాలుగా జరిగిన మారణహోమం. మీ మానవులు తొలినాళ్లలో ప్రతికూల పరిస్థితులను అధిగమించటానికి కొన్ని రుతువులకు సరిపడా, ధనధాన్య సంపదలు కూడబెట్టుకునే విధానాన్నిన్న అనుసరించారు. క్రమక్రమంగా దాని పరిధిని పెంచుకుంటూ, తరతరాలకు కూడబెట్టుకునే స్వార్థజీవులుగా మారిపోయారు. ఆ స్వార్థ ప్రవాహంలో సాంఘిక సదాచార ధర్మశాస్త్రాలు కొట్టుకొనిపోయాయి. వాటిని బోధించే గురువులు కనుమరుగయ్యారు. పాలకులలోనూ, పాలితులలోనూ అనైతికత పెరిగిపోయింది. పాపభీతి నశించిపోయింది. ఫలితంగా, పాడిగోపు లాంటి భారతీయ పరిపాలనా వ్యవస్థ వర్తకం పేరుతో వచ్చిన విదేశీయులు హస్తగతమైంది. వారు కొన్ని శతాబ్దాలపాటు మీ సంపదనంతా పిండుకున్నారు. ఆ సమయంలోనే, విదేశీయుల దోపిడీకి స్వదేశీ స్వార్థశక్తులు తోడయ్యాయి. ఈ రెండు లక్షణాలను పుణికి పుచ్చుకున్న అతి ప్రమాదకరమైన మరో సంకరజాతి దేశంలో పుట్టుకొచ్చింది. ప్రస్తుత సర్వసత్తాక స్వతంత్ర భారతంలో అధిక భాగాన్ని ఆ సంకరజాతే పరిపాలిస్తుంది. సగటు మంచి మనిషి ఉనికిని కూడ ప్రశ్నార్థకం చేస్తూ, నడిబజారులో నగ్నంగా నిలబెడుతుంది.”

“అయితే, ఈ ప్రమాదంనుండి నా తల్లిని కాపాడుకునే మార్గమే లేదా స్వామీ?”

“ఉంది.”

“ఉంటే కర్తవ్యాన్ని బోధించండి స్వామీ!”

“ఏ సమాజమైనా, ఆరోగ్యకరంగా ఉండాలంటే, ముందు సమాజంలో వ్యక్తులమధ్య ఆరోగ్యకరమైన సాంఘిక సయోధ్య కుదరాలి. ఆ సయోధ్యకు మూలాలు మనుషుల అంతరంగాలలో ఉండాలి. ఆ అంతరంగాలు విన్నతనం నుండి సమాజ శ్రేయస్సు కోసం పరితపించే లక్షణం కలిగి ఉండాలి. ఆ లక్షణం తల్లిదండ్రుల, గురువుల, ఇతర సామాజిక సంబంధీకుల నుంచి పొందగలిగి ఉండాలి. మనిషి జీవితచరిత్రలో ఈ ‘అనవద్యశీలత’ అనే లక్షణం అనుక్షణం పరిభ్రవిస్తూనే ఉండాలి. వ్యక్తి ఒంటరిగా ఉన్నంతవరకు ఇటువంటి కార్యాలను సాధించటం కష్టమే. కానీ, మీ దేశంలో ఎందరో యువకులు, వృద్ధులు, అధికారులు, మేధావులు, నేతలు.... జరుగుతున్న దుష్పరిణామాలకు తమలో రగులుతున్న ఆవేశమనేనిప్పును సంస్కారం, శాంతిమార్గం, సంప్రదాయం, చట్టం, న్యాయం, భయం, నిర్లక్ష్యం అనే ఇన్నిరకాల నివురుతో కప్పి అంతరాంతరాల్లో దహించుకుపోతున్నారు. వారందరినీ సంఘటితపరచి స్వర్గతుల్యమైన నవయుగావతరణకు అనుకూల పరిస్థితులు కల్పించాలి. మీ దేశానికి కులమత ప్రాంత విభేదాలు చూపని, అందరికీ ఒకేరకమైన సాంఘిక ధర్మశాస్త్రాలు, అతివేగవంతంగా,



అత్యవసరంగా కావాలి. ఎన్నో వేల సంవత్సరాల నుంచి అటువంటి వందల వేల ధర్మశాస్త్రాలు మీకున్నా అవి స్వార్థపరుల చేతులలో పడి మూలాలు కోల్పోయాయి. వాటిని సమీకరించి, హేతువాద దృష్టితో పరిశీలించి, సభ్యసమాజం వేలెత్తి చూపలేని విధంగా, సరికొత్త సాంఘిక ధర్మశాస్త్రాలను సృష్టించుకుని, ఆ ధర్మశాస్త్రాల పునాదులపైన నవభారత సౌధ నిర్మాణాన్ని చేపట్టాలి. ఒకవంక సమాజంలో కుళ్లును ప్రక్షాళనం చేస్తూ, మరోవంక ఆ స్థానంలో సకల గుణ సంపదలతో అలరారే సరికొత్త తరాలకు ఊపిరులు పోయాలి. ఇదంతా ఒక మహాయజ్ఞంలా నిరంతరం కొనసాగుతుండాలి. ఇవి చూడటానికి చాలా చిన్న విషయాలుగా కనిపించవచ్చు, కానీ, ఇటువంటి చిన్న విషయాలే, భావిభారత సౌధ నిర్మాణానికి ఊతమిచ్చే మూలస్తంభాలు,

అందుకే జాతి ఉద్భవానికి తల్లిగర్భంలో బీజం పడినప్పటి నుండి ఒక మహోన్నత వ్యక్తిగా రూపుదిద్దుకునే వరకు జీవనయానంలో ఆ వ్యక్తి చేసే మజిలీలను నైతిక విలువలతో కూడిన సంస్కారంతో నింపి ఉంచాలి. వీటి కన్నా అతి చిన్నగా కనిపించే విషయాలు మరికొన్ని ఉన్నాయి.

స్త్రీ గర్భాన్ని ధరించినది మొదలు బలవర్ధకమైన సత్వగుణాన్నిచ్చే ఆహారాన్ని సరైన సమయంలో తినిపించాలి. ధరించే వస్త్రాలు, నిద్రించే పడకలు మృదువైనవిగా ఉండాలి. భయంకర దృశ్యాలకు, శబ్దాలకు దూరంగా ఆహ్లాదకరమైన చల్లని గాలి వీచే వనసదనాలలో ఉంచాలి. ధర్మార్థకామమోక్షాలకు సంబంధించిన మహోన్నత ధర్మాలను, మహాపురుషుల చరిత్రలను, యుక్తమైన విద్యలను బోధిస్తూ ప్రసవ సమయం వరకు కాపాడాలి. మానవుడు తల్లిగర్భంలో పిండరూపంలో ఉన్నా.. బయట జరిగే విషయాలను గ్రహించి తన మస్తిష్కంలో పదిల పరచుకుంటాడనేది పచ్చి వాస్తవం. అర్జునుడు సుభద్రకు చెప్పిన పద్మవ్యూహ విచ్ఛేదనాన్ని అభిమన్యుడు గ్రహించగల గటమే అందుకు తార్కాణం.

ఆ తర్వాత బాలలకు ఐదేండ్ల ప్రాయం వచ్చేవరకు, స్వంత ఇల్లే తొలి విద్యాలయం. తల్లితండ్రులు, అవ్వతాతలు, బంధువులు, అతనికి తారసపడేవ్యక్తులు అందరూ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఒకవిధంగా గురువులతో సమానమే. కనుక వారిమాటలు, చేతలు అన్నీ మంచితనంతోనే ముడిపడి ఉండాలి. అక్కడే మనిషి వ్యక్తిత్వానికి తొలి పునాదులు పడతాయి. అప్పుడే చదివే చదువులకు శిశువుల హృదయాలు మంచి వేదికలుగా రూపు దిద్దుకుంటాయి.

ఐదేళ్ల తర్వాత అక్షరాభ్యాసం, మహాపురుషుల చరిత్రలు, ధర్మశాస్త్రాల ధారణ, వ్యాయామకర్మల పాటవం, ఆ తర్వాత పిల్లల ఆసక్తిని గమనించి బతుకు తెరువుకు కావలసిన విద్య సామాజికంగా అతను నిర్వర్తించవలసి బాధ్యతా విధానాలు గురువులు తగురీతిలో నేర్పాలి. అప్పుడే బాలబాలికలు మంచి పౌరులుగా మారి, భారత కీర్తిపతాకను ఆకాశ వీధులలో రెపరెప లాడించగలరు. ఈ విషయాలు నీకు నేను కొత్తగా చెప్పేవికావు. మీ పూర్వులు మీకందించినవే. ప్రపంచ దేశాలలో ఎక్కడా కనిపించని ఈ మానవ సంస్కరణ విధానమే ఒకనాడు మీ తల్లికి ప్రపంచ అగ్రాసనాధిపత్యాన్ని కట్టబెట్టింది.

మరొక విషయం..శారీరక పోషణకు రైతులు, మానసిక వికాసానికి గురువులు, ఆరోగ్య సంరక్షణకు వైద్యులు, ధర్మపరిరక్షణకు న్యాయకోవిదులు తమతమ బాధ్యతలు నిర్వహిస్తూ నాలుగుస్తంభాలై సామాజిక భారాన్ని మోసేలా నాయకులు వారిని అనుక్షణం గమనిస్తూ, సంఘానుకూలంచేస్తూ, ఎప్పటికప్పుడు ప్రజలకు అలంబనగా నిలవాలి.

తరువాత కవులు, రచయితలు, మేధావులు, వారి రచనలు, కళాకృతులు, కళాకారులు మాధ్యమాలు అనే అంశాలు సమాజాన్ని ప్రగతిపథంలో నడిపించ గలవు, పాతాళానికి తొక్కివేయనూగలవు. ఈ విషయాలలో నైతికతకు ప్రాముఖ్యమిచ్చి ఎప్పటికప్పుడు నేతలు జాగ్రత్త వహించాలి. ఏ ఒక్కరో ఇద్దరో తప్పితే పూర్వకాలంలో పాలకులు ఈ విషయాలలో జాగ్రత్త వహించారు. కనుకనే నీ తల్లి భరతమాతకు అటువంటి పేరు ప్రఖ్యాతులు లభించాయి.

అది విని ఆరాధనా భావంతో "అమ్మా" అంటూ వెనుదిరిగి చూడగా, అవిడ కనిపించదు. అయోమయంగా చూస్తూ, "మహాత్మా! ఏదీ, నా తల్లి భారతి?" అంటూ నలుదిక్కులు పరిశీలించాడా యువకుడు.

అతని మాటలకు ఆ దివ్యపురుషుడు నవ్వి, "చిరంజీవీ! ఇది నీ స్వప్నలోకం. వాస్తవానికి నేనుకానీ, నీ తల్లి భారతికానీ నిరాకారులం, నిర్వికారులం. కేవలం నీ మాతృమూర్తి లాంటి జన్మభూమి కోసం నువ్వుపడే తపనలో నుండి నీ స్వప్న లోకంలో ఉద్భవించిన ఊహారూపాలం. నీ అంతరంగంలో చెలరేగిన భావ తరంగాల సంఘర్షణలో నుంచి బయటకు వచ్చిన తుది రూపమే, నేను నీకు బోధించిన కర్తవ్యం. ఇది నీ చేతనాన్ని నువ్వు సమర్థించుకోటానికి, నీ ఆలోచనలు సరైనవేనని సంతృప్తి పరచుకోవటానికి నువ్వు కోరుకున్న విధానం. అందుకే మా ఈ రూపాల స్వప్నసాక్షాత్కారం. సంకల్పబలంతో సాగిపో! విజయం సాధించు!

విజయోస్తు! విజయోస్తు! విజయోస్తు! జైహింద్

వచ్చేవారం కథ..

**మనసు పరిధి**


– రేణుక జలదంకి



## ప్రత్యేక సంచికపై అభినందన లేఖ

'దేశమే దేవాలయం' అనే అంశంతో జాగృతి ప్రత్యేక సంచికను తీసుక రావడం అభినందనీయం. సంచికలోని ప్రతి పేజీ అపూర్వం, అద్వితీయం, అజరామరం. ఈ ప్రత్యేక సంచిక ప్రతి తెలుగు ఇంటిలో ఉండవలసిందేననటంలో ఎలాంటి సందేహం లేదు. సంపాదకీయంలో రాసినట్లుగానే అడుగడుగున గుడి ఉంది. అందరిలో గుడి ఉంది. ఈ రీతిన దేవాలయాల పాత్రను చాలా హృద్యంగా ఉదాత్తంగా వర్ణించారు.

ప్రతి గ్రామంలో విద్యాలయం – వైద్యాలయం,




గ్రంథాలయం – దేవాలయం ఉండాలని చెప్పటం ఎంత చక్కటి భావన. నిజంగానే ఆలయం భారతీయ ఆత్మ. సంచికలో పేర్కొన్నట్లుగా ఒక్క అయోధ్య ఒక్క భద్రాచలం మాత్రమే రామమయం కాదు. నిజానికి దేశమంతా రామమయమే. ఇంకా చెప్పాలంటే 'శక్తిపీఠాల మహాశక్తి భారత్' భారత్‌లో లోతైన విషయాలు ఎన్నో! దాదాపు ఆరున్నర లక్షల దేవాలయాలు ధూప దీప నైవేద్యాలు అందు కొంటూ చక్కటి సాంస్కృతిక కేంద్రాలుగా విరాజిల్లుతున్నాయి. నిజానికి దేశంలోని దేవాలయాలే జాతి ఉన్నతిని ఆకాశం అంచుల వరకు పెంచింది. దేవాలయాల గోడలన్నీ కూడా చరిత్ర పుటలే. అవన్నీ దాచిన చరిత్ర సంగతులే.

విదేశీ మతోన్మాదులు తొక్కేసిన వాస్తవాలు. ఇంతటి మహత్తర సంచిక నందించిన పత్రిక సంపాదకులకు,డెస్క్ జర్నలిస్ట్‌లకు, యజమాన్యానికి, వ్యాసకర్తలకు అందరికి నా హృదయపూర్వక అక్షరాభినందనలు.


**గులాబీల మల్లారెడ్డి,**
న్యాయవాది, కరీంనగర్
**9440041351**


# చరిత్రలో నిలిచిపోయే గెలుపు

ఏక్ హై తో సేఫ్ హై (ఐక్యంగా ఉంటే క్షేమంగా ఉంటాం) అన్న నినాదం బలం ఏమిటో రుజువైంది. అది కూడా ఉత్తరప్రదేశ్‌లోనే. ఈ నినాదం ఇచ్చిన వారు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్. ఆ ఐక్యత ఎవరి మధ్య? హిందువుల మధ్య. ఒక అభ్యర్థికి మించి ఇద్దరు ఐదుగురు, ఆరుగురు హిందూ అభ్యర్థులు పోటీలో ఉండడం వల్ల ముస్లిం అభ్యర్థి లేదా కమ్యూనిస్టు నెగ్గుతూ ఉంటారు. ఇందుకు పూర్తి విరుద్ధంగా జరిగింది ఇక్కడ. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీలోని 9 స్థానాలకు ఇటీవల ఉప ఎన్నికలు జరిగాయి. అందులో కుందర్కి అనే నియోజక వర్గ ఫలితం బహుశా చరిత్రలో నిలిచిపోయేదే. కుందర్కి ముస్లింలు ఎక్కువగా ఉండే నియోజక వర్గం. పదకొండు మంది ముస్లిం అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఒక్కరే హిందూ అభ్యర్థి. ఆయన గెలిచారు. చరిత్ర సృష్టించిన ఆ అభ్యర్థి పేరు రామ్‌వీర్ ఠాకూర్. సమీప ప్రత్యర్థి, సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థి హాజీ రిజ్వాన్ మీద గెలిచారు. ఈయన ప్రస్తుతం ఎంపి. అయినా అసెంబ్లీకి పోటీ చేశారు. బీజేపీ మెజారిటీ కూడా అరకొరగా లేదు. లక్ష ఓట్ల తేడాతో ఎస్‌పీ అభ్యర్థిని బీజేపీ అభ్యర్థి ఓడించారు. బీజేపీ అభ్యర్థికి 65 శాతం ఓట్లు వచ్చాయి.

యథాప్రకారం ఈ గెలుపు మీద సమాజ్‌వాదీ పార్టీతో పాటు ఇతర విపక్షాలు కూడా కారాలూ మిరియాలూ నూరాయి. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను మాయం చేశారని సమాజ్ వాదీ వెంటనే ఆరోపించింది. అదేం కాదు, ముస్లిం ఓటర్లకు నమ్మకం కలిగించడంలో రామ్‌వీర్ ఠాకూర్ చేసిన ప్రయత్నం ఫలించి ఆయన గెలిచారని బీజేపీ వివరణ ఇచ్చింది. షేక్‌లు నిర్వహించిన పాత్ర ఆయన గెలుపులో కీలకమని మరొక రహస్యం కూడా చెప్పింది. 11 మంది ముస్లిం అభ్యర్థుల మీద బీజేపీ అభ్యర్థి గెలవడం చరిత్రే అయినా విశ్లేషకులు తమవైన కారణాలు చూపిస్తారు. ఈ మలుపు విజయం మీద మసి పూస్తారు. ఈ నియోజకవర్గంలో ముస్లింలు

---

'భారత స్వాతంత్ర్యం కోసం కశ్మీర్ మొదలు కన్యాకుమారి వరకు జరిగిన యుద్ధాలను అధ్యయనం చేస్తే బ్రిటిష్ జాతి ఎంత మూల్యం చెల్లించిందో అవగాహనకు వస్తుంది. ఒక్క పాంచాలన్‌కురిచ్చి 110 రోజుల యుద్ధాలను తీసుకున్నా ఇది అర్థమవుతుంది. 800 పైగా బ్రిటిష్ సైన్యం ఆ యుద్ధాలలో హతమైంది. ఇందులో 49 మంది ఉన్నత సైనికాధికారులు కూడా ఉన్నారు. ఇవన్నీ బ్రిటిష్ మ్యూజియంలో దొరుకుతున్న ఆధారాలే' అంటున్నారు చరిత్రకారుడు పి. సెంథిల్‌కుమార్. పాంచాలన్‌కురిచ్చి యుద్ధాలు చేసిన వీరుడే వీరపాండియ కట్టబొమ్మన్.




పాంచాలన్‌కురిచ్చి వీరుడు, ఈస్టిండియా కంపెనీ సేనలను ముప్పుతిప్పలు పెట్టిన కట్టబొమ్మన్ జీవితంలోని మరుగున పడిన పలు అంశాలతో ఒక కొత్త పుస్తకం వెలువడింది. అంటే కట్టబొమ్మన్‌ను ఉరి తీసిన 223 సంవత్సరాల తరువాత ఈ వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. 'ది బ్యాటిల్స్ ఆఫ్ పాంచాలన్ కురిచ్చి-యాన్ అన్‌ఓపెన్డ్ డైరీ 1792-1801' పేరుతో పి. సెంథిల్‌కుమార్ పుస్తకం రాశారు. ఇటీవలనే తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి ఆవిష్కరించారు. ఈస్టిండియా కంపెనీకి వ్యతిరేకంగా, కట్టబొమ్మన్, ఆయన సోదరులు సాగించిన యుద్ధాలలోని కొత్త వాస్తవాలు ఇందులో పొందుపరిచారు. పాంచాలన్‌కురిచ్చి యుద్ధాలంటే పాలెగాళ్లకూ, కంపెనీకీ మధ్య జరిగిన కీలక ఘర్షణలే. 18వ శతాబ్దం చివర, 19 శతాబ్దం ఆరంభంలోను ఇవి జరిగాయి. కట్టబొమ్మన్ జీవితం ఆధారంగా ప్రచారంలో ఉన్న జానపద కథలను వేరు చేసి వాస్తవ చరిత్రను అందించినట్టు సెంథిల్‌కుమార్ చెప్పారు. రచయిత మద్రాస్ పురా లేఖన భాండాగారం నుంచి

---

# 'సంబాల్ జామా మసీదు


ఉత్తరప్రదేశ్‌లోని సంబాల్ పట్టణం ఒక్కసారిగా వార్తలలోకి వచ్చింది. అక్కడున్న జామా మసీదులో సర్వే నిర్వహించడానికి కోర్టు అనుమతి ఇచ్చినా, నవంబర్ 24న అది జరగకుండా చేయడానికి అల్లరు సృష్టించారు. ముస్లింలు పోలీసుల మీద రాళ్లు రువ్వుతుండగా ఎవరో కాల్పులు జరిపారు. అందులో ముగ్గురు చనిపోయారు. సంబాల్ నడిబొడ్డున ఉన్న జమా మసీదు వాస్తవానికి హరిహర ఆలయమని హిందూ సంఘాలు కొద్దికాలంగా పోరాడుతున్నాయి. కోర్టు ఆదేశాల మేరకు ఇక్కడ అడ్వకేట్ కమిషనర్ సర్వే నిర్వహించారు. నవంబర్ 19న అడ్వకేట్ కమిషనర్ సర్వే నిర్వహించారని తాము భద్రత కల్పించామని సంబాల్ జిల్లా కలెక్టర్ తెలియచేశారు. అప్పటికే సర్వే జరుగుతున్నప్పటికీ 24న పరిస్థితి ఒక్కసారిగా వేడెక్కింది. ముస్లింలు వందలలో అక్కడికి చేరి కాపలా ఉన్న పోలీసుల మీద రాళ్లు రువ్వారు. అల్లర్లకు దిగారు. సర్వేను నిరోధించడమే ధ్యేయంగా ఈ అల్లర్లు జరిగాయి. గుర్తు తెలియని వ్యక్తి జరిపిన కాల్పులలో ఐదుగురు చనిపోయారు. స్థానిక ఎంపీపై, ఆయన కుమారుడిపై కేసు పెట్టారు.

ఇక్కడి హరిహర ఆలయాన్ని 1529లో మొగల్ వంశ స్థాపకుడు బాబర్ కూల్చి వేయించాడని సుప్రీంకోర్టు న్యాయవాది విష్ణుహరిశంకర్ జైన్ తెలియచేశారు. ఇక్కడ కల్కి అవతారిస్తాడని నమ్ముతారని జైన్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. తాము దాఖలు చేసిన పిటిషన్ మేరకు గౌరవ సివిల్ కోర్టు సర్వేకు ఆదేశాలు జారీ చేసిందని జైన్ తెలియచేశారు.సంబాల్ జిల్లా చందౌసి సివిల్ కోర్టులో ఈ కేసు దాఖలైంది. సంబాల్ పట్టణంలోనిదే కేలాదేవి ఆలయానికి చెందిన రిషిరాజ్ గిరి తరఫున ఈ పిటిషన్ దాఖలైంది. జామా మసీదును హరిహర మందిర్‌ను కూల్చి కట్టారని చెప్పడానికి బాబర్ జీవిత చరిత్ర బాబర్ నామాలోనే ఆధారాలు ఉన్నాయని విష్ణుశంకర్‌జైన్ చెప్పారు.

విష్ణుహరిశంకర్ జైన్ తరఫున ఆయన కుమారుడు హరిశంకర్ జైన్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఈ తండ్రీకుమారులు ప్రస్తుతం కృష్ణ జన్మభూమి (మధుర), జ్ఞానవాపి శృంగారగౌరి (వారణాసి) కేసులు సహా ఇలాంటివి 110 వాదిస్తున్నారు. విష్ణుశంకర్‌జైన్ 2010లో బాలాజీ న్యాయ కళాశాల నుంచి పట్టా తీసుకున్నారు. ప్రపంచ ప్రఖ్యాత రామజన్మ వివాదంలో పని చేయడంతో

అధికంగా ఉన్నా షేక్‌లకీ, టర్కులకి మధ్య చీలిక వచ్చిందని అంటున్నారు సదరు పండితులు.

నిజానికి రామ్‌వీర్ గెలుపు ఈ ఒక్క ఎన్నికతో, ఒక్క రోజుతో, ఒక్క వ్యూహంతో సాధ్యమైనది కాదు. ఆయన మూడుసార్లు అక్కడ ఓడిపోయారు. అయినా రెండు దశాబ్దాలుగా ముస్లింల సంక్షేమం కోసం ఎంతో చేశారు. అందరి మనిషి అనిపించుకుని మంచి పేరు తెచ్చుకున్నారు. ఆఖరికి ముస్లింల పండుగలలో వారి టోపీ కూడా పెట్టుకునే వారు. దీనితో షేక్ వర్గం ఆయన వెనుక నిలిచింది. ఇక గడచిన మూడు దఫాలు గెలిచిన హాజీ రిజ్వాన్ (ఎస్‌పీ) మీద అసంతృప్తి తీవ్ర స్థాయిలో ఉంది. ఇతడు టర్క్ వర్గీయుడు. పైగా మధ్యలో ఇతడు ఎన్నికను రద్దు చేయాలని చెప్పడం వివాదాంశంగా మారడమే కాదు, కొందరు వ్యతిరేకులను కూడా తయారు చేసింది. చిత్రం ఏమిటంటే, ఇలా 11 మంది ముస్లింలు అభ్యర్థులుగా ఉన్నప్పటికీ ఒక హిందువు విజయం సాధించడం ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుందో కదా అంటూ వెర్రిమొర్రి ప్రశ్నలు లేవదీస్తున్నారు కొందరు. వాస్తవం వెలికిరావడం, భవిష్యత్తులో మార్గదర్శనం చేయవలసిన అంశం మీద అనుమానాలు రేకెత్తించడం బీజేపీ వ్యతిరేక విశ్లేషకులు చేసే పనే. ఘోరమైన ఉప ఎన్నిక దెబ్బతో కోల్పోయిన స్పృహ తిరిగి వచ్చిన తరువాత సెక్యులర్ పార్టీలు పదకొండు మంది ముస్లింల ఓటమి మీద ఏమంటాయో వినడం కూడా ఆసక్తికరమే.



# కట్టబొమ్మన్ చరిత్ర మీద కొత్త వెలుగు

ఎంతో సమాచారం సేకరించడమే కాకుండా, ఇంగ్లండ్‌లోని బకింగ్‌హ్యామ్ పేలెస్ మ్యూజియం నుంచి వివరాలు తీసుకున్నారు. కట్టబొమ్మన్ ఉపయోగించిన కరవాలం ఇప్పటికీ అక్కడే భద్రపరిచి ఉందని ఈ మ్యూజియం అధికారులు తెలియచేశారు. ఒక్క తమిళనాడు పురా లేఖన భాండాగారంలోనే 1353 పేజీల సమాచారం ఉంది. యుద్ధం జరుగుతున్న కాలంలో రోజువారీ వివరాలతో 11 విభాగాలు చేసి బకింగ్‌హ్యామ్ పేలెస్ మ్యూజియంలో భద్రపరిచారు. 1798. 1799లలో కట్టబొమ్మన్ కంపెనీ అధికారులతో జరిపిన చర్చలు, ఒకటో పాళయం యుద్ధం, 1801లో కట్టబొమ్మన్ ఉరి, కట్టబొమ్మన్ సోదరులు ఊమైతురై, శివతాయి స్థితిగతులు, రెండో పాళయం యుద్ధం గురించి వివరాలు ఉన్నాయి. రెండో పాళయం యుద్ధం ఊమైతురై చేశాడు. పాళయకొట్టం జైలు కూల్చివేత గురించి ఈ పుస్తకంలో వివరించారు.

ఆర్కాట్ నవాబుకూ ఈస్టిండియా కంపెనీకీ మధ్య కుదరిన ఒప్పందం (జూలై 12, 1792)తో బ్రిటిష్ జాతికి పన్ను వసూలు అధికారం వచ్చింది. జిల్లా కలెక్టర్లు పన్ను వసూళ్ల మీద పడ్డారు. అప్పుడే ఈ విధంగా ప్రకటించారు. 'ఇప్పుడు ఈ దేశం మొత్తం మా అధీనంలో ఉంది. ఈ దేశానికి మేమే ప్రభువులం. మాదే ప్రభుత్వం. ప్రభుత్వం ఇచ్చే అన్ని ఆదేశాలను పాలెగాళ్లు పాటించి తీరాలి. ఏ ఒక్క పాలెగాడు సొంత సైన్యాన్ని పోషించకూడదు. పన్ను వసూలు చేయకూడదు.' ఈ ఆదేశాలను కట్టబొమ్మన్ నిరాకరించాడు.

ఈ పుస్తకం తరువాత మరొక పుస్తకం కూడా సెంథిల్‌కుమార్ విడుదల చేయబోతున్నారు. అందులో ఉరి తరువాత కట్టబొమ్మన్ భౌతికకాయం ఏమైంది అన్న విషయం వివరించారు. నిజానికి ఇప్పుడు ఈ వివరాలు, పుస్తకాల అవసరం ఉంది. 1960 ప్రాంతంలో పాలెగాళ్ల మీద, వారిలో ఒకడైన కట్టబొమ్మన్ మీద కావలసినంత దుష్ప్రచారం జరిగింది. కట్టబొమ్మన్ అసలు స్వాతంత్ర్య పోరాట యోధుడు కాదు అన్నది ప్రచారాలలో ఒకటి. అయితే కట్టబొమ్మన్ కోసం యుద్ధం చేసి 5000 మంది చనిపోయారు. అందులో అన్ని వర్గాల వారు ఉన్నారు.

# మొదట ఆలయమే'



ఆయన న్యాయవాది జీవితం ఆరంభమైంది. వివాదాస్పద 1990 నాటి ప్రార్థనా స్థలాల చట్టానికి వ్యతిరేకంగా కూడా ఆయన కేసు వాదిస్తున్నారు.

సంభాల్ జామా విషయానికి వస్తే– బాబర్ పానిపట్టు యుద్ధం గెలిచిన 1526లోనే సంభాల్ అతడి అధీనంలోకి వచ్చింది. ఇదే మొదటి పానిపట్టు యుద్ధం. తరువాత బాబర్ తన కుమారుడు హుమాయూన్‌ను ఈ ప్రాంతానికి గవర్నర్‌ను చేశాడు. ఆ తరువాత హుమాయూన్ తన కుమారుడు అక్బర్‌కు అప్పగించాడు.

అయితే బాబర్ కాలంలోనే ఇక్కడ మసీదు నిర్మాణం ఆరంభమైంది. షాహీ జామా మసీదుగా పిలిచే ఈ కట్టడాన్ని 1528లోనే మీర్ హిందూ బేగ్ నిర్మించాడు. ఇతడు బాబర్‌కూ, హుమాయూన్‌కు కూడా నమ్మినబంటు. ప్రముఖ సైనికాధికారి. బాబర్ ఆదేశంతోనే ఇతడు మసీదు నిర్మాణం ఆరంభించాడని చరిత్ర చెబుతోంది. బాబర్, హుమాయూన్‌ల కాలంలో కట్టిన కట్టడాలలో మిగిలి ఉన్న కొన్నింటిలో ఇది కూడా ఒకటి. మొగలుల మత విధానం మీద పరిశోధన చేసి 1963లో పుస్తకం రాసిన శ్రీరామశర్మ (ఢిల్లీ కాలేజీ ప్రొఫెసర్) బాబర్ ఆదేశాల మేరకే హిందూ బేగ్ హిందూ ఆలయాన్ని మసీదుగా మార్చాడని పేర్కొన్నారు. ★

# రాహుల్ మీద సోనియాగాంధీకి డాక్టర్ల ఫిర్యాదు



భారత రాజ్యాంగాన్ని ధ్వంసం చేయడానికి ఆర్ఎస్ఎస్, బీజేపీ కుట్ర పన్నుతున్నాయని పదివేలో సారి విమర్శించిన రాహుల్ గాంధీ ఎట్టకేలకు కాస్త భిన్నంగా ఇంకొక విమర్శ చేశాడు. ఇలాంటి విమర్శలు చేయడానికి రాహుల్‌కు మానవత్వం లేదా అన్నట్టు డాక్టర్లు సోనియా గాంధీకి ఫిర్యాదు చేశారు. అందుకు క్షమాపణ చెప్పాలని కూడా కోరారు. వంశ పారంపర్యంగా వచ్చే ఆరోగ్య సమస్యలు, వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న వారిని చూసి గేలి చేయడం ఎంతవరకు సబబు? అయితే ఆ మాత్రం విజ్ఞత రాహుల్‌కి ఉంటే బాగానే ఉండేది. దురదృష్టవ శాత్తు లేదు. భారత ప్రధాని నరేంద్ర మోదీకి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌లా మతిమరుపు గట్రా గట్రా వచ్చేశాయని మహారాష్ట్ర ఎన్నికల సందర్భంగా అమరావతిలో నవంబర్ 16న కాంగ్రెస్ ప్రముఖుడు, సోనియా గాంధీ ముద్దులపట్టి రాహుల్ గాంధీ పోలిక తెచ్చాడు. ఇదేమి సంస్కారం అంటూ, ఇందుకు రాహుల్ బహిరంగ క్షమాపణ చెప్పాలంటూ నేషనల్ మెడికో ఆర్గనైజేషన్-భారత్ సోనియా గాంధీకి లేఖ రాసింది. వృద్ధాప్యపు సమస్యలతో బాధపడుతున్న బైడెన్‌ను రాహుల్ అలా మాట్లాడడం వల్ల, అదొక అలవాటుగా మారిపోతుందని ఆర్గనైజేషన్ అధ్యక్షుడు సీబీ త్రిపాఠి హెచ్చరించారు. బైడెన్ వలెనే నరేంద్ర మోదీ కూడా జ్ఞాపకశక్తిని కోల్పోయారని రాహుల్ అన్నాడు. పైగా బైడెన్ పదవీకాలం ఇంకొన్ని నెలలు ఉండగానే మాజీ అనేశారు. ఇది కదా వైచిత్రి! ఆయన పదవిలోనే ఉన్న సంగతి కూడా మరచిపోయిన రాహులుడు మోదీకి బొత్తిగా మతిమరుపు వచ్చే సిందని వ్యాఖ్యానించడం అసహ్యంగా అనిపించడం లేదా! రాహుల్ వంటి నాయకుడు బహిరంగంగా వేదిక మీద ఇలాంటి మాటలు వదిలితే ఆ వ్యాధులకు వైద్యం చేయించుకుంటున్న వారు ఎంత బాధ పడతారో ఆలోచించాలని కూడా త్రిపాఠి సోనియాకు రాసిన లేఖలో కోరారు. తన కంటే పెద్దవాడు, ఒక అగ్రరాజ్యాన్ని పాలిస్తున్న వ్యక్తిని పట్టుకుని ఇలా మాట్లాడడం రాహుల్‌కు ఏమైనా మర్యాదగా ఉందా అని కూడా త్రిపాఠి నిలదీశారు. పెద్దల యెడల గౌరవ ప్రపత్తులతో మెలగవలెను అని కదా పురాణాలు చెబుతున్నాయి, మరి ఇదేమిటీ మీ అబ్బాయి ధోరణి అని కూడా రాశారాయన. త్రిపాఠి గారు ఇంకా నేర్చుకోవాలి. ఎందుకంటే రాహుల్‌కి పెద్దలంటే ఎలాగూ గౌరవం లేదు. అదొక వాస్తవం. తన పార్టీ ప్రధానులనే ఆయన కించపరిచాడు. ఇక భారతీయ పురాణాలంటే ఆయనకి బొత్తిగా పడవు. రాహుల్ తెలుసుకోవలసింది ఒక్కటే. ఇలాంటి మాటలు అనడం అంటే కేవలం బైడెన్‌ను అవమా నించడమే కాదు, ఆ వయసులో ఉన్న కోట్లాదిమందిని కించపరిచినట్టేనని చెప్పారు త్రిపాఠి. అయినా సోనియాజీ! మీకు కూడా వృద్ధాప్యపు సమస్యలు మీద పడ్డాయని ఒక మాట వినిపిస్తున్నది కదా! మీ కుమార రత్నం అన్న మాటలను మీకు కూడా వర్తింప చేసుకుని ఆలోచించండి అని కూడా త్రిపాఠి చక్కని సలహా ఇచ్చారు. సోనియాయే కాదు, మన్మోహన్ సింగ్ కూడా వృద్ధాప్య సమస్యలతోనే కదా బాధపడుతున్నారు. ఇది కూడా రాహుల్ గుర్తించాలి. ★

# ఒకటీ రెండూ కాదు, వేయి రెట్లు నయం!



అబ్బే వేయి రెట్లు నయం కాదూ! ఈ మాట ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాను పొగుడుతూ అన్నారు. ఈ అరుదైన సంఘటన నవంబర్ 22వ తేదీన జరిగిన ఇందిరాగాంధీ ఢిల్లీ టెక్నలాజికల్ మహిళా విశ్వవిద్యాలయం ఏడవ స్నాతకోత్సవంలో అన్నారు. ఇంతకీ వేయిరెట్లు నయం అన్న భుజకీర్తి అమాంతం కొట్టేసిన ఆ వ్యక్తి ఎవరు? ఈ వ్యక్తి వేయి రెట్లు నయం అంటే, అవతల పోల్చి చెప్పిన వ్యక్తి వేయి రెట్లు హీనమనే కదా! వేయి రెట్లు నయం అర్హత సాధించిన వారు ఢిల్లీ ప్రస్తుత ముఖ్యమంత్రి అతీశీ. ఎవరి కంటే! ఇంతకు ముందు ముఖ్యమంత్రి కంటే. అనగా అరవింద్ కేజ్రీవాల్ కంటే. మహిళా విశ్వవిద్యాలయం కాబట్టి, వారిని ఉత్సాహపరిచే మాటలు ఏవో రెండు చెప్పాలనుకున్నారు లెఫ్టినెంట్ గవర్నర్. అందుకే ఢిల్లీకి ఒక మహిళ ముఖ్యమంత్రి కావడం చాలా సంతోషం. పైగా ఆమె ఇంతకు ముందు ఉన్న ముఖ్యమంత్రి కంటే వేయిరెట్లు నయం కూడాను అని ముక్తాయించారాయన. చదువులు పూర్తి చేసుకున్న మీ ఎదుట మార్గదర్శనం చేయడానికి నాలుగు నక్షత్రాలు ఉన్నాయని కూడా ఆయన గుర్తు చేశారు. మీ బాధ్యతను మీరు గుర్తించడం, మీ కన్నవారి పట్ల, మీ సొంత కుటుంబం పట్ల మీకు ఉన్న బాధ్యత, జాతి నిర్మాణంలో మీకున్న బాధ్యత, చివరిగా పురుషాధిక్య సమాజాన్ని చీల్చుకు వెళుతున్న మహిళల బాధ్యతను మీరు గుర్తించడం అని కూడా సక్సేనా సక్సెస్ సూత్రాలు చెప్పారు. ★

# వక్ఫ్ బోర్డు నుంచి కొప్పాల్ మఠం ఆస్తులు తిరిగి ఇవ్వాలి




వక్ఫ్ ఆస్తులలో చేరిపోయిన కొప్పాల్ హళకేరి శ్రీ అన్నదానేశ్వర శాఖ మఠం ఆస్తులను తిరిగి ఇవ్వాలని స్థానిక వీరశైవులు ప్రభుత్వాన్ని కోరారు. నవంబర్ 21న వీరశైవ వర్గం నాయకులు మఠంలో సమావేశమై దీని గురించి చర్చించారు. ఈ మఠం స్థానిక వీరశైవులు శతాబ్దాలుగా ఎంతో ముఖ్యమైనదిగా భావిస్తున్నారు. మఠం ఆస్తులను వక్ఫ్ ఆస్తుల జాబితాలోకి బదలీ చేశారు. ఈ మఠం కేంద్రంగా సామాజిక సేవా కార్యక్రమాలు, పాఠశాలలు నడుస్తున్నాయి. ఇది 35 కుంటల భూమిలో విస్తరించి ఉంది. ఇందులో 18 కుంటల భూమిని దర్గా, శ్మశాన వాటిక భూమిగా రిజిస్టర్ చేశారు. మిగిలిన మఠం ఆధ్వర్యంలోని పాఠశాల పేరుతో ఉంది. ఇంతకీ ఆ 18 కుంటల భూమిని జనవరి 29, 2021 లోనే వక్ఫ్ ఆస్తిగా సర్వే నెం 17 పేరుతో రిజిస్టర్ చేశారు. ఈ బదలీనే రద్దు చేయవలసిందిగా స్థానిక వీరశైవ వర్గీయులు కోరుతున్నారు. చిరకాలంగా ఈ ప్రాంతంలో హిందువులు, ముస్లింలు సఖ్యతతోనే ఉన్నారని, మఠం భూమిని వక్ఫ్ ఆస్తిగా రిజిస్టర్ చేయడం వల్ల ఉద్రిక్తతలు తలెత్తాయని పెద్దలు చెప్పారు. ★

ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన భారత క్రికెట్ లీగ్ ఐపీఎల్ తన రికార్డులను తానే అధిగమిస్తూ ఆకాశమే హద్దుగా దూసుకుపోతోంది. 2025 ఐపీఎల్ సీజన్ ప్రారంభానికి ముందే నిర్వహించిన మెగా వేలంలోనే కళ్లు చెదిరే రికార్డులు నమోదయ్యాయి. భారత ఆటగాళ్లే కనీవినీ ఎరుగని రీతిలో అత్యధిక ధరను దక్కించుకోగలిగారు.




# ఐపీఎల్- 2025 వేలంలో రికార్డుల మోత!

సౌదీ అరేబియాలోని జెద్దాలో 2025 ఐపీఎల్ కోసం తొలిసారిగా నిర్వహించిన రెండురోజుల మెగావేలం పలు సంచలనాలు, సరికొత్త రికార్డులతో ముగిసింది. తమకు నచ్చిన ఆటగాళ్లను వేలం ద్వారా దక్కించుకోడానికి 10 ఫ్రాంచైజీల యాజమాన్యాలు రూ.కోట్లను మంచినీటిప్రాయంగా కుమ్మరించాయి.

రెండు లేదా మూడేళ్లకోమారు నిర్వహించే మెగా వేలం కోసం ఫ్రాంచైజీలు రూ. 550 కోట్లతో బరిలో నిలిచాయి. నిబంధనల ప్రకారం ఒక్కో జట్టు మొత్తం 22 నుంచి 24 మంది వరకూ సభ్యుల కోసం రూ. 55 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది.కేవలం ఒకరిద్దరు ఆటగాళ్ల కోసమే రూ. 30 నుంచి రూ. 40 కోట్లు వెచ్చించిన ఫ్రాంచైజీలు ఇతర ఆటగాళ్లకు రూ.లక్షలు చెల్లించడం వేలం వ్యూహంలో భాగంగా ఉంటూ వస్తోంది.

గత సీజన్ వరకూ ఢిల్లీ క్యాపిటల్స్‌కు నాయకత్వం వహించిన వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ కోసం లక్నో సూపర్ జెయింట్స్ ఫ్రాంచైజీ రికార్డు స్థాయిలో రూ.27 కోట్లు ఖర్చు చేసింది. 2024 సీజన్ వరకూ ఏడాదికి రూ.14 కోట్లు చొప్పున అందుకొన్న పంత్ రెట్టింపు మొత్తాన్ని కైవసం చేసుకోడం విశేషం. గత సీజన్ విజేత కోల్ కతా నైట్ రైడర్స్ బ్యాటర్ కమ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ కోసం పంజాబ్ కింగ్స్ యాజమాన్యం రూ. 26.74 కోట్లు వెచ్చించింది. వెంకటేశ్ అయ్యర్‌కు కోల్ కతా ఫ్రాంచైజీ రూ.23.75 కోట్లు, జోస్ బట్లర్‌కు గుజరాత్ టైటాన్స్ రూ. 15.75 కోట్లు చెల్లించనున్నాయి.

### బౌలర్లకు జాక్ పాట్......

గత సీజన్ వరకూ రూ. 4 నుంచి 8 కోట్లు పలికిన స్పిన్, పేస్ బౌలర్ల కోసం ఫ్రాంచైజీలు రూ.10 కోట్లకు పైగా ఖర్చు చేయటానికి వెనుకాడ లేదు. అర్షదీప్ సింగ్‌ను తన జట్టులో సభ్యుడిగా కొనసాగించడం కోసం పంజాబ్ కింగ్స్ యాజమాన్యం రూ. 18 కోట్లు, దక్షిణాఫ్రికా మెరుపు ఫాస్ట్ బౌలర్ కిగిసో రబడ కోసం గుజరాత్ టైటాన్స్ రూ. 10.75 కోట్లు,ఢిల్లీ క్యాపిటల్స్ స్టార్క్‌కు రూ.11.75 కోట్లు చెల్లించి మరీ ఖాయం చేసుకున్నాయి. గత సీజన్ వరకూ గుజరాత్ టైటాన్స్‌కు ఆడుతూ వచ్చిన వెటరన్ ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమీని హైదరాబాద్ సన్ రైజర్స్ ఏకంగా రూ. 10 కోట్లకు దక్కించుకొంది. 2024 సీజన్ వరకూ హైదరాబాద్ జట్టులో కీలక బౌలర్ గా ఉన్న నటరాజన్‌కు ఢిల్లీ క్యాపిటల్స్ యాజమాన్యం రూ.10.75 కోట్లు, రాజస్థాన్ రాయల్స్ మాజీ పేసర్ ట్రెంట్ బౌల్ట్‌కు ముంబై ఇండియన్స్ రూ. 12.50 కోట్లు, సీనియర్ ఫాస్ట్ బౌలర్ భువనేశ్వర్ కుమార్‌కు బెంగళూరు ఫ్రాంచైజీ రూ.10.75 కోట్లు చెల్లించి దక్కించుకొన్నాయి.

హైదరాబాద్ ఫాస్ట్ బౌలర్ మహ్మద్ సిరాజ్‌ను గుజరాత్ టైటాన్స్ రూ.12.25 కోట ధరతో తనజట్టులో చేర్చుకొంది. రాజస్థాన్ రాయల్స్ మాజీ స్పిన్ జాదూ యుజువేంద్ర చాహల్‌ను పంజాబ్ కింగ్స్ రూ.18 కోట్ల రికార్డు ధంతో సొంతం చేసుకొంది. రవిచంద్రన్ అశ్విన్‌ను చెన్నై ఫ్రాంచైజీ రూ.9.75 కోట్లతో తన జట్టులో చేర్చుకొంది. న్యూజిలాండ్ స్పిన్ మాంత్రికుడు సాంట్నర్‌ను కేవలం రూ. 2 కోట్ల ధరకే ముంబై దక్కించుకోగలిగింది.

### అమ్మకానికి దూరంగా...

ఐపీఎల్ లో రికార్డు హాఫ్ సెంచరీల మొనగాడు, దిగ్గజ బ్యాటర్ డేవిడ్ వార్నర్, న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ కేన్ విలియమ్స్ సన్, పృథ్వీ షా, గ్లెన్ ఫిలిప్స్, అజింక్యా రహానే, శార్దూల్ ఠాకూర్, డారిల్ మిచెల్, ముజీబుర్ రెహ్మాన్, అఖిల్ హుస్సేన్, కేశవ్ మహారాజ్‌తో సహా 80 మందికి పైగా విదేశీ, స్వదేశీ ఆటగాళ్లు వేలం ద్వారా అమ్ముడుపోకుండా ఉండి పోయారు.

### ఐపీఎల్ చరిత్రలో అత్యధిక ధర ఆటగాళ్లు.....

2008 ఐపీఎల్ తొలి వేలం నుంచి ప్రస్తుత 2024 మెగావేలం వరకూ సీజన్లవారీగా అత్యధిక ధర పలికిన ఆటగాడిగా వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ సరికొత్త రికార్డు నెలకొల్పాడు.ఆ తర్వాతి స్థానంలో కోల్ కతా మాజీ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ నిలిచాడు. గత (2024) సీజన్లో ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ మిషెల్ స్టార్క్‌ను కోల్ కతా ఫ్రాంచైజీ రూ. 24.75 కోట్లకు వేలం ద్వారా సొంతం చేసుకోడం ద్వారా రికార్డు నెలకొల్పింది. అత్యధిక ధర సాధించిన తొలి విదేశీ క్రికెటర్‌గా, మూడో అత్యుత్తమ ధర సాధించిన ఆటగాడిగా స్టార్క్ రికార్డుల్లో చేరాడు.మరో ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ పాట్ కమిన్స్‌ను హైదరాబాద్ సన్ రైజర్స్ యాజమాన్యం రూ. 20.50 కోట్లతో సొంతం చేసుకొంది.2023 ఐపీఎల్ సీజన్ వేలంలో ఇంగ్లండ్ ఆల్ రౌండర్ సామ్ కరెన్ అత్యధికంగా రూ. 18.50 కోట్లు దక్కించుకొని,ఐపీఎల్ చరిత్రలో ఐదవ అత్యంత ఖరీదైన ఆటగాడిగా కరెన్ రికార్డుల్లో చేరాడు. రంజీ ట్రోఫీలో బీహార్ జట్టుకు ఆడుతున్న యువసంచలనం, 13 సంవత్సరాల వైభవ్ సూర్యవంశీకి కోటీ 5 లక్షల రూపాయలు చెల్లించి మరీ జైపూర్ యాజమాన్యం దక్కించుకొంది.

### గ్యారెంటీలేని గెలుపు గుర్రాలు.....

భారీ అంచనాలతో రూ. కోట్లతో దక్కించుకొన్న ఆటగాళ్లు బరిలోకి దిగినా నిలకడగా రాణిస్తారన్న గ్యారెంటీ ఏమీ లేదని గత సీజన్ల అనుభవమే చెబుతూ వచ్చింది. గతంలో బెన్ స్టోక్స్‌కు చెన్నై ఫ్రాంచైజీ భారీగా చెల్లించి సాధించింది శూన్యం కాగా..గత సీజన్లో మిచెల్ స్టార్ కు రికార్డు ధర చెల్లించిన కోల్ కతా ఫ్రాంచైజీ పైసా వసూల్ అనుకొనేలా చేసింది. కేవలం స్టార్క్ బౌలింగ్ ప్రతిభ కారణంగానే కోల్ కతా నైట్ రైడర్స్ 2024 సీజన్ విజేతగా నిలువగలిగింది. కొందరు ఎంపిక చేసిన ఆటగాళ్ల కోసం 20 నుంచి 27 కోట్ల రూపాయల వరకూ ఖర్చు చేయడం అంటే ఖరీదైన జూదం లాంటిదే. రానున్న సీజన్లలో వేలం ధర 30 కోట్ల రూపాయలకు చేరినా ఆశ్చర్యం లేదు. ★



కృష్ణారావు చొప్పరపు
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969

# స్వధర్మంలోకి తిరిగి రండి!

## – శృంగేరి జగద్గురువులు శ్రీశ్రీశ్రీ విదుశేఖర భారతీ మహాస్వామి

**బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా :** 'మమోపాత్త సమస్త దురితక్షయ ద్వారా శ్రీ పరమేశ్వర ప్రీత్యర్థమ్ శుభే శోభనే ముహూర్తే శ్రీ మహావిష్ణోరాజ్ఞాయా ప్రవర్త మానస్య ఆద్యబ్రహ్మణః ద్వితీయ పరార్థే శ్వేత వరాహ కల్పే వైవస్వత మన్వంతరే కలియుగే ప్రథమపాదే జంబూద్వీపే భరతవర్షే భరతఖండే మేరోర్దక్షిణ దిగ్భాగే శ్రీశైలస్య ఈశాన్య ప్రదేశే కృష్ణా గోదా వర్యోర్మధ్య ప్రదేశే సమస్త దేవతా బ్రాహ్మణ హరిహర గురుచరణ సన్నిధౌ అస్మిన్ వర్తమాన వ్యావహారిక చాన్ద్రమానేన.....' అంటూ ప్రతీ హిందువు తన పూజా ప్రారంభంలో చెప్పే సంకల్పంలోనే సనాతన హిందూ ధర్మానికి చెందిన అనేక అంశాలు మనకు తెలుస్తాయని శ్రీశృంగేరి జగద్గురువులు శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీస్వామి అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో విజయయాత్ర చేస్తున్న సందర్భంగా నవంబర్ 26న బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, గుడిమల్లంకలో శ్రీ విద్యాభారతీ శంకరమఠం ఆధ్వర్యంలో జరిగిన పండిత సభలో ఆయన అమృతభాషణం చేశారు.

శాశ్వతమైన భగవంతుని ద్వారా వచ్చేదే సనాతన ధర్మం అని అన్నారు. సుఖదుఃఖాలను నియంత్రించేది 'ధర్మం' అని, ధర్మంవైపు ఉంటే సుఖం వెతుక్కుంటూ వస్తుందని, అధర్మంవైపు పయనిస్తే దుఃఖం కలుగు తుందని ఆదిశంకరాచార్యులు జగద్గురువులుగా పునరపిజననం –పునరపి మరణం అని చెప్పిన విధంగా కాలగమనంలో మానవులు ఎన్ని జన్మలు ఎత్తవలసి ఉంటుందోనన్నారు. 12వందల సంవత్స రాల క్రితం ఆదిశంకరాచార్యులు ఉద్భవించి ఆనాటి నుండి సనాతన ధర్మరక్షణకు విశేష కృషి చేశారని ఆ మహానుభావుని పరంపరలోనే శృంగేరీ పీఠం ధర్మపరిరక్షణకు కృషి ప్రారంభించిందన్నారు. ప్రతీ వ్యక్తి భగవంతుని అనుగ్రహానికి అర్హుడేనని అయితే ఆ వ్యక్తి చేసే ధర్మ–అధర్మాలపై అనుగ్రహం అనేది లభిస్తుందన్నారు. జీవితంలో ప్రతీ వ్యక్తి ధర్మ మార్గాన్ని ఆచరించాలి అంటే రెండు పనులు చేయా లని, మొదటిది భగవదారాధన, రెండవది పరోప కారం అన్నారు. భగవదారాధన చేయడానికి క్షేత్రాలు సందర్శించాలని క్షేత్ర సందర్శన సాధ్యం కాకపోతే నచ్చిన దైవస్మరణ 108 సార్లు చేయాలన్నారు. పరోపకారం ద్వారా కూడా దైవానుగ్రహం పొంద వచ్చునన్నారు. ఉపకారం చేయాలే గానీ అపకారం మాత్రం చేయకూడదన్నారు. ధర్మాన్ని ఆచరించడమే నని, తాను ఆచరిస్తూ ఇంకొకరి చేత ఆచరింప చేయడంవల్లనే ధర్మం కొనసాగుతుందని మహాస్వామి తెలిపారు.

శృంగేరీ ఆధ్వర్యంలో అనేక ఆలయాల జీర్ణోద్ధారణ చేసామని అందులో భాగంగానే గుడి మల్లంకలో లక్షణస్వామి ప్రతిష్ఠించినట్టు చెప్పే లక్ష్మణేశ్వరస్వామి ఆలయ నిర్మాణాన్ని తమ పీఠం చేపట్టిందని, శ్రీవిద్యాభారతీ శంకరమఠం అభివృద్ధికి కూడా చేయూతనిస్తామన్నారు. అనాదిగా ఉన్న హిందూ సనాతన ధర్మాన్ని విమర్శించే వ్యక్తులు ఉన్నారని అది వారి విజ్ఞతకే వదిలిపెట్టాలన్నారు. కల్లబొల్లి కబుర్లు చెప్పి హిందూమతంలోని వారిని తమ మతాలవైపు మళ్లించుకుంటున్నారని వాటిని విశ్వసించవద్దని, సనాతన ధర్మం వీడి వెళ్లినవారు తిరిగి సనాతన ధర్మంవైపు వచ్చి చేసిన తప్పును సరిదిద్దుకోవాలన్నారు.





సభాప్రారంభంలో ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన వేదపండితులచే అత్యంత వైభవంగా వేదపఠనం జరిగింది. తొలుత ఈవన రామచంద్రఘనాపాటి మహాభారతిస్వామివారికి స్వాగతపత్రం చదువగా, గుడిమల్లంక శ్రీ విద్యాభారతీ శంకరమఠం అధిపతి మంగళపల్లి సాయిరాం, సిఇఒ ఎమ్.కార్తీక్‌శర్మ, హనుమాన్ శర్మలు స్వాగతపత్రాన్ని స్వామివారికి అందించారు. రాజోలు శాసనసభ్యులు దేవవరప్రసాద్ నియోజకవర్గ సమస్యలపై స్వామి వారికి విన్నవించారు. అంతర్వేది క్షేత్రం, సాగర సంగమం ఉన్న ఈ ప్రాంతం అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి తన ఆశీర్వచనాలు ఉంటాయని విధుశేఖర్ భారతీమహాస్వామి అన్నారు. శ్రీ విద్యా భారతీ శంకరమఠంలో శ్రీ శారదా చంద్ర మౌళీశ్వర పూజ ప్రసాదవితరణ జరిగింది.

నవంబర్ 26న అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయాన్ని సందర్శించారు.

– గోపరాజు జవహర్‌లాల్

## గౌరవ డాక్టరేట్ బిరుదు




**భాగ్యనగర్ :** సామాజిక సేవారంగంలో విశిష్ట సేవలు అందించిన వైదేహి సేవాసమితి కార్యదర్శి పొనుగోటి ప్రకాష్‌రావును గౌరవ డాక్టరేట్ బిరుదు వరించింది. U.N.Oకు చెందిన world culture and environ ment protection commission ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రకాష్ రావును గౌరవ డాక్టరేట్ బిరుదుతో సత్కరించారు. వైదేహిసేవాసమితి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సరస్వతి నగర్‌లో బాలికల ఆశ్రమం, వైదేహి కౌశల్లో ఉచిత శిక్షణా కేంద్రం నిర్వహిస్తున్నారు.

ప్రకాష్‌రావు స్వచ్ఛందగా సేవాకార్యక్రమాలు నిర్వహిస్తు అనేకమందికి స్ఫూర్తి దాయకంగా ఉన్నారు. ప్రకాష్‌రావు గౌరవ డాక్టరేట్ బిరుదుతో సత్కరించటం పట్ల అనేక మంది ప్రముఖులు ఆయనను అభినందించారు.

# సేవికా సమితి ఆధ్వర్యంలో ప్రబుద్ధ మహిళా సదస్సు



**భాగ్యనగర్ :** రాష్ట్రసేవికా సమితి వందనీయ ప్రముఖ సంచాలిక శాంతక్క పర్యటన భాగ్యనగర్ విభాగ్‌లో నవంబర్ 17,18 తేదీలలో జరిగింది.

నవంబర్ 17వ తేదీ వైఐఎమ్ఎస్‌లో జరిగిన ప్రబుద్ధ మహిళా సదస్సుకు శాంతక్క మార్గదర్శనం చేసారు. ఇందులో అఖిల భారత సంపర్క్‌ప్రముఖ్ పూనంశర్మ, తెలంగాణ ప్రాంత సంచాలిక డా.అరుణక్క, ప్రాంత కార్యవాహిక శ్రీపాద రాధక్క, ప్రాంత సంపర్క ప్రముఖ్ సింధుదీది తదితరులు పాల్గొన్నారు. ప్రశ్నోత్తర కార్యక్రమంలో ప్రబుద్ధ మహిళ సందేహాలను శాంతక్క నివృత్తి చేసారు. ఈ కార్యక్రమంలో 60 మంది పాల్గొన్నారు. నవంబర్ 18న శాంతక్క మార్గదర్శనంలో సేవికాసమితి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో 30 మంది కార్యకర్తలు పాల్గొన్నారు. ★

# చిరస్మరణీయులు ఆచార్య దుగ్గిరాల విశ్వేశ్వరం




**విశాఖపట్నం:** ఆర్ఎస్ఎస్ వరిష్ఠ కార్యకర్తగా, భారతీయ శిక్షణమండల్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఆజీవనం సేవలందించిన ఆచార్య దుగ్గిరాల విశ్వేశ్వరం సంస్మరణ సభ "విశ్వ చింతన్" నవంబర్ 16న విశాఖపట్నం పబ్లిక్ లైబ్రరీ (ద్వారకా నగర్)లో జరిగింది.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రొఫెసర్ ఎస్. రామచంద్ర శెట్టి (గవర్నమెంట్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ, బెంగళూరు) మాట్లాడుతూ, ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫార్మసీ విభాగంలో 40 సంవత్సరాల సుదీర్ఘకాలం ఆచార్యునిగా పనిచేసిన విశ్వేశ్వరం గారు యూనివర్సిటీకి వివిధస్థాయిలలో ఎన్నో సేవలను అందించారని, జాతీయ-అంతర్జాతీయ సదస్సులలో ఫార్మసీకి సంబంధించి ఎన్నో పరిశోధనపత్రాలు సమర్పించారని, ఫార్మసీ రంగంలో కొన్ని వందల మంది విద్యార్థులను నిపుణులుగా తయారు చేశారనీ అన్నారు. వృత్తిపరంగానే కాకుండా, ఆజీవనమూ దేశకార్యంకోసం తనను తాను సమ ర్పించుకున్న ఆదర్శ స్వయంసేవక్ విశ్వేశ్వరంగారని రామచంద్ర శెట్టి అన్నారు.

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వి.ఆర్. రాంబాబు(కార్యదర్శి, భారతీయ విద్యాకేంద్రం, ఆంధ్రప్రదేశ్) మాట్లాడుతూ సంఘపరివార్‌లోని వివిధ సంస్థల కార్యకర్తలందరితో విశ్వేశ్వరంగారు కుటుంబ సంబంధాలు నెరపేవారని, ప్రతి కార్యకర్త శ్రేయస్సును కోరుకుంటూ అండగా నిలుస్తూ కుటుంబ పెద్దగా మార్గదర్శనం చేసిన విశ్వేశ్వరం గారు చిరస్మరణీయులన్నారు. విశ్వేశ్వరంగారి సతీమణి డి.వి. రమణమ్మ వ్రాసిన "మన ఇతిహాసగాథలు" పుస్తకాన్ని ఎస్.జ్యోతి మాధవి (డిప్యూటీ కలెక్టర్ మరియు డిస్ట్రిక్ట్ మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్,విశాఖ) ఆవిష్కరించారు. విశ్వేశ్వరం గారి బంధువులతోపాటు, సంఘపరివార్ కార్యకర్తలు ఎంతోమంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ★


# వేంకటేశ్వరస్వామి ఆలయం జమలాపురం

## తెలుసుకుందాం



ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం, జమలాపురంలో కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయమిది. జాబాలి మహర్షి తపస్సుకు మెచ్చి వేంకటేశ్వరస్వామి సతీసమేతంగా ఈ క్షేత్రంలో వెలిసినట్లుగా చరిత్ర తెలుపుతోంది. శ్రీరాముడు తాను కలియుగం ప్రారంభం రోజున వేంకటేశ్వరుడి రూపంలో ఇక్కడ ఉద్భవిస్తానని చెప్పిన మేరకు, కలియుగం ప్రారంభం రోజున వేంకటేశ్వరుడిగా సాలగ్రామ రూపంలో వెలిశాడని, అందుకే ఈ విగ్రహం తిరుమలలోని వేంకటేశ్వరుడి విగ్రహం కంటే పురాతనమైనదని చెబుతారు. ఈ ఆలయ ప్రాంగణంలో పద్మావతి అమ్మవారు, శ్రీ అలివేలుమంగ అమ్మవారు, శివుడు, వినాయకుడు, అయ్యప్ప, అంజనేయస్వామి ఆలయాలు కూడా ఉన్నాయి.

## కథ | గుమ్మడికాయల దొంగ!



ఒక ఊరిలో రైతులు కష్టపడి పండిస్తున్న గుమ్మడికాయలను ఒక దొంగ రోజూ దొంగలించేవాడు.

ఆ రోజులలో గుమ్మడికాయలు ఇప్పుడు దొరికినంత సులువుగా దొరికేవి కాదు. అవి పండించడానికి రైతులు చాలా కష్ట పడేవారు.

గుమ్మడికాయ దొంగ ఊళ్లోనే ఎవరో అయి ఉంటారని రైతుల నమ్మకం.

దొంగ ఎవరో కనిపెట్టడం ఆ రైతులకు తెలియలేదు.

అందుకే రైతులంతా కలిసి ఊరి పెద్ద దగ్గరకు వెళ్లారు.

ఆ ఊరి పెద్ద చాలా తెలివైన వ్యక్తి.

## పద్యం

కూరిమిగల దినములలో
నేరములెన్నడును గలుగనేరవు మరి యా
కూరిమి విరసంబైనను
నేరములే తోచుచుండు నిక్కము సుమతీ!

**భావం :** ఓ సుమతీ! స్నేహము బాగుగా ఉన్న రోజులలో ఆ స్నేహితులకు ఒకరు చేసిన పనులలో మరొకరికి తప్పులు కనిపించవు. అదే స్నేహితులకు విరోధము వచ్చినపుడు ఒకరి చేష్టలు మరొకరికి దోషములుగా కనిపించును అని భావం.

## శ్లోకం

ఉత్తరం యత్ సముద్రస్య
హిమాద్రేశ్చైవ దక్షిణమ్
వర్షం తద్ భారతం నామ
భారతీ యత్ర సంతతిః

**భావం :** సముద్రాలకు ఉత్తరాన, హిమాలయాలకు దక్షిణాన గల భూభాగాన్ని భారతవర్షం అంటారు. దీని సంతానమే భారతీయులు.

## జతపరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| ఇల్లు | అక్షి |
| ఏనుగు | గృహం |
| కన్ను | మధురం |
| గాలి | కరి |
| తీపి | పవనం |

సమాధానాలు : ఇల్లు-గృహం, ఏనుగు-కరి, కన్ను-అక్షి, గాలి-పవనం, తీపి-మధురం.

## భారత స్వాతంత్ర్య సమరయోధులు

### గణపత్రావ్ దేవ్‌జీ తపసే




మహారాష్ట్రకు చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు. 1909 అక్టోబర్ 30న జన్మించారు. చిన్ననాటి నుంచే ఉద్యమం పట్ల ఆకర్షితులయ్యారు. 1930 నాటి శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లారు. క్విట్ ఇండియా ఉద్యమంలోనూ పాల్గొని కొంత కాలం జైలు జీవితం గడిపారు. స్వాతంత్ర్యానంతరం రాజకీయాల్లోనూ రాణించారు. హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు గవర్నరుగా సేవలందించారు. 1992 అక్టోబర్ 3న మరణించారు.

## జనరల్ నాలెడ్జ్

1. ఇటీవలి మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఏ కూటమి విజయం సాధించింది?
2. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఎప్పుడు జరుపుకుంటారు?
3. ఇంఫాల్ ఏ రాష్ట్రానికి రాజధాని నగరం?

జవాబులు : 1. మహాయుతి, 2. నవంబర్ 26, 3. మణిపూర్.



రైతులు మొర విని, “ఓస్! ఇంతేనా! గుమ్మడికాయ దొంగని పట్టుకోవడం చాలా సులువు. ఆ దొంగ ఎవరో నాకు ముందే తెలుసు. ఆ దొంగకి కుడి భుజం మీద గుమ్మడికాయ అంత సొట్ట ఉంటుంది” అని తెలివిగా అన్నాడు.

ఈ మాట విన్న వెంటనే రైతులలో ఒకడు తన కుడి భుజం తడుముకుని సొట్ట ఉందో లేదో అని పరిశీలించుకున్నాడు.

అది గమనించిన ఆ ఊరి పెద్ద ‘అతనే దొంగ’ అంటూ తేల్చేశాడు.

రైతుల సమస్యను చిటికెలో పరిష్కరించినందుకు గ్రామపెద్దకు ధన్యవాదాలు తెలిపారు. ★

## మెదడుకు మేత

చూస్తే చిన్నోడు,
వాడి ఒంటి నిండా
నార బట్టలు..
ఏమిటది?

జవాబు : మొక్కజొన్న

## మంచిమాట

మంచివాడిని పొగిడితే
మరింత మంచివాడవుతాడు.
అదే చెడ్డ వాడిని పొగిడితే
ఇంకా చెడ్డగా
తయారవుతాడు.




# వారఫలాలు

02-08 డిసెంబర్ 2024



సింహంభట్ల సుబ్బారావు
6300674054



**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

శ్రేయోభిలాషులతో ముఖ్య విషయాలు చర్చిస్తారు. వాహన, గృహయోగాలు. కుటుంబ సభ్యులతో మరింత ఉత్సాహంగా గడుపుతారు. శుభకార్యాలపై చర్చలు జరుపుతారు. ఆరోగ్యం కొంత మెరుగుపడుతుంది. వ్యాపారులకు గతం కంటే మెరుగ్గా ఉంటుంది. ఉద్యోగులకు కొత్త హోదాలు రాగలవు. కళాకారులకు విశేష గుర్తింపు రాగలదు. 2,3 తేదీలలో చర్చల్లో ప్రతిష్ఠంభన. విష్ణుసహస్రనామ పారాయణ చేయండి.



**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

క్రమేపీ అనుకూల పరిస్థితులు నెలకొంటాయి. నిరుద్యోగులకు ఉద్యోగయోగం. అనుకున్న కాంట్రాక్టులు పొందుతారు. ఆదాయం సంతృప్తినిస్తుంది. కుటుంబసభ్యులతో విభేదాలు తొలగుతాయి. కొద్దిపాటి రుగ్మతలు. వ్యాపారులకు క్రమేపీ లాభాలు దక్కు తాయి. పారిశ్రామికవేత్తలు విదేశీయానం. కళాకారులు, రచయితలకు సమస్యలు తీరతాయి. 4,5తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. మానసిక ఆందోళన. గణేశాష్టకం పఠించండి.



**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

ముఖ్య సమావేశాలలో పాల్గొంటారు. సమాజంలో పలుకుబడి . ఇంటి నిర్మాణయత్నాలు కలసివస్తాయి. రాబడి మెరుగ్గా ఉంటుంది. కుటుంబంలో బంధువుల తాకిడి. వ్యాపారులకు అనుకున్న లాభాలు. విస్తరణయత్నాలు కలసివస్తాయి. ఉద్యోగులకు అధికారుల ప్రశంసలు. కళాకారులకు అనుకూల సమాచారం. క్రీడాకారులు, వైద్యులకు ఆహ్వానాలు. 6,7తేదీల్లో వృథాఖర్చులు. కుటుంబంలో సమస్యలు. విష్ణుధ్యానం చేయండి.



**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

ముఖ్యమైన కార్యక్రమాలు సకాలంలో పూర్తి. దేవాలయాలు సందర్శిస్తారు. ఆకస్మిక ధన లాభాలు. రుణబాధలు తొలగుతాయి. కుటుంబంలో చికాకులు తొలగుతాయి. గృహనిర్మాణాలలో అవాంతరాలు తొలగుతాయి. వ్యాపారులు అభివృద్ధి సాధిస్తారు. ఉద్యోగులకు పైస్థాయి ఆదరణ లభి స్తుంది. రాజకీయ వేత్తలకు శుభవార్తలు. రచయితలు, క్రీడాకారులకు విదేశీయానం. 7,8 తేదీల్లో దూర ప్రయాణాలు. ఆరోగ్యసమస్యలు. దక్షిణామూర్తి స్తోత్రాలు పఠించండి.



**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

అనూహ్యమైన రీతిలో కార్యక్రమాలు పూర్తి. దూర ప్రాంతాలనుంచి అందిన సమాచారం సంతోషం కలిగిస్తుంది. కొత్త కాంట్రాక్టులు. తీర్థయాత్రలు. కుటుంబంలో అందరి ప్రేమను పొందు తారు. ఉద్యోగులు విధుల్లో అవాంతరాలు అధిగమిస్తారు. పారిశ్రామికవేత్తలకు ఆహ్వానాలు. కళాకారులు, క్రీడాకారులకు కీలక సమాచారం. 3,4 తేదీల్లో దూరప్రయాణాలు. నవగ్రహస్తోత్రాలు పఠించండి.



**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

కొత్త కార్యాలు. ఆలోచనలు కార్య రూపం. కొన్ని ఉత్సవాలకు హాజరవుతారు. కుటుంబంలో ఉల్లాసంగా గడుపుతారు. ఆరోగ్యం గతంకంటే మెరుగు. వ్యాపారులకు అనుకున్న లాభాలు. ఉద్యోగుల ప్రతిభ వెలుగులోకి వస్తుంది. పారి శ్రామికవేత్తలకు నూతనోత్సాహం. కళాకారులు, క్రీడా కారులకు కొత్త అవకాశాలు. 6,7తేదీల్లో కుటుంబ సభ్యులతో తగాదాలు. శివస్తోత్రాలు పఠించండి.



**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

దేవాలయాల సందర్శన. ఇంటినిర్మాణయత్నాలు సాగవు. రావలసిన సొమ్ము సకాలంలో అందదు. అప్పుచేస్తారు. కుటుంబంలో సమస్యలు ఎదు రవుతాయి. వ్యాపారులు సామాన్య లాభాలు అందు కుంటారు. ఉద్యోగులకు కొన్ని మార్పులు ఉండవచ్చు. కొత్త బాధ్యతలు. కళాకారులు, ఐటీ నిపుణులకు ఒత్తిడులు. 5,6 తేదీల్లో ధనలాభం. వాహనయోగం. ఆంజనేయ దండకం పఠించండి.



**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

అనుకున్న కార్యాలు నిదానంగా పూర్తి చేస్తారు. తీర్థయాత్రలు. దీర్ఘకాలిక రుణాలు తీరతాయి. కుటుంబంలో మీపై ఆదరాభిమానాలు. వ్యాపారులకు అనుకున్నమేర పెట్టు బడులు. ఉద్యోగులకు కొన్ని బాధ్యతల నుండి విముక్తి. కళాకారులు రెట్టించిన ఉత్సాహంగా గడుపుతారు. రచయితలు అనుకున్నది సాధిస్తారు. 7,8 తేదీల్లో దూరప్రయాణాలు. అనారోగ్యం. దేవీస్తుతి పఠించండి.



**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

కార్యక్రమాలు అనుకున్న రీతిలో కొనసాగు తాయి. స్థిరాస్తి ఒప్పందాలు. వాహనసౌఖ్యం. ఆదాయం ఆశాజనకం. కుటుంబంలో ఉత్సాహ వంతం. వ్యాపారులకు పెట్టుబడులు సకాలంలో అందుతుంది. ఉద్యోగులకు కోరుకున్న మార్పులు జరిగే వీలుంది. కళాకారులకు అనుకూల పరిస్థితి. రచయితలు, వైద్యుల ఆశలు ఫలిస్తాయి. 2,3తేదీలలో ఆకస్మిక ప్రయాణాలు. సోదరులతో తగాదాలు. ఆదిత్య హృదయం పఠించండి.




**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

కార్యక్రమాలు చకచకా పూర్తి చేస్తారు. శుభవార్తలు. ఇతరుల నుంచి రావలసిన సొమ్ము అందుతుంది. కుటుంబంలో సమస్యలు తీరి ఊరట చెందుతారు. వ్యాపారులకు లాభాలు దక్కే సూచనలు. ఉద్యోగులకు మరింత ఉత్సాహవంతంగా ఉంటుంది. రాజకీయవేత్తల కృషి ఫలిస్తుంది. క్రీడాకారులు, సాంకేతిక నిపుణులకు ఆహ్వానాలు అందుతాయి. 6,7తేదీల్లో దూరప్రయాణాలు. అనారోగ్యం. ఆంజనేయ దండకం పఠించండి.



**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

అనుకున్న కార్యక్రమాలు విజయవంతంగా పూర్తి చేస్తారు. కొత్త కాంట్రాక్టులు లభిస్తాయి. రావలసిన సొమ్ము సమకూరి అవసరాలు తీరతాయి. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగులకు ఉన్నతపోస్టులు రావచ్చు. పారిశ్రామిక వేత్తలు సంస్థల విస్తరణలో విజయం సాధిస్తారు. కళాకారులు, రచ యితలకు శుభవార్తలు. 7,8 తేదీలలో మానసిక అశాంతి. స్నేహితులతో తగాదాలు. శివాష్టకం పఠించండి.



**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

సమాజసేవలో భాగస్వాములవుతారు. వివాహ, ఉద్యోగయత్నాలు కలసివస్తాయి. స్థిరాస్తి వ్యవహారాలు సర్దుబాటు. పాతబాకీలు సైతం వసూలు. కుటుంబంలో సంతోషం. శుభకార్యాల రీత్యా ఖర్చులు ఉండవచ్చు. వ్యాపారులకు పెట్టుబడులకు తగిన వాతావరణం నెలకొంటుంది. పారిశ్రామికవేత్తలు అనుకున్న లక్ష్యాలు సాధిస్తారు. కళాకారులు, క్రీడాకారులకు వర్తమానాలు. 3,4 తేదీలలో ఆకస్మిక ప్రయాణాలు. శివపంచాక్షరి పఠించండి.

# పదరసం-490

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | | 3 | 4 | | 5 | |
| | | | | 6 | | | | | |
| | | | 7 | | 8 | | 9 | | 10 |
| 11 | 12 | | | | 13 | | | | |
| | | | 14 | 15 | | | | | |
| | | | | | | 16 | | 17 | |
| 18 | | | 19 | | | | | | |
| | | | | | 20 | | | | |
| 21 | | 22 | | 23 | | 24 | | | 25 |
| 26 | | | | 27 | | | | | |

## ఆధారాలు

**అడ్డం**

1) తక్కువ సమయపు చేతి అప్పు (4)
3) దృష్టాంతం, ఒక విషయాన్ని గురించి వివరించుచూ చెప్పే మాదిరి (5)
7) అటునుంచి వచ్చిన ధ్వని (3)
9) చెత్తతోటి కలిపి చెప్పేది, గడ్డిపోచ (3)
11) అటునుంచి వచ్చిన తహతహ (4)
13) తీవ్రం, చాలా ఎక్కువ బాగాలేదు (3)
14) తిరగబడ్డ దాడిమి (3)
16) గాలి లేక కలిగే ఉమ్మదనం (4)
18) ఎనిమిదిమందితో ఒకేసారి చేయు కవితా ప్రక్రియ (5)
20) అదేపనిగా ఉండే ఆలోచన తిరగబడింది (2)
22) ఎక్కువ బాగుండలేదు (3)
24) వయసులో ఉన్నవాడు (4)
26) చీకటి (3)
27) భక్తకన్నప్పగా మారినవాడు (3)

**నిలువు**

1) వాడుక భాషలో “యుక్తిగా దొంగిలించడం/ స్వాహాచేయడం” (4)
2) అత్త మీద కోపం....మీద చూపడం అని సామెత (2)
4) సమీపం, దగ్గర (2)
5) ఎండబెట్టేందుకు వాడే వెదురు పళ్లెం బోర్లాపడింది (3)
6) ఆహారం (2)
7) సమిష్టి సరిగాలేదు (3)
8) అంతులేని ఓదార్పు (3)
9) ...చారడేసి మొగ్గ అంటూ బాలికలు ఆడతారు (4)
10) ఎప్పుడూ సరిగాలేదు (4)
12) వ్యాపారమంటే ఇవి ఉంటాయి (5)
15) నెమ్మది (3)
16) బడులలో గురువు (5)
17) పంటలు పండని బంజరు (4)
19) పైకి ‘మరోలా’ (3)
21) ఈ బాధలంటే ఉపద్రవం, అతివృష్టి మొదలైనవి (2)
22) పేచీ, అదేపనిగా ఉండే కోరిక తలక్రిందులైంది (2)
23) రోగం వలన వచ్చే గడ్డ (2)
25) 17 నిలువే (పైకి) (2)

## పదరసం - 489 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| రా[1] | ప్ప | పా[2] | టు | | గు[3] | గ్గి | లం[4] | | చ[5] |
| చ్చ | | వు | | న[6] | | | టి | | వు |
| గొ[7] | బ్బి | ళ్ళు | | వ[8] | న | భో[9] | జ | నా[10] | లు |
| ట్టు | | కో[11] | వె[12] | ల | | షా | | గ | |
| | వా[13] | | గ | | క్ష[14] | ణం | తీ | రి | క |
| అం[15] | దు | బా[16] | టు | | ఆం | | | క | |
| గా | | గో | | తీ[17] | | క[18] | ల[19] | త | లు[20] |
| ర | | గు[21] | గ్గు | రు | వు | | క్ష్మీ | | త |
| కు[22] | దే | లు | | బ | | స[23] | వా | ల | క్ష |
| డు | | | బ[24] | డి | తె | | రం | | అ |



విశ్వక్ సేన్ నటుడు మాత్రమే కాదు నిర్మాత, దర్శకుడు కూడా! అయితే ఇందులో నటనకు తొలి ప్రాధాన్యం. దాంతో నటుడిగా మరో మెట్టు ఎక్కేందుకు ఆచితూచి అడుగులు వేస్తున్నాడు కానీ ఆశించిన స్థాయిలో విజయాలు దక్కడం లేదు. దాంతో ఎవరో తనని తొక్కేయడానికి ప్రయత్నిస్తున్నారని అప్పుడప్పుడు ఆవేశం, ఆక్రోశం వెళ్లగక్కుతూ ఉంటాడు. ఈ మధ్య కాలంలో ఇలా ఓదార్పు కోసం ఓ భుజాన్ని వెతుక్కున్న హీరోలు ఎవరూ అంతగా సక్సెస్‌ను అందుకున్న దాఖలాలు లేవు. వారి ఆవేదన జనాలకు చేరుతుంది కానీ బాగాలేని సినిమాను థియేటర్‌కు వచ్చి చూసి వీరికి బాసటగా నిలిచేంత విశాల హృదయం ఉండదు. సానుభూతి కోసం స్టేట్‌మెంట్స్ ఇస్తే చూసి చూసి... 'మంచి సినిమా చేయకుండా ఈ వగపేటికి!?' అంటారు జనాలు!

# రిపేర్ పూర్తిగా చేయని 'మెకానిక్ రాకీ'

ఇక విషయానికి వస్తే... విశ్వక్ సేన్ నటించిన మూడు సినిమాలు ఈ యేడాది జనం ముందుకు వచ్చాయి. అప్పుడెప్పుడో మొదలైన 'గామి' సినిమా ఫిబ్రవరిలో విడుదలైంది. మేకింగ్ పరంగా ఇది మరో స్థాయిలో ఉంది. దర్శకుడు ప్రతి ఫ్రేమ్‌ను అద్భుతంగా చెక్కాలని అనుకోవడంతో అంతకాలానికి అది వెలుగులోకి వచ్చింది. కథ, కథనాలు ఆసక్తికరంగా ఉన్నా కోర్ పాయింట్ సాధారణ ప్రేక్షకుడి బుర్రలోకి ఎక్కలేదు. దాంతో 'గామి' విమర్శకుల ప్రశంసలు మాత్రం పొందింది. కమర్షియల్ గా సక్సెస్ అందుకోలేదు. విశ్వక్ రెండో సినిమా 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' కూడా చాలాసార్లు వాయిదా పడి ఎట్టకేలకు విడుదలైంది. ఇందులో అతను తనకున్న 'మాస్ కా దాస్' బిరుదుకు తగ్గట్టు రగ్గడ్ క్యారెక్టర్ చేసి మెప్పించాడు. నటుడిగా మంచి మార్కులు సంపాదించుకున్నా పూర్తి స్థాయిలో చూసినప్పుడు జనాలకు ఇది ఎక్కలేదు. దాంతో ఓపెనింగ్స్ హడావిడి తప్పితే...తుద ఫలితం నిరాశ మిగిల్చింది. దాంతో ఇప్పుడు ఆశలన్నీ శుక్రవారం జనం ముందుకొచ్చిన 'మెకానిక్ రాకీ' మీదే పెట్టుకున్నాడు. పైగా విడుదల సమయంలో ఈ సినిమా అద్భుతం, అమోఘం అంటూ ఆశలూ రేపాడు. మరి ఆ స్థాయిలో మూవీ ఉందా... తెలుసుకుందాం!!

ఫ్యాక్షన్ గొడవల కారణంగా రాయలసీమ నుండి వచ్చేసిన రాకేశ్ నగుమోము (విశ్వక్ సేన్) తాతయ్య హైదరాబాద్‌లో గ్యారేజ్ పెట్టుకుంటాడు. ఆయన కొడుకు (నరేశ్) దానిని పెంచి పెద్దది చేస్తాడు. మనవడి సమయానికి వచ్చే సరికీ డ్రైవింగ్ స్కూల్ కూడా ప్రారంభిస్తాడు. అయితే ప్రభుత్వ నిబంధనలకు తగ్గట్టుగా లేదనే నెపంతో ఆ గ్యారేజీని తొలగించాలంటూ నోటీసులు వస్తాయి. ఈ గ్యారేజ్ మీద కన్నేసిన రంకి రెడ్డి (సునీల్) హస్తం దీని వెనుక ఉందని తెలిసినా రాకీ ఏం చేయలేని పరిస్థితిలో ఉంటాడు. అలాంటి సమయంలో అతని దగ్గరకు డ్రైవింగ్ నేర్చుకోవడానికి మాయ (శ్రద్ధ శ్రీనాథ్) వస్తుంది. అతని కష్టాలు తెలుసుకుని బాధపడుతుంది. గ్యారేజ్‌తో తనకున్న అనుబంధాన్ని తాత, తండ్రి జ్ఞాపకంగా దాన్ని ఎలాగైనా కాపాడుకోవడానికి చేస్తున్న ప్రయత్నాల గురించి ఆమెకు చెబుతాడు రాకీ. అతని చేతుల్లోంచి గ్యారేజ్ చేజారుతున్న సమయంలో మాయ చెప్పిన మాట అతనిలో కొత్త ఆశలు రేపుతుంది. రాకీకి మాయ చెప్పిన విషయం ఏమిటీ? ఆమె ద్వారా కష్టాల్లోంచి బయట పడిన రాకీ తిరిగి కొత్త చిక్కుల్లో ఎలా పడ్డాడు? కాలేజీ టైమ్‌లో అతను ప్రేమించిన ప్రియా (మీనాక్షి చౌదరి) ఎందుకు గొడవ పడి వెళ్లిపోయింది? తిరిగి రాకీ, ప్రియా ఒక్కటి అయ్యారా? రాకీకి సాయం చేయడం వెనుక మాయ... మర్మం ఏమిటీ? అనేదే 'మెకానిక్ రాకీ' కథ.


సినిమా ప్రారంభం ఆసక్తికరంగా ఉన్నా.... విశ్వక్ సేన్ తన ఫ్లాష్ బ్యాక్‌ను మొదలెట్టగానే బోర్ కొట్టేస్తుంది. తాతగానూ విశ్వక్ నటించి చికాకు తెప్పించాడు. ఆ బాడీ లాంగ్వేజ్, ఆ ఓవర్ యాక్షన్ తట్టుకోవడం కష్టమే. ఇది కామెడీ సీన్ కాస్తంత నవ్వండి అన్నట్టుగా ఆ సన్నివేశాలు ఉంటాయి. ఇక గ్యారేజ్ కాపాడుకోవడానికి అతను చేసే ప్రయత్నాలు ఆసక్తికరంగానే ఉన్నాయి. కానీ ప్రథమార్ధం మరీ ఫ్లాట్‌గా సాగి ప్రేక్షకుల సహనానికి పరీక్ష పెడుతుంది. ఇంత దారుణమైన సినిమా గురించి అంతగా గొప్పలు చెప్పారేమిటనే సందేహమూ వస్తుంది. అయితే... క్లైమాక్స్‌కు కాస్తంత ముందు అసలు ట్విస్ట్ మొదలవుతుంది. ఆ తర్వాత దానిని మించి మరో ట్విస్ట్ ఇచ్చాడు దర్శకుడు. ఎత్తుకు పై ఎత్తుగా ఈ రెండూ ఉన్నా... క్లయిమాక్స్‌కు వచ్చే సరికి మళ్లీ సాదాసీదాగా అయిపోయింది. దాంతో ప్రథమార్ధంతో పోల్చితే ద్వితీయార్థం ఫర్వాలేదనిపించినా... మొత్తంగా రిపేర్లను మెకానిక్ రాకీ పూర్తి చేయలేదనే భావనే కలుగుతుంది. ఇవాళ సైబర్ క్రైమ్ విపరీతంగా పెరిగిపోయింది. ఏదో రకంగా జనాలను మోసం చేయడమే పరమావధిగా పెట్టుకుని కొందరు ప్రయత్నాలు చేస్తున్నారు. ఏ మాత్రం ఏమరపాటుతో ఉన్నా... వారి బుట్టలో పడి డబ్బులు కోల్పోవడం ఖాయం. చిత్రం ఏమంటే చదువుకున్న వారే ఎక్కువగా ఇలాంటి వారి వలలో చిక్కుకుంటు న్నారు. ఈ నేపథ్యంలో తెరకెక్కిందే 'మెకానిక్ రాకీ' సినిమా. మధ్యతరగతి మనుషుల అవసరాలను ఆసరాగా చేసుకుని సైబర్ క్రైమ్ కు పాల్పడే ముఠా కథ ఇది. ప్రజలను ఎడ్యుకేట్ చేయడం ఈ సినిమా మెయిన్ మోటో అయినా... దానిని చివరిలో చూపించడంతో అప్పటికే ప్రేక్షకుల సహనం చచ్చిపోయి... 'ఏదో మంచి విషయమే చెప్పారులే'! అని నిట్టూర్చే పరిస్థితి నెలకొంది.

నటీనటుల విషయానికి వస్తే... విశ్వక్ సేన్ ఎప్పటిలానే తన పాత్రకు చక్కటి న్యాయం చేశాడు (తాత పాత్రతో తెప్పించిన ఇరిటేషన్‌ను పక్కన పెడితే)! మీనాక్షి చౌదరికి ఇది ఈ యేడాది తెలుగులో నాలుగో సినిమా. మరో రెండు తమిళ చిత్రాల్లోనూ ఆమె నటించింది. మొన్నొచ్చిన 'లక్కీ భాస్కర్'తో సక్సెస్‌ను అందుకున్నా... ఆ తర్వాత వచ్చిన 'మట్కా', ఈ సినిమా కూడా ఆమెకు నిరాశనే మిగిల్చాయి. తన వరకూ తాను బాగానే చేసింది. నాని 'జెర్సీ'తో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన శ్రద్ధా శ్రీనాథ్ కాస్తంత భిన్నమైన పాత్ర చేసి మెప్పించింది. ఇతర ప్రధాన పాత్రలను నరేశ్, సునీల్, హైపర్ ఆది, హర్షవర్ధన్, వైవా హర్ష, రఘురామ్ తదితరులు పోషించారు. జేక్స్ బిజోయ్ పాటలు ఓకే. నేపథ్య సంగీతం బాగానే ఉంది. నిర్మాత రామ్ తాళ్ళూరి నిర్మించిన 'మట్కా' దీనికి ముందు విడుదలై ఘోర పరాజయం పాలైంది. దానితో పోల్చితే... 'మెకానిక్ రాకీ' కాస్త బెటర్ మూవీ! అలానే ఆయన నిర్మించిన వెబ్ సిరీస్ 'వికటకవి' కూడా జీ5లో ఇప్పుడు స్ట్రీమింగ్ అవుతోంది. ఓ రకంగా నిర్మాతగా ఈ నెల ఆయనకు మిశ్రమ స్పందన లభించింది. ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమైన రవితేజ ముళ్లపూడిలో విషయం ఉంది కానీ బలమైన టెక్నికల్ టీమ్ అతనికి లభించాలి. మరి రెండో ఛాన్స్ దక్కించుకుంటాడో లేదో చూడాలి!

**అరుణ**, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్

# ఈశాన్య భారత్‌కు యునెస్కో తొలి సత్కారం


ఇటీవలి కాలంలో భారతదేశానికి చెందిన ఐదు చారిత్రక ప్రదేశాలను కొత్తగా ప్రపంచ స్థాయి సాంస్కృతిక వారసత్వ సంపదలుగా యునెస్కో ప్రకటించింది. అలాంటి భారతీయ సాంస్కృతిక వారసత్వ సంపదగా మొయిదమ్‌లను ఈ ఏడాది ప్రకటించింది. జూలై 26, 2024లో ఇందుకు సంబంధించిన ప్రకటనను యునెస్కో వెలువరించింది. ఇవి అస్సాంలో ఉన్నాయి. నిజానికి ఇవి అహోం (తామి-అహోం వంశం) గిరిజన పాలకుల శ్మశాన వాటికలోని సమాధులు. మొయిదమ్ అన్న పదం ఫారంగ్ మాయి అనే పదం నుంచి వచ్చింది. అంటే అర్థం ఆత్మలను ఖననం చేయడం. భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ యునెస్కో నిర్ణయం పట్ల హర్షం ప్రకటించారు. దీనితో భారత్‌లో యునెస్కో ప్రకటించిన చారిత్రక వారసత్వ సంపద కలిగిన కట్టడాల సంఖ్య 43కు పెరిగింది. మొయిదమ్‌లను కూడా ఆ జాబితాలో చేర్చడం మరొక విశేషమే. ఎందుకంటే ఈశాన్య భారతదేశం నుంచి ఆ హోదాను అందుకున్న తొలి కట్టడం ఇదే. 2021 నుంచి 2024 మధ్య భారతదేశంలోని ఐదు స్థలాలను యునెస్కో గుర్తించింది, హోదా ప్రకటించింది. మొయిదమ్ శ్మశాన వాటికకు 700 ఏళ్ల చరిత్ర ఉంది. పట్కాయ్ పర్వత శ్రేణులలో ఇది ఉంది. ఇక్కడి సమాధులనే మొయిదమ్స్ అంటారు. ఇవన్నీ గుమ్మటాలల ఉండి లోపల ఖాళీగా ఉంటాయి. అవి 90 ఉన్నాయి. అయితే వీటిలో ఎక్కువ అదృశ్యమైపోయాయి. గదాధర్ సింఘ, రుద్ర సింఘ అనే తండ్రీ కొడుకుల మొయిదములు మాత్రం ఉన్నాయి. చనిపోయిన వ్యక్తి సామాజిక హోదాను బట్టి మొయిదముల ఎత్తును నిర్ధారించేవారు. వీరి ఖనన పద్ధతి ఈజిప్ట్ పాలకుల సంప్రదాయాన్ని పోలి ఉండేది. పాలకుడు చనిపోయిన తరువాత పరలోకాలలో అతని అవసరాలు తీరడానికి వీలుగా వస్తువులను, బానిసలను, భార్యలను కూడా ఆ శ్మశానాలలో ఉంచేవారు.





From: **JAGRITI Telugu Weekly**
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com


Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 77 Issue : 06


# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు

















వెల : ₹.360/- | వెల : ₹.390/- | వెల : ₹.220/- | వెల : ₹.360/- | వెల : ₹.200/-





















వెల : ₹.300/- | వెల : ₹.300/- | వెల : ₹.240/- | వెల : ₹.100/- | వెల : ₹.200/-




వెల : ₹.110/- | వెల : ₹.799/- | వెల :₹.495/- | వెల : ₹.549/- | వెల : ₹.399/-

**పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : కేశవనిలయం, బర్కత్‌పురా, హైదరాబాద్ -27. 040-27563236, 9290127329

వై.ఎం.ఐ.ఎస్. బిల్డింగ్, సిబిఐ ఆఫీస్ రోడ్, కోఠీ, హైదరాబాద్. 9440589722,

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, రామమందిరంవీధి, గవర్నరు పేట, విజయవాడ - 2. 8333812687